


# అక్షర కేతనం




ఆచార్య మసన చెన్నప్ప

# అక్షర కేతనం

(సాహిత్య వ్యాస సంపుటి)

ఆచార్య మసన చెన్నప్ప

ప్రమీలా ప్రచురణలు

హైదరాబాదు

2008

www.etelangana.org

# AKSHARA KETHANAM
(Sahitya Vyasa Samputi)

By

**Prof. Masana Chennappa,** M.A., M.Phil., Ph.D.
Dept. of Telugu, Osmania University,
Hyderabad - 500 007

© Author

First Edition : **March 2008**

Copies:**1000**

Price : **Rs.** 60/-


***For Copies:***

1. **Pramila Prachuranalu**
   **"SHRESHTARAMAM"**
   9-76/2, Udaynagar Colony,
   Boduppal, Hyderabad - 500 039
   Phone: 040 - 27201007
2. **Visalandhra Publishing House**
   4-1-435, Bank Street, Vignan Bhavan,
   Hyderabad - 500 003 (And its all Branches)
3. **Navodaya Book House**
   Kachiguda, Hyderabad

***Type Setting & Printed at :***

**Mounika graphics**
1-4-27/71/187, P.S. Colony
Hyderabad - 500 080
Cell : 93910 41545

## అంకితం



యూ.జి.సి. సభ్యులు

ప్రొఫెసర్ కె. రామమూర్తినాయుడు గారికి

www.etelangana.org

## సౌజన్యమూర్తి!

తిరుమల వేంకటరమణుడు
అరుదగు తన కరముచేత నందించునుగా
స్థిరమగు కీర్తి ప్రతిష్ఠలు
అరయగ కే. రామమూర్తి ఆచార్యునకున్.

గంగ యమునల చెంతకు గంతులేస్తు
పోవుచున్నట్టి లక్ష్మిని పొదివి పట్టి
కృష్ణ గోదావరీ వాసులిష్టపడగ
రమ్యముగ తెచ్చి యిచ్చితి రామమూర్తి!

నాయకుడు మాకు నెపుడు జనార్దనుండు
ప్రేమతో మిమ్ము మాకు చూపించినాడు
ఇడుములుండవు మా పెద్ద బడులకింక
దివ్యగుణ సాంద్ర! శ్రీరామధీవరేణ్య!

దక్షిణాదిలో విశ్వవిద్యాలయాల
మంచి చెడ్డలు చూసెడి మహిత మూర్తి!
నీవు కేవల గురువువు కావు మాకు
రమ్యగుణకీర్తి! కులపతీ! రామమూర్తి!



www.etelangana.org

## కృతజ్ఞతలు

ఈ మధ్యకాలంలో ప్రముఖ పత్రికలలో అచ్చైన నా పరిశోధన వ్యాసాలను ఒక దగ్గరచేర్చి 'అక్షర కేతనం' అనే పేరుతో ఈ వ్యాస సంపుటిని తెచ్చాను. దీని ప్రచురణకు ఆర్థిక సహాయాన్ని అందించిన ఉస్మానియా యూనివర్సిటీ యూ.జి.సి వారికి ముఖ్యంగా ప్రొఫెసర్ ఎం. నరసింహాచారి (డీన్, డెవలప్‌మెంట్ & యూ.జి.సి. అఫైర్స్) గారికి నా కృతజ్ఞతలు. సిఫారసు చేసిన తెలుగు శాఖ పరిశోధక మండలికి, ముఖ్యంగా తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య కె. కుసుమారెడ్డి గారికి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య టి. కిషన్ రావు గారికి నా కృతజ్ఞతలు.

నా కోరిక మేరకు ఈ సాహిత్యవ్యాస సంపుటిని అంకితంగా స్వీకరిస్తున్న యూ.జి.సి సభ్యులు, పరిపాలనాదక్షులు, ప్రొఫెసర్ కె. రామమూర్తినాయుడు గారికి నా కృతజ్ఞతలు. నా సాహితీ వ్యాసంగాన్ని నిరంతరం ప్రోత్సహిస్తున్న ఓ.యు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు ప్రొఫెసర్ కె. జనార్దనరెడ్డి గారికి, ఔటా ప్రధానకార్యదర్శి ప్రొఫెసర్ బి. సత్యనారాయణ గారికి నా కృతజ్ఞతలు.

అందంగా ముద్రించిన మౌనికా గ్రాఫిక్స్ వారికి ముఖ్యంగా డి.టి.పి సహకారాన్ని అందించిన మా సోదరి ఆర్. పద్మజగారికి నా కృతజ్ఞతలు.

మసన చెన్నప్ప

## ఇందులో...


1. ప్రగతిశీల మానవతా మూల్యాలు 01
2. నానీలు - దేశీయత 10
3. ప్రబంధ సాహిత్యం - పారమార్థిక ప్రయోజనం 23
4. మను చరిత్ర - మన చరిత్ర 34
5. నారద గానమాత్సర్యం - ఒక పరిశీలన 47
6. వామనపురాణం - కథానుశీలనం 56
7. ఉపనిషత్తులలో స్త్రీ చైతన్యం 64
8. అన్నమయ్య - పోతులూరి వీరబ్రహ్మం 69
9. క్షేత్రయ్యపదాలలో శృంగారనాయికలు 75
10. తెలుగులో చాటుకవిత్వం 83
11. చిన్మయసూరి 94
12. తెలుగు - మరాఠీ అనుబంధాలు 97


www.etelangana.org

# 1. ప్రగతి శీల మానవతా మూల్యాలు

*"కవిత లేక యున్న యువత శూన్యంబౌను*
*యువతలేక యున్న నవత సున్న*
*నవతలేక యున్న నాగరకతలేదు*
*నాగరకతలేక నాడు లేదు"* – మహేంద్రోదయం

దేశానికి నాగరికత, నాగరికతకు నవత, నవతకు యువత, యువతకు కవిత ఎంత ముఖ్యమో కవితకు మానవత అంత ముఖ్యమని నా అభిప్రాయం.

ప్రపంచంలో ఏవాదమైనా, చివరికి వేదమైనా దానికి మానవత్వమే పునాది. నాల్గక్షరాల్లో వేదం ఇచ్చే సందేశాన్ని వింటే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. ఆ సందేశం 'మనుర్భవ' అనేది. దాని అర్థం మనిషివి కమ్మని.

ప్రేమ, త్యాగం, శాంతి, అహింస మొదలైన గుణాలను విడిచిపెట్టిన జాతి జాతే కాదు. కవిత కవితే కాదు. ఏ కాలంలోనైనా మనిషి ఆర్థికంగా, రాజకీయంగా ఎంత పురోభివృద్ధి చెందినా, అతడు మానవతామూల్యాలను విస్మరించక నడవవలసి వస్తుంది.

ఏ సాహిత్యమైనా అది మానవత్వ స్పర్శకు నోచుకోకపోతే అందులో జీవకళ లోపించినట్లే. కనుకనే సంఘంలో అమానవీయ సంఘటనలు జరిగినప్పుడు కవులు స్పందించి మానవతా మూల్యాలను నెలకొల్పాల్సిన అవసరమేర్పడుతుంది. కాని నేటి సమాజాన్ని చూసినప్పుడు మనిషిని మనిషిగా చూసే అలవాటు క్రమంగా లోపిస్తుందేమో అనిపిస్తుంది. అన్ని రంగాలలో ఒక్కొక్క మెట్టు అధిరోహిస్తున్న మనిషి నైతిక విలువల దగ్గరకు వచ్చేసరికి ఒక్కొక్క మెట్టు కిందికి జారిపోతున్నాడు. కులం, మతం, ప్రాంతం, దేశం, భాషా సరిహద్దుల్ని దాటలేకపోతున్నాడు. కట్టుబాట్ల పేరుతో, విశ్వాసాల పేరుతో అజ్ఞానం వైపు పరిగెత్తుతున్నాడు. ఇవన్నీ ఒక ఎత్తయితే మనుష్యత్వాన్ని అవహేళన చేయడం మరొక ఎత్తు. అహింస, సత్యం, అస్తేయం, నిగ్రహం మొదలైన ధర్మాలను విడిచి సంఘానికి భారంగా తయారు కావడం మానవతను ధిక్కరించడమే అవుతుంది.

దేన్నయినా హేతుబద్ధంగా ఆలోచించి, సత్యాన్ని అతిక్రమించకుండా,

www.etelangana.org

స్వార్థానికి తావు లేని విశ్వ మానవ కళ్యాణ దృష్టిని అలవర్చుకోవడమే ప్రగతిశీల మానవతా దృక్పథం. మార్క్సిజంతో సంబంధం లేనివారు, మార్క్సిజంతో ప్రభావితులైనప్పటికీ, మార్క్సిస్టు కవులుగా కాక తద్భిన్నంగా అభ్యుదయగాములైన కవులే ప్రగతిశీల మానవతావాద కవులు. ప్రపంచ సమస్యలన్నీ వీరి కవితా వస్తువులే. ఏకీకృతమైన 'ఆధునిక చేతన' వీరి కవితల్లో కనిపిస్తుంది.

తెలుగు సాహిత్యాన్ని గమనిస్తే శ్రీశ్రీలాంటి మార్క్సిస్టు కవులతో పాటు మార్క్సిజం ప్రభావం లేని ప్రగతిశీల మహాకవులూ కనిపిస్తారు. గురజాడ మీద ఏ మార్క్సిజం ప్రభావం ఉంది? తిలక్ మీద మార్క్సిజం కంటే మానవతావాదమే ఎక్కువ ప్రభావాన్ని చూపెట్టింది. అస్పృశ్యతా నివారణకై జీవితమంతా పోరాడిన జాషువా, నిజాంకు వ్యతిరేకంగా కలాన్ని నడిపించిన దాశరథి మార్క్సిస్టు కవులు కానే కారు. ఏ వాదాలకూ, నాదాలకూ లొంగని సి. నారాయణ రెడ్డి అచ్చమైన ప్రగతిశీల మానవతావాద కవి.

అభ్యుదయ వాదం సంప్రదాయం మీద తిరుగుబాటును ప్రకటించింది. కాని ప్రగతిశీల మానవతావాద కవులు గుడ్డిగా సంప్రదాయం మీద తిరుగుబాటు చేయరు, దాన్ని పునరుద్ధరించే ప్రయత్నమూ చేయరు. ఒక జాతి బతికి ఉన్నంతకాలం జీవితానికి అవసరమైన మౌలిక మూల్యాలు అవసరమని వీరు గుర్తించారు. కొలనులో ఒక చోట పుట్టిన తరంగం కొలనంతా వ్యాపించినట్లు, మనిషిలో పుట్టిన మంచితనం సమాజాన్ని ఆవరించాలన్నదే వీరి సంకల్పం.

ఈ వ్యాసంలో నేను గత ఇరవై సంవత్సరాల సాహిత్యాన్ని దృష్టిలో పెట్టుకుని సినారె, శేషేంద్ర, భీమన్న, గోపి మొదలైన కవుల కవిత్వంలోని ప్రగతిశీల మానవతా వాద మూల్యాలను తెలియజేశాను.

అడుగడుగున మానవత్వానికి ఎదురయ్యే అడ్డంకుల్ని సి. నారాయణరెడ్డి నిరసించాడు.

*"సూర్యశిశువు గొంతు నొక్కెయ్యాలని*
*కటిక మబ్బులు ఎత్తులు వేస్తుంటే*
*అది అక్రమమని అరిచేస్తాను"* *(కలిసి నడిచే కలం).*

సహనమే సంస్కృతి, సంప్రదాయం అని చెప్పినవారున్నారు. కాని ఆధునిక





కవి సినారె ఆ సహనం ఎంతవరకు అవసరమో తెలిసి నడవాలంటాడు.

*"ఎట్టివానికి వాని సహనము*
*బట్టి విలువలు రెమ్మ వేయును*
*సహనమే సంస్కృతి యటన్న వ*
*చస్సు అక్షర లక్ష సేయును"*

అని సమదర్శనంతో చెప్పిన సినారె ఇటీవలి 'కలిసి నడిచే కలం'లో-

*"సహనానికి కూడా హద్దుంటుంది*
*అది ఆ హద్దు దాటిందా*
*అగ్రపీఠాల కీళ్లకు కీళ్లు విరిగిపోతాయి*
*శ్రమజీవులు కరిగించే కండలు*
*కణకణలాడే నిప్పుల జెండాలై ఎదురు తిరుగుతాయి"*

అనడం, సమయమొస్తే ఆ సహనం హద్దులు దాటి గద్దెలను కూలుస్తుందని హెచ్చరించడమే. ఇంకా ఆయన సమాజ వికాసానికి దోహదపడే మేధావుల్ని ఉద్దేశించి,

*"ఓ మేధావి మండలమా!*
*నీ సహజ సహనాన్ని ఉప్పున ఊదేసి*
*హుంకరించి తిరగబడితే తప్ప*
*అక్రమాలు నిష్క్రమించవు*
*కల్తీ లేని మానవీయ మూల్యాలు విక్రమించవు"* అని
ప్రబోధించాడు.

సంప్రదాయం మీద తిరుగుబాటు కంటే మనిషిలోని స్వార్థం, మత మౌఢ్యం, యుద్ధ పిపాస, ద్వేషాది దుర్గుణాల మీద తిరుగుబాటు చేసినవారు ప్రగతిశీల మానవతావాద కవులు.

*"పచ్చి నెత్తుటితో ప్రమిదను*
*వెలిగించాలనుకోవడం వెర్రితనమే*
*నా దగ్గరున్న స్నేహభాండాన్ని అందుకో"*

(అక్షరాల గవాక్షాలు, పుట 51)



www.etelangana.org

స్నేహమంటే నూనె అని కూడా అర్థం. స్నేహంతో వెలిగించిన దీపాలు కలకాలముంటాయని కవి భావన.

*"మనిషి నశించినా*
*నశించదు మానవత్వం*
*అదే ఈ లోకానికి మణిసోపానం"*

అన్న సినారె విశ్వంభరలో మానవుడినే నాయకుడిగా చేసుకొని మానవత్వాన్ని కేతనంగా రెపరెపలాడించాడు.

విప్లవ కవిత్వమని ఒక లేబిల్ పెట్టుకోవడం కంటే విప్లవాన్ని ఒక వస్తువుగా తీసుకోవాలనే శేషేంద్ర వైదిక, ఔపనిషదిక సంస్కృతిని మానవతావాదంతో సమన్వయించి కవితారచన సాగించాడు. అధర్మమనే రాక్షసికి డబ్బు, అధికారం అనే బలమైన రెండు చేతులుంటాయని, అవి ప్రజల గొంతులను నులిమి, సత్యానికి సంకెల వేశాయని కవి పలికిన పలుకులు యథార్థమైనవి.

*"ఏనయనధర్మరాక్షసి యనేక శిరస్సుల యుగ్రమూర్తికిన్*
*ఘనతరమైన యర్థమధికారము రెండు ప్రచండ బాహువుల్*
*జనుల గళమ్ములన్ నులిపి సత్యముకున్ నిగళమ్ము వేసి తా*
*ననయము వీర తాండవ విహారము సేయును విశ్వవీథులన్"*

(వచ్చింది ఓట్ల ఋతువు, పుట 3).

ఇట్లే మానవ సంబంధాలు మారిపోతున్న దశను అక్షరబద్ధం చేశాడు శేషేంద్ర.

*"సూర్యుడ్నించి సూర్యుడికి*
*ఇరవై నాల్గు గంటల దూరం*
*మనిషి నుంచి మనిషికి*
*రెండు గుండెలే దూరం"* (అరుస్తున్న ఆద్మీ).

ఐనా ఆప్యాయతకు, ఆత్మీయతకు మనుషులు నోచుకోకపోవడం బాధాకరమైన విషయం. శేషేంద్ర ఆర్తుల అంతరంగాలకు దగ్గరగా నిలిచిన వాడు కనుకనే మానవత్వం చిప్పిలే మాటలు రాశాడు.

*"గుండెలతో నాకు దోస్తీ*
*నేనుండేది బాధల బస్తీ"*





కొందరు బీదల బస్తీల్లో ఉంటారు కాని వారి బాధల్ని పట్టించుకోలేరనే వ్యంగ్యార్థం స్ఫురిస్తుంది పై పంక్తుల్ని చదివినప్పుడు.

కొందరికి నాగస్వరం ఊదడం, పాములను ఆడించడం సంప్రదాయంగా వస్తున్న విద్య. కవి శేషేంద్ర దేశంలో పెరిగిన దారిద్ర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఇలా అంటాడు.

*"నాలుగు ముష్టి గింజల కోసం నాగస్వరం ఊదే తెగ తెగ పెరిగింది*
*కనుక నాగస్వరం ఊదే క్షుద్ర విద్య నేర్చుకోకండి*
*పామును చంపే ఉన్నత విద్య నేర్చుకోండి"*

పాముకు పాలు పోస్తే అది మనల్ని కాటు వేయడం అందరికీ తెలిసిందే. ప్రతి వ్యక్తి తల ఎత్తుకొని జీవించాలని, తలవంచి యాచించడం తగదని ఉద్బోధిస్తున్న కవితా ఖండిక ఇది.

మానవతా మూల్యాలను సాహిత్యంలో ప్రదర్శించిన మరొక కవి శ్రేష్ఠుడు బోయి భీమన్న. చిన్నదానికి పెద్దదానికి మనుషులలో పోట్లాడే స్వభావం హెచ్చి అదే యుద్ధాలకు దారి తీస్తుందని భీమన్న హెచ్చరించాడు. కులపోరాటాలను, మతయుద్ధాలను ఆయన హేయమైనవిగా భావించినాడు.

*"కుర్రవాళ్లిద్దరాటలో కొట్టుకొన్న*
*ఆ కులాలు, మతాలు పోరాడి చచ్చు*
*జాతి నైజమిట్లే కొనసాగునేని*
*మార్పు ఎన్నడు వచ్చు నీ మనుజ సృష్టి"*

(పంచమస్వరం,పుట160)

మానవత్వాన్ని దెబ్బ తీసే దుర్గుణాలకే అరిషడ్వర్గం అని పేరు. భీమన్న షడ్గుణాలకు పెట్టిన పేరు 'సెక్యూరిటీ గార్డులు'.

*"కామక్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు*
*ఆరూ మనిషికి శత్రువులనడం*
*ఎంత అజ్ఞానం!*
*ఇవి శత్రువులు కావు*
*సెక్యూరిటీ గార్డులు"*



www.etelangana.org

ఇవి లేకపోతే బతకలేమనడంలో ఎంతో వ్యంగ్యం దాగుంది.

బడికి వెళ్లేది ప్రభుత్వోద్యోగం చేయడానికి కాదని భీమన్న 'మనిషిగా బ్రతుకు' అనే కవితా ఖండికలో అభిప్రాయపడుతాడు.

***"పట్టభద్రుడవయింది ప్రభుత్వ సేవకేనా?***
***ప్రజాసేవ చేసేది పదవి కోసమేనా?***
***వనజాక్షిని ప్రేమించింది వంట పనికేనా?***
***తండ్రి ఆస్తి తగలేసేది తాగడానికేనా?***
***అయితే, ఇక నీవు మనిషిగా బ్రతికేదెప్పుడు?"*** గిల్లి చెబుతున్నా, పుట,81).

వామనుని కథ మనకందరికీ తెలుసు. అసమర్థుని ఆశకు, వంచనకు ప్రతీకగా ఆ కథను భీమన్న గ్రహించాడు. అందుకే తనవారు ఎన్నడూ వామనులు కారాదని త్రివిక్రములు కావాలని ఉద్బోధించాడు.

***"వామనుడె త్రివిక్రముడయి వరలె నాడు***
***జాతియే వామనము నేడు జగతియందు"***(పంచమస్వరం,పుట,18)

ఒకచోట ఆయన మానవత్వంలేని వారు చచ్చినా నష్టంలేదని అంటాడు. కడుపునిండా తిని కూడా, చాలలేదని దుర్భాషలాడడం సముచితం కాదంటాడు.

***"మానవ ప్రాణ సమదృష్టిలేని నరులు***
***చచ్చినను లోపమేమిటి? చావనిందు!***
***కులమతాల పుట్టల నుండు కుమతులెపుడు***
***తినుచునే తిండి లేదని తిట్టుచుంద్రు"***(పంచమస్వరం పుట, 160)

దీన్నే భీమన్న అమానుషమైన నైజం అంటాడు. భీమన్న దృష్టిలో మానవత్వం అంటే తల్లిదండ్రుల మీద పిల్లలకు భక్తి, పిల్లల మీద తల్లిదండ్రులకు వాత్సల్యం ఉండడం కూడా. ఈ సంప్రదాయాన్ని పాటించాలని ఆయన మరీ మరీ ఉద్బోధిస్తాడు.

***"తాను సంతానవంతుడై తండ్రియైన***
***నరుడు క్షణమాగి, ముందు వెన్కలకు చూడ***
***వలయు, భక్తివాత్సల్య దైవముగ ఎదిగి***
***ఉభయులను సాకవలయు సర్వోన్నతముగ"*** *(పంచమస్వరం, పుట, 160)*
***"మనుజత్వమె గమ్యమెవరి మనుగడకైనన్"***

అని ఆయన శాసిస్తాడు కూడా.





ప్రగతి శీల మానవతా వాదకవి డా॥ఎన్.గోపి అమ్మను మానవత్వానికి ప్రతీకగాభావిస్తాడు.

"స్వార్థాల చౌరస్తాలో విడిపోయిన పెదవులు అమ్మదగ్గర తప్పక కలుస్తాయి" అంటాడు 'వంతెన'లో. రక్తపాతాలు లేని నగరంలో జీవించాలని ఎవరికైనా ఉంటుంది. కాని "మనుషుల్ని కలిపే పాత వంతెనలు మృత్యువును మోసుకొస్తుంటే" మనం మౌనంగా ఎలా ఉంటాము? "గుప్పెడు బాకుల నాట్యాల ముందు అరవైలక్షల పిడికిళ్లు తలొంచుకోవాలా?" అని భాగ్యనగరంలో జరిగే మత కలహాలను దృష్టిలో పెట్టుకొని చెప్పినప్పటికీ, ఎక్కడివారైనా అమానవీయ శక్తుల్ని ఎదిరించవలసిందేనన్న కవి బలమైన కోరిక వెల్లడవుతుంది. భూమి మీద మానవత్వం అనే తరువు ఎక్కడ పుష్పించినా, దాని సుగంధం అందరికీ అందుతూనే ఉంటుంది. దక్షిణాఫ్రికాలో తెల్లవాళ్ల రాక్షసత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన మహాయోధుడు నెల్సన్ మండేలా. ఆయన జైలు నుంచి విడుదలైనప్పుడు డా॥గోపి –

***"నీ విడుదల మానవత పెదవిపై వెన్నెల"*** అన్న మాటలు మరవలేనివి.

అడుక్కోవడం అలవాటైంది. దేశంలోని పేదలు తిండిగింజలకోసం దేబిరిస్తుంటే, దేశమేమో ప్రపంచ బ్యాంకు ముందు డబ్బుకోసం మోకరిల్లుతుంది. మానవత్వాన్ని విస్మరించి, డబ్బుకే ప్రాధాన్యం ఇచ్చిన ప్రపంచాన్ని గూర్చి గోపి తన నానీల్లో ఇలా అంటాడు.

***"మనుషుల మధ్య***
***రూపాయి వంతెనైతే***
***మానవత్వం పని***
***అంతేమరి"***

ఆచార్య తిరుమల తన "అమృతాన్వేషణ"లో మనిషిలోని హింసా ప్రవృత్తిని ఇలా వివరించాడు.

***"విరుచుకుపడి విధ్వంసం చేసి***
***విజయం పేరుతో రక్తకేతనాలెగరేసి***
***సర్వాన్ని ఒక ముద్దలా కబళించాలనే కోరికను నేను"***

ఈ పంక్తుల్ని చదువుతూ ఉంటే అమెరికా జ్ఞాపకం వస్తుంది. ప్రగతి శీల మానవతావాదకవి దేవుని ముందు వట్టిగా చేతులు ముడుచుకొని నిలబడడు.



www.etelangana.org

ఆ దేవుణ్ణి కూడా అవసరమైతే ప్రశ్నిస్తాడు.

*"నన్ను నేను ఉద్ధరించుకోవాలా?*
*మరి నీవు దేనికి*
*కత్తితో రెక్కలు నరికిన పక్షికి*
*గగనమండలాన్ని చూపెడుతావా?"*

కష్టం కలిగిన తరవాత కాకుండా, ఆ కష్టం రాకముందే ఓ దైవమా! నీవు జాగ్రత్త తీసుకుంటే మనిషికి ఏ ఇబ్బంది ఉండదు కదా అని పై కవితోక్తి తాత్పర్యం.

ఆచార్య శ్రీధర ప్రగతి శీల భావాలున్న కవి. వేదాల మీద, ఉపనిషత్తులమీద అచంచలమైన విశ్వాసం ఉన్న ఈ కవి 'ఆగ్నేయాస్త్రమ్' లో పిలుపు అనే ఖండికలో ఇలా అంటాడు.

*"ఓ సూర్యున్ని పుట్టిద్దాం*
*వస్తావా? చంద్రనిప్పుల బాటలో*
*ఓ చీకటిని చంపేద్దాం*
*తెస్తావా? వెలుగు రవ్వల ఖడ్గధార*
*ఓ చంద్రుణ్ణి బ్రతికిద్దాం*
*పూస్తావా? చల్లని వెన్నెల స్నేహలేపనం*
*ఓ తారకను పిలుద్దాం*
*అరుస్తావా? ఆత్మీయానురాగ కంఠంతో"*

చంద్ర నిప్పులబాట అంటే ఉద్యమమే. వెలుగు రవ్వల ఖడ్గం అంటే జ్ఞానం. ఐతే స్నేహ సంబంధాలకు, ఆత్మీయానురాగాలకు బద్ధుడు కావడం ఈ కవి ప్రత్యేకత.

*"అతివమానం దాచగా ఓ వస్త్రమౌతాను*
*అన్యాయాంకుర ఖండనలో ఓ ప్రహారమౌతాను"*

అని శ్రీధరాచార్య మానవతా మూల్యాలకు పెద్దపీట వేశాడు.

తక్కువ కవిత్వమే రాసినా ఛాదస్తం లేని విధంగా మానవత్వాన్ని ఆవిష్కరించాడు సుధామ. ఆకలిని మరిచిపోయినా, ఆకలి గొన్నవాణ్ణి మాత్రం మరవొద్దంటాడు 'అగ్ని సుధ'లో ఆయన.





*"మహాత్ముల గురించి పాడుకుంటూ*
*మనిషిని – సాటి మనిషిని*
*తనంతైనా తిండీ బట్టా గూడూ*
*దొరకని వాడిని మరిచి మరిచి పోయే*
*నికృష్ట హైన్యంలోంచి కలం బయటపడాలి"*

మనవత్వానికి ప్రపంచీకరణ ఏ విధంగా ప్రతిబంధకంగా మారిందో ప్రగతిశీల కవి ఒబ్బిని మాటల్లో విందాం.

*"అప్పుడెప్పుడో వాడుక*
*పుష్కరాలప్పుడు పుట్టారనో*
*ఫలానా అప్పుడు పుట్టారనో,*
*ఇప్పటి వాడుక సంస్మరణ కాలంలో పుట్టారని*
*ప్రపంచ బ్యాంకు పుష్కరంలో పుట్టారని...* అని ప్రపంచీకరణను నిందిస్తాడు.

ఈ దేశంలో "అమ్మలున్నారు, అన్న దాతలున్నారు,ఆలోచనాపరులున్నారు, సమస్తసంపదా ఉంది, సమస్త నైతికతాఉంది, కాని ప్రపంచీకరణ నేపథ్యంలో ఒకరి శిశువుకి మరొకరు బారసాల జరపటమేమిటని ప్రశ్నిస్తాడు ఒబ్బిని.

ఈ విధంగా ప్రగతిశీల కవులు ఆకలి మొదలుకొని, అమెరికా వరకు కవితా వస్తువును స్వీకరించి, అజ్ఞానంమీద, అన్యాయం మీద తమ పోరాటాన్ని సాగించారు. అనాదిగా వస్తున్న, అహింస, స్వేచ్ఛ, సహజీవనం, శాంతి, సౌభ్రాతృత్వం మొదలైన మానవీయ మూల్యాలను తమ కవిత్వంలో నిబంధించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడానికి నడుంకట్టారు.



www.etelangana.org

# ౨. నానీలు - దేశీయత

స్వస్థాన వేషభాషా సంస్కృతులను ప్రతిబింబించే కవిత్వాన్ని స్థూలంగా 'దేశి' పేరుతో పిలవవొచ్చు. ఆధునిక ప్రపంచీకరణ నేపథ్యంలో ఏది దేశో, ఏది దేశి కాదో చెప్పడం కష్టమవుతుంది.

మనం ఎక్కడి వాతావరణంలో జీవిస్తున్నామో, ఎక్కడి పరిస్థితులతో మమేకమవుతున్నామో, ఎక్కడి ఆలోచనలకి మన మెదళ్లని అంకితం చేస్తున్నామో, ఎక్కడి భాషకు మన గుండెను జతపరుస్తున్నామో అక్కడ వుంది దేశీయత.

సంపూర్ణ దేశీయ ఛందోవిభాగానికి చెందిన కవితాప్రక్రియే నానీ. తంగెడుపూల కవిగా ప్రస్థానాన్ని మొదలు పెట్టిన డా॥ గోపిగారు నేడు దేశమంతా గుర్తించగలిగిన నానీల సృష్టికర్తగా ఎదిగిపోయారు.

*"గుట్ట జాతరలో/ రంగుటద్దాలు కొన్నాను*
*లోకం / అప్పుడిలా కనిపించలేదు"*

చిన్నప్పుడు రంగుటద్దాల్లోంచి చూసినా లోకం మాత్రం అంత మార్పు లేకుండా ఉండేది. కాని ఇప్పుడు రంగుటద్దాలు పెట్టుకోకున్నా రంగులమయంగా కనిపిస్తుంది. ఎప్పటికప్పుడు రంగులు మార్చే ప్రపంచాన్ని చూడటానికి ఇప్పుడు రంగుటద్దాల అవసరం లేదని కవి ఉద్దేశం.

వాకిళ్లలో ముగ్గులేయడం దేశీయాచారం. కాని అమ్మాయిలు అబ్బాయిలతో కలసి వాకిళ్లలో కాక, సముద్ర తీరాలకు వెళ్లి ఇసుకలో ఆ పని చేస్తున్నారు. మన ఆచారాలు సముద్రం పాలవుతున్నయనే వ్యంగ్యాన్ని స్ఫురింపజేసే నానీని గమనించండి.

*"సముద్ర తీరంలో/ ముగ్గులేస్తున్నారా*
*వాకిలిని / మర్చిపోయి"*

వాకిలిని మరిచిపోయి అనే మాటలో ఎంతో అర్థం ఉంది. నీ సొంతం ఏదో దాన్ని విడిచి పెట్టడం ధర్మం కాదనే సందేశం కూడా ఉంది ఇందులో. "ఉపస్థితం పరిత్యజ్య అనుపస్థితం యాచత ఇతి బాధితన్యాయః" అన్న మహర్షి దయానందుల వాక్యం ఈ సందర్భంలో నాకు గుర్తొస్తుంది. దగ్గరున్న దాన్ని గోపి





విడిచి పెట్టి దూరంగా ఉన్నదాన్ని పట్టుకోవడం మర్యాద కాదని దాని భావం. మరి దేశీయతను కూడా విడిచి పెట్టరాదు.

వివాహం అనేది అంతా సంతోషంగా జరిగే ఒక సంస్కారం. కాని వివాహాలలో అప్పగింతలనే ఆచారం ఎవరికైనా కళ్లల్లో నీళ్ళు తెప్పిస్తుంది. గోపిగారు రచించిన ఈ నానీ అప్పగింతల దృశ్యాన్ని కళ్లముందు నిలుపుతుంది.

*"వీడ్కోళ్లలో/ పెళ్లి వీడ్కోలు క్లయిమాక్స్*
*అన్ని కళ్లూ / సమష్టిగా వర్షిస్తాయి"*

ఏ దేశవు చెట్టయినా అది వీచే గాలి ఒక్కటే. వేపచెట్టు గాలీ అంతే. కాని ఈ మధ్యే అమెరికా దేశం మనం ఇష్టపడే వేపచెట్టు మీద పేటెంట్ హక్కులు కొట్టేసింది. ఈ బాధను కంఠదఘ్నంగా అనుభవించిన కవి నోటి నుండి వెల్వడ్డ నానీ ఇది.

*"వేపచెట్టు / అమెరికా గాలి వీస్తుందా?*
*వెళ్లి / కొత్త లేబుల్స్‌తో వస్తుందేమో?"*

దేశీయతకు నిదర్శనంగా నిలిచిన నానీలు ఇలాంటివి గోపి గారి కవిత్వంలో కోకొల్లలు లభిస్తాయి.

*"నగరంలో పుట్టడం / లోపం కాదు*
*పల్లెల్ని మర్చిపోవడం/ పాపం"*

అని గోపిగారు తనకు పల్లెలంటే ఎంత ఇష్టమో తెలిపారు. పిల్లల్ని నగరాలకు పంపించి, వాళ్లు చదివి ఏ గొప్ప ఉద్యోగాలో చేయాలని కలలు గంటారు తల్లులు.

*"అమ్మ / చేట ముందేసుకుంది*
*పిల్లాడి ఉద్యోగం కోసం / దేట్లు లెక్కిస్తుంది"*

అనే నానీ ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది.

నగరంలో ఉండి పల్లెనూ, విదేశాలకు వెళ్లి స్వదేశాన్నీ, కొత్త స్నేహితులను సంపాదించి పాతవాళ్లనూ విస్మరించేవాడు మనిషే కాదు! గోపి తన అభిజనాన్ని మరిచిపోలేని దేశీయకవి. లేకపోతే తాను పుట్టిన ఊరి కళ్లల్లో నీళ్లు నిలిస్తే అతడు ముత్యాలుగా ఎలా భావిస్తాడు?

*"తన ఊళ్లో/ తానే పరాయిదైంది*
*తెలంగాణ పల్లె / గాయపడిన చెల్లె"*



www.etelangana.org

ఆలోచనల రెక్కలు కట్టుకొని ఆకాశంలో ఎంత దూరం వెళ్లినా, తిరిగి విశ్రాంతి కోసం సొంతగూటికి రావలసిందేనని ఈ నానీ మనకు గుర్తు చేస్తుంది.

చరిత్ర ఆనవాళ్లు తెలియకపోతే ఎంత గొప్ప కవైనా తక్కువైపోతాడు. గోపిగారు కేవలం కవే కాదు, ఒక చరిత్ర అధ్యయనశీలి.

***"చరిత్రను/ విస్మరించొద్దు***
***అది / త్రికాలాల మధ్య సంభాషణ"***

మూడు కాలాలను ముడివేసే శక్తి చరిత్రదన్న విషయం ఈ నానీలో స్పష్టమవుతుంది.

గోపి గారిది నల్లగొండ జిల్లా. ఊరు భువనగిరి. జిల్లా పేరే చెబుతుంది కొండ ప్రాంతమని.

***"ఆమె / రాళ్లు కొడుతున్నది నిజమే***
***గుండెలనూ/ తడుతుందేమో"***

ఈ నానీ అక్కడ కష్టపడే స్త్రీల జీవనస్థితిని మనకు ప్రత్యక్షం చేస్తుంది.

ప్రశాంతమైన వాతావరణమంటే ఇష్టం లేనివాడు అన్నివేళలా అశాంతికి కారణభూతుడవుతాడు.

***"చిక్కును విప్పే/ ఓపిక లేదా***
***కండెను/తెంపి పారేశావు గదరా"***

కండె గురించి చేనేత వృత్తి పరిజ్ఞానం గలవారికి వివరించవలసిన పని లేదు. వడికిన దారాన్ని జొన్న కర్ర లేదా సజ్జకర్ర లేదా ఇనుపచువ్వకు చుడితే అది 'కండె' అవుతుంది. దారాన్ని సురక్షితంగా ఉంచే కండెను పాడు చేసినవాడికి, చిక్కుబడ్డ దారాన్ని చక్కబరిచే శక్తి ఎక్కడిదని కవి ప్రశ్న. దేశీయ వృత్తి పరిజ్ఞానం వున్న కవులకే ఇలా రాయడం సాధ్యం. దీన్ని బట్టి మంచి వ్యక్తిని గాని, మంచి వ్యవస్థను గాని చూసి ఆనందించలేనివాడు, తాను మంచివాడై మంచి వ్యవస్థను ఏం సృష్టిస్తాడనే ప్రశ్న కలుగుతుంది.

ఛందస్సులోనే కాక వస్తుపరంగా దేశీయతను సంతరించుకొన్న గోపిగారి నానీలు ఇతర నానీ కవుల మీద ఎంతో ప్రభావాన్ని చూపాయి. ఆయా కవుల నానీల్లోని దేశీయతా సమగ్ర స్వరూపాన్ని ఇప్పుడు చూద్దాం.





నానీల తర్వాత గ్రంథరూపంలో వచ్చిన మొదటి నానీల సంపుటి ఎస్.ఆర్. భల్లం "గూడు వదిలిన గువ్వలు". ఈ నానీలు ఏ మాత్రం దేశీయతను విడవలేదు.

జీవితం అంటే ఆసుపోయడమంటాడు ఒక నానీలో కవి. చేనేత పనివారికి ఆసువోయడం నిత్యకృత్యం. ముఖ్యంగా స్త్రీలు ఈ పని చేస్తారు. తెగకుండా దారాన్ని ఆసువోస్తే అది పడుగవుతుంది. దాంతోనే వస్త్రం తయారువుతుంది. అయితే ఆసులోని దారం లాగా, ఎడతెగని జీవితంలో చేదు, తీపి; రాత్రి, పగలు కలిసే వుంటాయి. ఇట్లే పారతో చేసే పనిని గూర్చి రాస్తూ పుడమితల్లి గుండెను నిమరడమంటాడు కవి. ఇంకా నాగలిని జీవశక్తిని ప్రజ్వలింపజేసే సాధనంగా అభివర్ణిస్తాడు. భల్లం నానీల్లో వస్తు సంస్కృతికి సంబంధించిన దేశీయమైన ఆసు, పార, కుంపటి, నాగలితో పాటు తెప్ప, వలలు, కొల్లేరు సరస్సు మొదలైనవి కనిపిస్తాయి.

కవి చేనేత పనివారి కష్టాలను దగ్గరగా చూసినట్లుంది.

***"మగ్గం గోతిలో / పాతుకపోయాయి***
***చేనేత బతుకులంటే / ఇంతే మరి"***

ఈ నానీ నేతపనివారి జీవితాలను చక్కగా ప్రతిబింబిస్తుంది. మగ్గం పని మంచిదే. కాని ఆ మగ్గం అన్నం పెట్టడం లేదు. పైగా దాన్నే నమ్ముకోవడం వల్ల అది గోతిగా మారి దాని మీద ఆధారపడ్డ వాళ్లను తనలోకి లాక్కుంటుంది. దేశీయమైన వృత్తిలోని కడగళ్లను ఇంతగా ప్రతిబింబిస్తున్నందున నానీల గొప్పతనంతో పాటు కవుల ప్రతిభను కూడా మనం మెచ్చుకోకుండా ఉండలేం.

రైతు పంట పండించి ధాన్యాన్ని మిల్లు యజమానులకు బస్తాల్లో నింపి అమ్ముతాడు. ఆ మిల్లుయజమానులేమో రైతును నిలువెల్లా దోచేస్తారు. అందుకే కవి అంటాడు మిల్లులలో నలిగేవి వడ్లు కావు రైతుల బతుకులేనని.

***"రైతుకీ / ధాన్యానికీ బంధం తెగిపోయింది***
***మిల్లులో నలిగేవి/ బతుకులు కూడా"***

దేశీయతను గర్భీకరించుకున్న నానీ ఇది. బలమైన దేశీయ కవి భల్లం.

పచ్చని చేలు చేపల చెఱువులైనందుకు సాయి వెంకన్న బాబుగారు తమ నానీల్లో ఆవేశపడ్డారు. ఇట్లే రక్తపాతంతో తడుస్తున్న కథలు రాయలసీమవైతే, ఆ



www.etelangana.org

కథల్ని చిత్రాలుగా మలచి చిత్రదర్శకులు లాభాలు గడిస్తున్నారని వారు ఒక నానీలో ఫ్యాక్షనిజాన్ని గుప్పుమన్నారు.

రసరాజు ఎన్ని నానీలను పలికించాడో అన్నీ రసనకు రుచికరమైనవే. రసరాజు 'నానీలు' దేశీయ ముఖచిత్రాన్ని కలిగిన కవితాసంపుటి. వాకిలి ఊడుస్తున్న బామ్మను, గడప మీదున్న దీపాన్ని, సంక్రాంతికొచ్చే ఆడపడుచును, పాత వంతెనలను, ఊగిసలాడే ఉయ్యాలలను, సర్కస్ తీగపై అతివల నడకలను వారి నానీలు ఎంత చక్కగా ప్రతిఫలించాయో మాటలతో చెప్పలేను.

రసరాజు ప్రకృతి చిత్రణ చూడముచ్చటగా ఉంటుంది. "బీడులో కాకుండా, సముద్రంలో పడ్డందుకు తొలకరి ఏడ్చిందట". నా దృష్టిలో నిజానికి ఏడ్చింది తొలకరి చినుకుకాదు, రైతే.

అనిశెట్టి రజిత నానీలు నిజంగా గోరంత దీపాలే. పల్లెల గురించీ, అడవుల గురించీ, గిరిజనుల గురించి రాస్తే ఆమే రాయాలనిపిస్తుంది. 200 లకు పైగా రాసిన నానీల్లో ఎక్కువగా దేశీయతా ముద్రలే. మన రాష్ట్రం అన్నపూర్ణగా ప్రసిద్ధి. కాని రైతు బతుకు బీటలు వారింది. రజిత మాటల్లోనే వినండి –

**"బువ్వ పెట్టే రైతుకు/ అప్పులూ, ఆకలి**
**చావులు/ అయ్యో అన్నపూర్ణా!"**

ఒకరు చేనేత బతుకుల్ని శోకతప్త హృదయంతో వర్ణిస్తే మరొకరు వారు నేసే బట్టల్ని అపురూపంగా వర్ణిస్తారు.

***"కళా నైపుణ్యంతో/ నేసిన బట్టలు***
***ప్రకృతికి/ అనువైన చేనేతలు"***

అంటూ రజితగారు చేనేతవృత్తి నైపుణ్యాన్ని అక్షరకేతనాలకెక్కిస్తారు.

యశశ్రీ రంగనాయకి గారు గిరిజనుల డ్రెస్సును అద్భుతంగా వర్ణించారు.

***"లంబాడి డ్రెస్‌లోని అద్దాల్లో ఎన్ని సూర్యుళ్లో?***
***ఆమె నవ్వుల్లో ఎన్ని చంద్రుళ్లో?***

ఏకకాలంలో సూర్యున్ని, చంద్రున్ని చూపించిన ఘనత ఈమెదే.

కోట్ల వెంకటేశ్వరరెడ్డి గారి 'నూరు తెలంగాణ నానీల్లో' తెలంగాణా దేశీయత ఉద్యమ స్వరంతో కనిపిస్తుంది. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ బతుకమ్మ





గొప్పదనాన్ని, తంగెడుపూల అమాయకత్వాన్ని వీరు గానం చేశారు. పల్లెల్ని రెక్కలు తెగిన పక్షులతో పోల్చారు. నగరం చుట్టూ వెలసిన ప్లాట్ల సమాధుల్ని చూపించారు. పనికి రాని చదువుల వ్యాపారాన్ని వెక్కిరించారు.

***"బువ్వ పెట్టిన భూమి/ నీ పత్తి మీద మన్నువడ***
***స్తన్యం ఎండిన / తల్లైంది"*** అంటూ ఆవేదన చెందినారు.

అంబల్ల జనార్దన్ గారి 'బొంబాయి నానీలు' ప్రత్యేకమైన దేశీయతను ప్రతిబింబించే నానీలు. వారు బొంబాయిని శ్రమ శక్తికి తగిన అమ్మ ఒడిగా చెబుతూనే మాయానగరంగా అభివర్ణించారు. మాఫియా చీకట్లో బాలీవుడ్ తలుకుల్ని, చిత్రాలలోని విచిత్రాలను దర్శింపజేశారు. కూటి కోసం యుద్ధాలు చేసినవారిని, గూటి కోసం మహా యుద్ధాలు చేసినవారిని పేర్కొన్నారు. మురికివాడల్నీ, కుబేరుల మేడల్నీ, కూలీల నరకకూపాల్నీ, దానవ మూకల్నీ ఎవర్నీ విడిచిపెట్టలేదు జనార్దన్ తన నానీల్లో. మాతృభాషలో అన్యభాషా పదాలను చొప్పిస్తూ సమకాలీన చరిత్రను ఆవిష్కరించారు వారు. 'ఈనాటి వ్యాపారం నీతికి టాటా' అంటూ వ్యాపార నగరం గుట్టు విప్పినారు కవి. ఎన్నో వలసపక్షులకు ఆశ్రయమిచ్చే మర్రిచెట్టు బొంబాయి అని దాని స్వరూపాన్ని చక్కగా నిర్వచించారు.

ద్వానాశాస్త్రిగారి 'సాహిత్య నానీలు' ఆధునిక తెలుగు సాహిత్యంలోని పండితులను, వారి ప్రత్యేకతలను తెలియపరుస్తున్నాయి. వీరి మరో సంపుటి 'నానీలలో సినారె' మహాకవి సినారె వ్యక్తిత్వానికి సరైన అక్షర రూపం ఇచ్చింది.

***"హైదరాబాదులో/ చార్మినార్, గోల్కొండ***
***బిర్లా మందిర్, ట్యాంక్‌బండ్/ సినారె"*** అంటారొక నానీలో.

తెలుగువారికి నిలువెత్తు దేశీయకవితా మూర్తి సినారే కదా!

డా॥ తలతోటి పృథ్వీరాజ్ 'అడుగులు' చాలా వరకు దేశీయమైనవి.

***"విసిరాడు / విష సంస్కృతి వల***
***పాశ్చాత్య జాలరి/ ఇంటర్‌నెట్"***

ఇంటర్‌నెట్‌లోని నెట్‌కు సమానార్థకంగా 'వల'ను పేర్కొని ఈ నానీ రచించారు కవి. దేశీయతను విస్మరించి మనం పాశ్చాత్య నాగరికతకు బంధీలమైన వైనాన్ని ఈ నానీ గుర్తుకు తెస్తుంది. పృథ్వీరాజ్‌కు ప్రకృతి ప్రీతి అధికం. ఒక నానీలో



www.etelangana.org

ఆయన కోనేటినీ, చెరువునూ పదుచు ప్రకృతికి సుందరదర్పణాలుగా అభివర్ణించారు. కోనేరు భక్తికి, చెరువు భుక్తికి ప్రతీకలనుకుంటాను. నదుల అనుసంధానం కంటే మనసుల అనుసంధానాన్ని అభిలషించిన కవి పృథ్వీరాజ్. రైతుల దుర్భర జీవితాన్ని రెండు ముక్కల్లో – ఉదాహరణకు "వరికోతలు – గుండె కోతలు" అని తేటతెల్లం చేశారు. పృథ్వీరాజ్ లాగానే పి. లక్ష్మణ్‌రావుగారు కూడా 'నావి–నీవి'లో

*"విశ్వమంతా / మనకు చేరువలో*
*అనుబంధాలు మాత్రం/ మదికి దూరంగా"*

అని గ్లోబలైజేషన్ తెచ్చిన విపత్తును మనముందుంచారు. ఇట్లే నేతల ప్రతాప్‌కుమార్ మానవ సంబంధాలను పట్టించుకోని ఈ ప్రపంచం ఇప్పుడు ఒక 'కుగ్రామం'అని చమత్కరించారు. 'కు' అనే అక్షరానికున్న అల్పార్థాన్నే కాక 'చెడ్డ' అనే అర్థాన్నీ ధ్వనింపజేశారు.

*"ఇప్పుడు ప్రపంచం/ ఒక కుగ్రామం*
*మానవ సంబంధాలు మాత్రం / దూరం దూరం"*

పృథ్వీరాజ్ జీవనదుల అనుసంధానానికంటే మనసుల అనుబంధాన్ని కోరుతుండగా నేతల ప్రతాప్ గారు

*"జీవనదుల మధ్య / సగర్వంగా*
*రూపాయిచ్చి/ నీటిపొట్లం కొంటున్నాను"*

అని నీటి కోసం ప్రజలు పడే బాధను, కృష్ణాగోదావరుల మధ్య జరుగుతున్న నీటి వ్యాపారాన్ని మన కళ్లముందు నిలిపారు.

దేశీయంగా ఉపయోగపడని చదువులు వ్యర్థం అనే భావన ప్రతాప్ గారిది. వీరి నానీని చూడండి.

*"డాక్టర్లూ – ఇంజినీర్లూ/ ఈ రెండే ఆశయాలు*
*ఫలితం/ తనకా – సమాజానికా!"*

సోమేపల్లి వెంకటసుబ్బయ్యగారి 'రెప్పల చప్పుడు' తప్పక వినవలసిందే. మన ఆచారాలు ఎక్కడికీ పోవు. అవి మళ్లీ మన ముందు ఎప్పటికప్పుడు ప్రత్యక్షమవుతాయనే నమ్మకం సోమేపల్లిది.

*"జొన్నరొట్టె/ నులక కుర్చీ*





*నగరం స్టార్ హోటల్లో/ ఈనాటి స్పెషల్స్"*

దేశీయతను కాదంటే దేశం ఏం కావాలి? అన్నది వారి ప్రశ్న.

*"పల్లెదనం/ చల్లని సద్దిబువ్వ*
*పట్నవాసం/ వేడి వేడి ఫాస్ట్‌ఫుడ్"*

అంటూ పల్లెకూ పట్నాలకూ ఉన్న వ్యత్యాసాన్ని ఒక నానీలో ప్రత్యక్షం చేశారు. మనల్ని ఇంగ్లీషు జ్వరం పట్టుకుంది. తెలుగు వైద్యానికి అది తగ్గడం లేదు. అందుకే కవి "అప్పుడప్పుడు తెలుగు మాట్లాడు మరి" అని కోరుతున్నారు ఒక నానీలో. మన వృత్తి వ్యవసాయం అయినప్పుడు మన ఆత్మల మధ్య దూరం చాలా తక్కువగా ఉండేదని వారు చెప్పిన మాటలు ఆలోచింపదగ్గవి.

*"కాడిగట్టూ/ నీటిబోదీ*
*సరిహద్దు రేఖలు కాదు/ ఆత్మీయతా స్పర్శలు"*

ఏదైనా దగ్గరున్నప్పుడు దాని గొప్ప తెలిసిరాదు. దూరంగా ఉన్నప్పుడు అర్థమవుతుంది. ఈ విషయంలో నగరవాసులకు ఒక చురక అంటించారు సోమేపల్లి.

*"అదేం/ చిత్రమో*
*పట్నమొచ్చి చూస్తే గాని/ పల్లె సౌందర్యం తెలియలే!"*

కవి గోదావరీ ప్రాంతీయుడు కనుక తనకు తరుచూ కనిపించే దృశ్యాలను కలంలోకి ఎలా ఎక్కించకుండా ఉంటాడు?

*"అరే/ ఇక్కడ ఊళ్లుండాలే*
*ఏమీ/ గోదావరికి కోపం వచ్చిందా?"*

ఊళ్లను గూర్చి ఆలోచిస్తే ప్రాజెక్టుల పేరుతో అవి తరలించడమైనా జరగాలి. లేదా గోదావరి వరదలకు కొట్టుకొనైనా పోవాలి. భల్లం అన్నట్లు సోమేపల్లి నానీలు పల్లెతనానికి, తల్లితనానికి అద్దం పట్టాయి.

*"నేలతల్లికి/ అవయవాలు*
*చెట్లు చేమలూ/ వాగులూ వంకలూ"*

సోమేపల్లి నానీలు దేశీయ వాతావరణాన్ని సంపూర్ణంగా ప్రతిఫలించాయి.

*"నాన్న దీవెన/ అమ్మలాలన*
*ఆహ్లాదాల అలల కదలి/ నా పుట్టిల్లు"*

అంటూ డా॥ చిల్లర భవానీదేవి మనల్ని తన నానీలలో ఆత్మీయంగా



www.etelangana.org

పలకరించారు. సమకాలీన సామాజికాంశాలకు తమదైన శైలిలో వారు ఈ విధంగా స్పందించారు.

*"మూడు నదులైనా/ సంధానిచొచ్చు*
*ముగ్గురు మనుషుల్ని/ కలపటం కష్టం"*

అబ్బాయి అమ్మాయిల మధ్య వివక్షను చూపే నేటి తల్లుల్ని ఎంతో సున్నితంగా మందలించారు భవానీదేవి.

*"మామిడి చెట్టయినా/ వేపవృక్షమైనా*
*తోటతల్లికి/ వివక్ష లేదు"*

ఏ చెట్టయినా తోటతల్లికి సమానమైప్పుడు ఆడ,మగపిల్లలు కన్నతల్లికి ఎందుకు సమానం కారని ఆమె ప్రశ్న. నేటి తల్లుల స్వభావానికి అద్దం పట్టిన నానీ ఇది.

మన పరిసరాల్లో కనిపించే అందమైన పక్షులు మనకు నేడు అందనివై పోయాయి. అందుకే భవానిగారు "ఇంట్లోకి వాలిన/రంగుల పిట్ట టీవీ" అని చమత్కరించారు. ఈ పిట్ట ముందు ఏ పిట్టా బట్టగట్టి బతకలేదని అందలి వ్యంగ్యం. దేశీయతను మనసారా ఆకాంక్షించే నానీ వారిదే మరోటి.

*"గ్లోబల్ విలేజ్‌లో/ లోకమంతా ఒకటే*
*మనుషులే/ దూరం దూరంగా"*

మానవ సంబంధాలకన్నా విలువైన దేశీయత ఏముంది!

పి.లక్ష్మణ్‌రావుగారి 'నావి-నీవి' నానీలు కూడా దేశీయతకు ఆలవాలాలు.

*"స్వదేశంలోనే/ విదేశీయత*
*ఇక పాశ్చాత్య దేశాల్లో/ చూసేందుకేముంది!"*

అంటూ నేటి సమాజపు విదేశీయ భావజాలపు బానిసత్వాన్ని చిత్రిస్తూ దేశీయత పట్ల తమకున్న మమకారాన్ని, ఆవేదనను తెలియజేశారు.

*"చాలా కాలం తర్వాత/ స్వంత ఊరు వెళ్ళొచ్చాను*
*చంద్రలోకం/ వెళ్ళొచ్చినట్లుంది"*

స్వంత ఊరును ప్రేమించని మనసుంటుందా? నేటివిటీ అంటే ఇదే.





*"అరణ్యమే నయం / ఓ పద్ధతి వుంది"*

అని నగర జీవితాన్ని వ్యాఖ్యానించారు ఈ కవి.

పదహారణాల దేశీయతను సంతరించుకున్న నానీల సంపుటి డా॥ పత్తిపాక మోహన్ 'పచ్చబొట్టు'. "తొవ్వ చూపే ఊరు/చౌక దుకాణమైంది" అంటూ పల్లెల్ని చిన్న చూపు చూసే పట్నం పట్ల ఆగ్రహం ప్రదర్శిస్తారు కవి.

*"బతుకమ్మ బతుకమ్మ/ ఉయ్యాలో*
*ఊరును కలిపి నడిపే/ వెలుగుపాట"గా*

బతుకమ్మ పాటను అభివర్ణిస్తారు మోహన్.

బతుకమ్మ పాట తెలంగాణా దేశీయతకు పల్లవి లాంటిది.

*"పుస్తకంలో నెమలి పింఛం/ జ్ఞాపకాల పెద్ద బాల శిక్ష"*

ఈ నానీ చదవగానే మనమందరం బాల్యస్మృతుల్లోకి జారిపోవలసిందే! చిన్ననాటి ముచ్చట్లన్నీ ముసురులా మనసును ఆవరించవలసిందే.

*"పల్లె/ పట్నం*
*మరణానికీ జీవితానికీ/ తేడా అదే మరి!"*

అన్న కవి అంతరంగాన్ని జాగ్రత్తగా గమనించాలి. అణువణువు, అక్షరమక్షరం దేశీయ స్పృహను నింపుకున్న మట్టివాసన 'పచ్చబొట్టు'లో కనిపిస్తుంది.

డా॥ వై. కృష్ణకుమారి 'అక్షరస్వరాలు' ఘంటసాలను, కరణం మల్లీశ్వరిని ప్రశంసిస్తూనే పుష్కరస్నానాల్లో దొర్లే అపశ్రుతులను, ఎండిపోయిన బోరింగులను గూర్చి ఎన్నో విషయాలను ప్రస్తావించారు.

*"కొట్టి కొట్టి/ బోరింగ్ ముందు కూలబడితే*
*రాలేది నీటిబొట్టు కాదు/ కన్నీటి బొట్టే"*

అక్షరాలా తెలంగాణాలోని బోరింగుల పరిస్థితిని ఈ అక్షరాలు నోళ్లు తెరిచి తెలుపుతున్నాయనే అనాలి.

శారదా అశోకవర్ధన్ గారి నానీలలో నగరంలోని నడిరోడ్లు దర్శనమిస్తాయి. ప్రముఖుల విగ్రహాలు నడిరోడ్ల మీద ఉన్నా, వాటికి కలిగే అమర్యాదను కవయిత్రి ఎత్తిచూపారు. బస్సుల మీద పడే ఆకతాయుల రాళ్లు విగ్రహాలకు కూడా తాకుతుంటాయి. అప్పుడు గాయాలయ్యేది విగ్రహాలకు కాదు, మనసున్న



www.etelangana.org

మనుషులకేనని ఆమె చెప్పినతీరు బాగుంది. అయితే ఈ నేపథ్యంలో బుద్ధవిగ్రహం హుస్సేన్‌సాగర్‌లో మాత్రం బొద్దుగా ఉందని సముచితంగా వ్యాఖ్యానించారు కవయిత్రి.

డా॥ కలువకుంట్ల రామకృష్ణ నానీల్లో భావంతో పాటు భాష సహజమైన కన్నీటి స్పర్శనందించే వాహికగా, సామాజిక స్పృహను ఆవిష్కరిస్తుంది.

*"తెలంగాణా రైతు జన్మైన భూమిలా!*
*ఎవుసం అటకెక్కితాను రోడ్డెక్కి"*

అనీ తెలంగాణా రైతు దీనగాథను నానీకెక్కించిన కవి రామకృష్ణ. పనిపిల్ల దుర్భరమైన జీవితాన్ని రామకృష్ణ ఇలా వర్ణించారు.

*"బంగ్లాలోని/ బాసన్లకే*
*అతుక్కుపోయింది/ దిక్కులేని బాల్యం"*

బాల్యమంతా బాసన్లు కడగడానికే తప్ప, తాను సుఖపడిపోవడానికి కాదన్న సత్యం తేటతెల్లమవుతుంది.

చాలామంది విద్యార్థుల బాల్యం, ముఖ్యంగా విశ్వవిద్యాలయాల్లో అయితే యౌవనం కూడా వసతిగృహాలకే అంకితం కావడం రామకృష్ణను కలవరపెట్టింది. అందుకే ఈ నానీ.

*"వసతిగృహం/ బాల్యాన్ని దోచే*
*సవతి తల్లి/ కాదెప్పుడూ కన్నతల్లి"*

కాని, తెలంగాణా ప్రాంతంలో విద్యార్థులకు హాస్టల్లే కామధేనువులు. దేశీయ వాతావరణాన్ని రామకృష్ణ ఎన్నో నానీల్లో వర్ణించారు.

*"ఆవులు మేస్తున్న పచ్చిక నేల*
*చుట్టాలతో నిండిన ఇల్లూ"*

ఒకటేనంటారు ఒక నానీలో.

తెలంగాణ ముద్ర బలంగా ఉన్న 'నల్లగొండ మట్టి పుత్రుడిగా' డా॥ ఎండ్లూరి సుధాకర్‌చే కొనియాడబడ్డ ఎస్. రఘు 'జీవనలిపి'లో దేశీయత వెన్నెల్లా పరుచుకొంది.

నగరంలో ఇరానీ హోటళ్ల రుచిచూడని ఛాయ్ ప్రియులుండరు. లోగడ ఇరానీ హోటళ్ల బల్లల మీద విద్యార్థులు తమ భవిష్యత్తును చెక్కుతున్నారని





గోపిగారన్నారు. దాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఈ యువకవి,

*"ఇరానీ టీని నేను తాగుతున్నానా?*
*అది నా దుఃఖాన్ని తాగుతుందా?"*

అని అనుమానం వ్యక్తం చేశారు మొత్తం మీద ఇరానీ టీ వల్ల అటు విద్యార్థులకూ ఇటు దుఃఖితులకూ కొంత ఊరట కలిగిస్తుందనే మనం భావించాలి.

ఈ మధ్య నగరవాసుల్ని జొన్నరొట్టెలు బాగా ఆకర్షిస్తున్నాయి. ఈ విషయాన్నే వ్యంగ్యంగా చెప్పారు రఘు.

*"జొన్నరొట్టెలు/ నగరాన్ని చేరాయి*
*పిజ్జాలు/ భయపడుతున్నాయి"*

రఘు తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని నిశితంగా పరిశీలిస్తూ, దేశీయతను ఆవిష్కరిస్తూ, జాతీయాలను ప్రయోగిస్తూ నానీలు రచించారు.

*"అధికార్లకు/ లెక్కలు రాక కాదు*
*అయినా/ కాకిలెక్కలు చెపుతుంటారు"*

*"గోవధను / నిషేధిద్దాం సరే*
*మనలోని/ గోముఖ వ్యాఘ్రాల సంగతి?"*

అంతర్జాతీయ సంఘటనలను దేశీయమైన కథలతో అనుసంధానించి వారు నానీలు చెప్పారు. ఈ మధ్య క్రికెట్ ప్రపంచాన్ని మ్యాచ్ ఫిక్సింగ్ గడగడలాడించిన విషయం మనకు తెలుసు. దీన్ని రఘు చెప్పిన తీరు చూడండి.

*"తాబేలు కుందేలుల/ పరుగు పందెం*
*తాబేలు విజయం/ మ్యాచ్ ఫిక్సింగంటావా?"*

నిజానికి కుందేలు గెలవాలి, కాని గెలిచింది తాబేలు. ఒక సంప్రదాయానికి చెందిన కథను మ్యాచ్ ఫిక్సింగ్‌కు అన్వయించి చెప్పడం గొప్ప విషయం. ఇట్లే కవి తనలోని స్వభాషాభిమానాన్ని ఒక నానీలో ఇలా ప్రదర్శించారు.

*"ఆ రోడ్డంతా/ పరభాషా వాసన*
*గోడకు/ డబ్బింగ్ సినిమా పోస్టర్లు"*

ఇలా నానీ కవులు దేశీయతను తమ కవిత్వంలో అద్భుతంగాచూపారు. పరభాషా సంస్కృతుల మధ్య దేశీయతను మరవలేని నానీ నవ్యకవులను



www.etelangana.org

అభినందిస్తున్నాను.

దేశీయతకు ఛందస్సులోనే కాదు అన్ని అంశాల్లోను పెద్ద పీట వేసినవి నానీలు. ఉదాహరణకు తొలకరి చినుకులు, బొంబాయి నానీలు, గూడు వదిలిన గువ్వలు, నూరు తెలంగాణా నానీలు, చిగురునవ్వు, పాలకంకి, అడుగులు, గోరంత దీపాలు, పాయలు, పచ్చబొట్టు, కలుకుంట నానీలు – మొదలైన నానీల సంపుటాల పేర్లను బట్టి అవి దేశీయతను సూచిస్తున్నాయి. ఆధునిక కవిత్వంలో అంతరిస్తున్న 'నేటివిటీ' పట్ల నానీకవులు ఆందోళన పడుతున్నట్లు వారి నానీలే చెబుతున్నాయి.

తెలుగు కవిత్వంలో బీడువారిన దేశీయతను మొలకెత్తించడానికి నానీ కవులు ప్రయత్నించడం సంతోషం.

❀❀❀

మర్యాదల విషయంలోను, యజ్ఞయాగాదుల విషయంలోను, దానధర్మాల



# 3. ప్రబంధ సాహిత్యం-పారమార్థిక ప్రయోజనం

ప్రబంధ కవులందరూ ఆస్తికులే. వారికి వేదాల పట్ల ఎంత గౌరవమో పురాణాల పట్ల అంత గౌరవం ఉంది. భగవంతుని అవతార వాదాన్ని మనస్ఫూర్తిగా నమ్మి అభివర్ణించినవారు ప్రబంధ కవులు. వారెంతటి లౌకిక దృష్టి గలవారో అంతటి పారమార్థిక దృష్టి గలవారు. భౌతికమైన జగత్తును అభివర్ణిస్తూనే, శాశ్వత సుఖాన్ని అందించే మోక్షాన్ని ఎంతగానో కొనియాడినారు.

*"ఉడుముండదె నూరేండ్లును*
*పడియుండదె పేర్మి పాము పదినూరేండ్లున్*
*మడుగున కొక్కెర యుండదె*
*కడునిలపురుషార్థపరుడు కావలె సుమతీ"*

మానవుడెంతకాలం జీవించినప్పటికీ, చతుర్విధ పురుషార్థాలను అవశ్యం సాధించవలసి వుంది. పురుషార్థ సాధకుడు కావడమే మనుష్య ధర్మమని సుమతీ శతకకారుడు మనకుపదేశిస్తున్నాడు.

బహుశా ప్రబంధకవులు కూడా ఈ దృక్పథంతోనే ప్రబంధాలు రచించినట్లు కనిపిస్తున్నది.

ప్రబంధ రాజమైన మనుచరిత్ర పారమార్థిక ప్రయోజనాన్ని సాధించిన ఉత్తమ రచన. ప్రవరుడు అచ్చమైన వైదికుడు. నిత్యాగ్నిహోత్రి. విషయ పరాఙ్ముఖుడైన శ్రోత్రియుడు. ప్రవరుని కథ ద్వారా పెద్దన రెండు ప్రయోజనాలు సాధించాడు. మొదటిది భోగలాలసతో కూడిన విషయ పరాయణతకు అవమాన తిరస్కారాలు కల్గించడం; రెండవది విషయపరాఙ్ముఖమైన ధార్మిక ప్రవృత్తికి విజయాన్ని కల్గించడం. ధర్మ బద్ధమైన జీవనానికి మోక్షాన్ని నిర్దేశించినవాడు పెద్దన.

మనుచరిత్ర ఆరంభంలోనే కవి శఠకోపయతీంద్రు లను "ఆశ్రిత జనదురితచ్ఛల గాఢధ్వాంతసమితి శఠకోపయతిన్" అని స్తుతించాడు. ఇంకా స్వారోచిష మనుసంభవం కలిధ్వంసకం అని కూడా ఉగ్గడించాడు.

ప్రవరవరూధినీ ఘట్టాన్ని తాత్త్విక దృష్టితో పరిశీలించినప్పుడు, ధర్మార్థకామ మోక్షాలకు పెద్దన ఆయా వ్యక్తులను ప్రతీకలుగా ఊహించినట్లు ఒక అభిప్రాయం



www.etelangana.org

కలుగుతుంది.

ధర్మం–ప్రవరుడు

అర్థం–మాయాప్రవరుడు

కామం–వరూధిని

మోక్షం–సిద్ధుడు

మరొక అడుగు ముందుకేసి చెప్పాలనుకున్నప్పుడు ప్రవర వరూధినీ మాయా ప్రవరులు త్రిగుణాలకు ప్రతీకలుగా నిలుస్తారు.

సత్త్వం– ప్రవరుడు

రజస్సు–వరూధిని

తమస్సు–మాయాప్రవరుడు

సత్త్వ గుణాధిక్యంచేత ప్రవరుడు దేవతల్లో ఒకడుగా, రజోగుణాధిక్యంచేత వరూధిని మానవమాత్రురాలుగా, తమోగుణాధిక్యంచేత మాయాప్రవరుడు రాక్షసులలో ఒకడుగా భావింపబడుతారు. ఇది గుణాలను బట్టి చేసిన మానవ విభజన మాత్రమే. మనుష్య, రాక్షస స్వభావాల కంటే భిన్నమైన దేవతాస్వభావమే గొప్పదని మనుచరిత్ర నిరూపిస్తుంది. ప్రవరుడు నిజంగా దేవత, వివిధాధ్వర నిర్మల ధర్మకర్మదీక్షా పరతంత్రుడు.

ప్రవరుని మునుగులో మాయా ప్రవరుడు వరూధినితో కలిసి భోగాలనుభవించి తిరిగి వెళ్ళిపోయేముందు ఇలా అంటాడు–

***"ఎవ్వడు మీదెఱుంగక యథేచ్ఛ సుఖైక రతిన్ జరింపగా***
***నవ్వల వంశహాని, వ్రతహాని యశోధన హాని పుట్టదా***
***నవ్వెడ నమ్మనుష్య పశువయ్యవివేకి చెడున్ జగంబునన్***
***నవ్వగపాలు రౌరవమునన్ బడ పాలును నిందపాలునై" 3.135.***

కేవలం కామ పురుషార్థాన్ని ఆశ్రయించిన వానికి కలిగే నష్టాలను పెద్దన మాయా ప్రవరుని ద్వారా వెల్లడించిన తీరు మనకు ఆశ్చర్యాన్ని కల్గించక పోదు. "మీ దెఱుంగక" అంటే పరమ పురుషార్థాన్ని తెలుసుకోక అని అర్థం.

వైదికుడైన పెద్దన ప్రవరుణ్ణి వైదిక నిష్ఠాగరిష్ఠునిగా చిత్రించాడు. అతిథి





విషయంలోను, యమనియమాదులను అనుష్ఠించే విషయంలోను ప్రవరుని పాత్రను పెద్దన పరమ పురుషార్థానికి అభిముఖంగా నడిపించాడు.

ముక్కు తిమ్మన ముద్దు పలుకులతో తీర్చిదిద్దబడిన పారిజాతాపహరణ ప్రబంధం సత్యాకృష్ణుల మధ్య ఏర్పడ్డ మనస్పర్ధలను తెలుపుతుంది. సత్య అలుక చెందగా, కృష్ణుడు ఆమెను ఓదార్చడమే గాక పారిజాత వృక్షాన్నే ఆమె పెరటి చెట్టుగా నాటటం మొదలైన అంశాలను పైకి వర్ణించినప్పటికీ ఆ ప్రబంధం అంతర్గతంగా పరమార్థాభిముఖంగా రచింపబడిందనడంలో సందేహం లేదు. ఎక్కడ పరమేశ్వరుడుంటాడో అక్కడ ఐశ్వర్యం ఉంటుంది. జ్ఞానం ఉంటుంది, అమృతం ఉంటుంది అనడానికి నిదర్శనంగా కృష్ణుడు (పరమేశ్వరుని అవతారం) లక్ష్మి (ఐశ్వర్యం) నారదుడు (జ్ఞానం) పారిజాత పుష్పం (అమృతానికి సంకేతం) ఒక చోట కలిసి ఉండడం చూస్తాం.

ఈ ప్రబంధం ఆధారంగా చతుర్విధ పురుషార్థాలను ఆయా పాత్రలతో క్రింది విధంగా సమన్వయింపవచ్చు.

ధర్మం–కృష్ణుడు      అర్థం–రుక్మిణి

కామం–సత్య      మోక్షం–నారదుడు

మోక్షానికి సాధనాలు నాలుగు, ఒకటి ధర్మాచరణం. రెండు వైరాగ్యం. మూడు షట్కసంపత్తి. నాలుగు ముముక్షుత్వం.

ఆముక్తమాల్యద విష్ణు పారమ్యాన్ని ప్రబోధించినప్పటికీ పరమ పురుషార్థమైన మోక్షన్ని శ్రేష్ఠమైందిగా ఉద్ఘాటిస్తుంది. మోక్ష సాధనాలను ఆముక్త మాల్యదలోని ఆయా పాత్రలకు ఈ విధంగా అనుసంధానించి చెప్పవచ్చు.

1. ధర్మాచరణం–విష్ణు చిత్తుడు

2. వైరాగ్యం–కేశిధ్వజుడు

3. షట్కసంపత్తి–మాలదాసరి (శమం, దమం, దుష్టులకు దూరంగా వుండడం, శ్రద్ధ, చిత్తైకాగ్రత అనేవే షట్కసంపత్తి)

4. ముముక్షుత్వం–బ్రహ్మ రాక్షసుడు.

తన రాజ్యం ఖాండిక్యుని వశమైంది. ఈ సందర్భంలో కేశిధ్వజుడు పొందిన



www.etelangana.org

వైరాగ్యాన్ని రాయలు వర్ణించిన తీరు ఆయన పారమార్థిక దృష్టికి ఒక ఉదాహరణ.

*"ఆ కేశిధ్వజుడంత నాన్నృపుని, రాజ్యంబెల్ల జేరన్ ఫలం*
*బాకాంక్షింపక గెల్తుమృత్యువునవిద్యన్ పుట్టకుందున్ తుదన్*
*జాకుందున్ వడి' యంచు యోగనియతిన్ జ్ఞానాశ్రయుండై మఖా*
*నీకంబుల్ రచియించు చందొకటికిన్ తీక్షించి తానున్నచోన్"*

మృత్యువును జయించడం, పునర్జన్మ లేకుండా చేసుకోవడం, యోగాన్ని అవలంబించడం, జ్ఞానాన్ని ఆశ్రయించడం మొదలైనవి పరమ పురుషార్థానికి సోపానాలు.

కేశిధ్వజుడు ఇంకా ఇలా అంటాడు.

*"పరలోక సుఖము శాశ్వత*
*మరయ మహీరాజ్య సౌఖ్యమల్పానేహః*
*పరిభోగ్యం బిందులకై*
*దురితము గావించి తొలగుదునె పరమునకున్"*

పరలోక సుఖం అంటే మోక్షానందం. దాని ముందు మహీరాజ్యం తృణప్రాయం. కనుకనే మోక్ష పురుషార్థాన్ని సాధించాలని అతని పట్టుదల.

విషయ సంసర్గం బంధానికీ, విషయ వైముఖ్యం ముక్తికీ కారణ మౌతాయన్న సత్యాన్ని రాయలు వ్యక్తపరిచాడు.

*"ప్రాణి కోటికెల్ల బంధంబు, మోక్షంబు*
*చేరుటకును మనసు కారణమ్ము*
*విషయ సంగియైన విను బంధకారి: ని*
*ర్విషయ మైన ముక్తి విభవకారి"*

శబ్దస్పర్శరూపరసగంధాలైదు విషయాలు. వీటితో సంబంధం కలిగి ఉండడమే బంధం. సంబంధం లేకుండా ఉండడమే ముక్తి. ఐతే ఈ బంధ మోక్షాలకు హేతువు మనస్సే అని చెప్పడంలో రాయల దార్శనికత ద్యోతకమవుతుంది.

ఖాండిక్యుడు "మనమున కెద్ది శోభాశ్రయము?" అని ప్రశ్నించినప్పుడు కేశిధ్వజుడిచ్చిన సమాధానం పూర్తిగా ఆధ్యాత్మికమైంది.





*"అనిన కేశిధ్వజుడు వానికనియె: బ్రహ్మ*
*మాశ్రయంబు మనమ్మున: కదియ పరము*
*నపరమునననంగ బొలుచు: నందపరమనగ*
*మూర్తము, పరంబనగ నమూర్తమనఘ!"*

మూర్తము - పాంచభౌతికమైన ప్రపంచం. అమూర్తము - పరమాత్మ. ప్రపంచం మృత్యురూపం. పరమాత్మ అమృతరూపం. మృత్యువును విడిచి అమృతత్వాన్ని పొందాలి (మృత్యోర్మా అమృతంగమయ) అని ఉపనిషత్ సందేశం.

మత్స్యధ్వజుని కథలో కూడా పరమార్థానికి సంబంధించిన విషయమే ప్రస్తావింపబడింది. రాజు భోగిని ఇంటికి అర్ధరాత్రి సమయంలో భోగాభిలాషియై బయల్దేరగా ఒక విప్రుడు పలికిన పలుకులు గమనింపదగ్గవి.

*"వినియె నెలల్చతుర్వ్యయిని, వృష్టి దినాళికి: రాత్రికైదివం*
*బున: జరకై వయస్సునను: బూని పరంబున కిప్పుడుద్యమం*
*బనువున జేయగా వలయు నంచు పురోహిత ధర్మమాత్యగే*
*ల్మొన నల విప్రుడా ద్విజులలోన సుభాషితమున్ పఠింపగన్"*

వర్షకాలంలో నాల్గు నెలలు సుఖించడానికి మిగిలిన ఎనిమిది నెలలు కష్టపడి సంపాదించాలి. అట్లే రాత్రికోసం పగటిపూట, ముసలితనం కోసం యౌవనంలో సంపాదించాలి. అదేవిధంగా పరలోకంలో సుఖపడడానికి ఈ జన్మలోనే ప్రయత్నించాలని సుభాషితం.

పరమ వైష్ణవుడైన మాలదాసరి మంగళకైశికీ రాగంతో భగవంతున్ని కీర్తిస్తాడు. అతడు బ్రహ్మరాక్షసునికిచ్చిన మాట ప్రకారం తిరిగి వచ్చి పలికిన పలుకులు విష్ణువు తప్ప మరొక దేవుడు లేడన్న విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి.

*"ఎవ్వనిచూడ్కి చేసి జనియించు జగంబు, వసించు నిజ్జగం*
*బెవ్వనియందు, డిందుమతియెవ్వని యందిది, యట్టి విష్ణుతో*
*నివ్వల నొక్కవేల్పు గణియించిన పాతకినౌదునేడు నే*
*నెవ్విధినైన నిన్నదియనేని" యనన్ విని బంధమూడ్చినన్"*

పాట ఫలితంగా బ్రహ్మరాక్షసునికీ, ఆ తర్వాత మాలదాసరికీ భవబంధాలు తొలగిపోతాయి. వారిద్దరికీ విష్ణుసాయుజ్యం లభించింది. ఆముక్తమాల్యద పూర్తిగా



www.etelangana.org

విష్ణు పారమ్యమైన కథలతో అలరారుతుంది.

రాయలు విష్ణుచిత్తుని కథను పరమరమణీయంగా చిత్రించాడు. విష్ణుమూర్తి మీద గోదాదేవికి గల భక్తి ప్రపత్తులు అపారమైనవి. విష్ణు చిత్తుని ఇల్లు విష్ణుకథలతో ఎల్లవేళల ప్రతిధ్వనిస్తూ ఉండేది. అతిథి మర్యాదలకు అతని ఇల్లు పెట్టింది పేరు. పంచమహాయజ్ఞాలలో ఒకటైన అతిథి యజ్ఞాన్ని పెద్దన లాగా రాయలు కూడా అద్వితీయంగా అభివర్ణించాడు.

*"ఆనిష్ఠానిధి గేహసీమ నడు రేయాలించినన్ మ్రోయునెం*
*తే నాగేంద్ర శయానుపుణ్య కథలున్ దివ్య ప్రబంధానుసం*
*ధానధ్వానము "నాస్తి శాక బహుతానాస్త్యుష్ణతా నాస్త్యపూ*
*పో, నాస్త్యోదన సౌష్ఠవంచ, కృపయాభోక్తవ్య మన్మాటలున్"*

పింగళి సూరన కళాపూర్ణోదయం కల్పిత కావ్యమే అయినప్పటికీ అందలి ద్వారకాపుర, తిరుమల, కాంచీపుర, శ్రీరంగ, రామేశ్వరాదిక్షేత్రవర్ణనలు; యమునా, కావేరీ తీర్థవర్ణనలు సూరన లౌకిక పారలౌకిక దృష్టికి అద్దం పడుతున్నాయి.

శ్రీరాముని చరిత్రను గానం చేస్తూ సూరన

*"పరమంబగు నీ నామము*
*కరమామ్నాయములు తారక బ్రహ్మముగా*
*నిరతిన్ వినుతింపగ నా*
*తరమే"* అని నామ సంకీర్తన గావించాడు.

సూరన యోగవిద్యాభ్యాసకుశలుడంటానికి కళాపూర్ణోదయం ఐదవ ఆశ్వాసంలోని స్వభవుని కథ చక్కని నిదర్శనం.

*"విమలాత్మక! వినుము ప్రశ*
*స్తము జీవాత్మ పరమాత్మ సంయోగము యో*
*గమన, తదంగము లెనిమిది*
*క్రమమున వినిపింతు తత్ప్రకారము దెలియన్"*

అష్టాంగయోగం పరమ పురుషార్థమైన మోక్షానికి మార్గం చూపుతుంది. పతంజలి యోగదర్శనం పఠిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

సూరన పరబ్రహ్మ స్వరూపాన్ని సగుణమని, నిర్గుణమని రెండు విధాలుగా





అభివర్ణించి, సామాన్యులకు సగుణోపాసన సుకరమని తేల్చి చెప్పాడు.

*"సగుణమనంగ నింకవిను, శంఖ సుదర్శన ముఖ్యచిహ్నితం*
*బగు పురుషోత్తమాకృతి: తదన్యము నిర్మల నిత్య చిన్మయం*
*బగు పరమాత్మ రూప: మదియబ్బుట దుర్లభమెట్టి వారికిన్*
*సుగుణ విలాస చింతనము సల్పగ జల్పగ గాని భూసురా!"*

సూరన చేసిన శారదాపీఠవర్ణన అతని పారమార్థిక దృష్టికి చక్కని ఉదాహరణ. శారదా పీఠం నాల్గువేదాలకు నిలయమైంది.

*"ఋగ్వేద ఘోష సమృద్ధి పెంపొకచోట*
*నొకచోట యాజుషాభ్యుదయ మహిమ*
*సామగానధ్వాన చాతుర్యమొకచోట*
*నొకచోట నాథర్వణోక్తి గరిమ..."*

తెనాలి రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యం, ఘటికాచల మాహాత్మ్యం ఈ రెండూ వైష్ణవ క్షేత్ర పారమ్య గ్రంథాలు.

"పాండురంగ మాహాత్మ్యం" కావ్యారంభంలో కుమార స్వామి శివుణ్ణి ప్రశ్నించిన సందర్భాన్ని గమనిస్తే పాండు రంగ క్షేత్ర ప్రభావం ఎలాంటిదో అర్థమవుతుంది.

*"సర్వాతి శాయియైన దేవుడేనియు, నటువంటి తీర్థమేనియు,*
*నట్టి సుక్షేత్ర మేని, భోగాపవర్గ*
*దాయిగలదేని యెఱిగింపు"* మని కుమారస్వామి ప్రశ్నిస్తాడు.

ఐతే శివుడు ఈ కథ కొందరికి వినిపింపదగనిదంటాడు. కాని కుమారునికి, పార్వతికి మాత్రం వినిపిస్తాడు.

*"శఠమతికి నాస్తికునకు పాషండునకును*
*కర్మముగుఱించి యాచించు గర్వితునకు*
*నీ పరమగోప్యమోపుత్ర! యోపురంధ్రి*
*తప్పిదారియు నెఱిగింప తరము గాదు"*

పుండరీక క్షేత్రం శివుని మాటల్లో భోగాపవర్గాలకు కేంద్రం. భోగం అంటే లౌకిక సుఖం. అపవర్గం అంటే మోక్షం. ఈ పుండరీక క్షేత్రంలోనే నిగమశర్మ



www.etelangana.org

లాంటి వాళ్ళూ కనిపిస్తారు కాని నిగమశర్మకు వాళ్లెవరూ సాటిరారు. ఇక కాశీ ఖండంలోని మహానంద గుణనిధులను, శివరాత్రి మాహాత్మ్యంలోని సుకుమారుణ్ణి, నారసింహ పురాణం లోని మందేహుణ్ణి, నిరంకుశోపాఖ్యానంలోని నిరంకుశుణ్ణి, ఉద్భటారాధ్య చరిత్రలోని మదాలసుణ్ణి దుష్ప్రవర్తనలో ఒక్క నిగమశర్మ మాత్రమే అధిగమించాడంటే ఆశ్చర్య పడవలసిన అవసరం లేదు.

పాండురంగ మాహాత్మ్యంలో వర్ణింపబడిన ఆగస్త్య, గాణాపత్య, సాంకర్షణ, జాబాలి, బ్రహ్మ, కలశ, పితృ, చక్ర,లక్ష్మి, పౌండరీక, ముక్తకేశ, సంగమ తీర్థాలు తెనాలి రామకృష్ణుని భక్తి ప్రపత్తులను, పారమార్థిక దృష్టిని చాటుతున్నాయి.

పౌండరీక దేవతల పూజావిధానాన్ని కవి కన్నులకు కట్టినట్లు వర్ణించాడు. రాధాకృష్ణుల చరిత్ర కవి పారమార్థిక దృష్టికి చక్కని ఉదాహరణ.

కృష్ణుడు రాధకు ప్రత్యక్షమైన తీరు కడు హృద్యం.

*"ఇంద్రచాపంబుగాదిది మౌళితటమున*
*సవరించు బర్హిపింఛంబుగాని*
*భిదుర ఘాతంబు గాదిది, పాంచజన్య సం*
*జాత గంభీర ఘోషంబుగాని*

*యాశ్రయించిన బలాకావళిగాదిది,*
*హారి మూక్తాహార యష్టిగాని*
*ఇదికోల మెఱుగు గాదుదితబంగారంపు*
*పసిడి గ్రమ్మెడు పచ్చపట్టుగాని*

*వృష్టిగాదిది కరుణాంబు వృష్టిగాని*
*నీలమేఘంబుగాదిది, నీలవర్ణు*
*డౌర! నా మ్రోల ప్రత్యక్షమయ్యె ననుచు*
*హర్షపులకిత తనువయ్యె నవ్వధూటి"*

పరమేశ్వరుని యొక్క సర్వవ్యాపకత్వం ఇందులో వర్ణింపబడింది. శ్రీకాళహస్తి మాహాత్మ్యంలోని ప్రారంభపద్యం కథా సూచనతోపాటు కవి పారమార్థిక దృక్పథాన్ని తెలియజేస్తుంది.





***"శ్రీ విద్యానిధియై మహామహిమచే చెన్నై వసిష్ఠాజ లూ***
***తావాతాశన సామజాటవిక గో త్రాదేవ నత్కీర రా***
***జీవాక్షీయుగ యాదవాధిపులకున్ శ్రేయస్కరంబైన యా***
***ర్యావామాంగము దివ్యలింగము మదీ యాభీష్టముల్ సల్పెడిన్"***

వసిష్ఠునికి, బ్రహ్మకు, సాలెపురుగుకు, పాముకు, ఏనుగుకు, బోయవాడైన తిన్ననికి, హరద్విజునికి, నత్కీరునికి, వేశ్యాతనయలకు,యాదవాధిపునికి ముక్తిని ప్రసాదించిన దివ్యలింగం నా అభీష్టాలను తీర్చుగాక అని ధూర్జటి శివస్తుతి గావించాడు. శివభక్తి అనే ఏక సూత్రంతో ధూర్జటి ప్రబంధ రచన చేశాడు. కీటకానికి, చక్రికి, మదాంధునికి, చివరికి బహుజీవహంతకునికైనా సంసార బంధాన్ని తొలగించి మోక్షనిధిని అందించే శక్తి కేవలం కాళహస్తి పుణ్యక్షేత్రానికుందని ధూర్జటి భావించాడు.

ధూర్జటి సాకారోపాసన చేసినప్పటికీ, నిరాకార వ్యాపక పరబ్రహ్మను కూడా స్తుతించినట్లు ఈ క్రింది పద్యాన్ని గమనిస్తే తెలుస్తుంది.

***"తన ఇల్లాలఖిలైకమాత, తన సంతానంబు భూతవ్రజం,***
***బనులాపంబులు వేదముల్, తన విహారాగారముల్ మౌని హృ***
***ద్వనజంబుల్, తన సేవకుల్ కమలజాత శ్రీధరుల్ గా జెలం***
***గిన దేవోత్తమ నమ్మహాత్ముతరమే కీర్తింపగా నేరికిన్"***

జగన్మాతయైన పార్వతి ఇల్లాలుగా, సకల ప్రాణికోటి సంతానంగా, పలుకులు వేదాలుగా, విహారక్షేత్రాలు మునుల హృదయపద్మాలుగా బ్రహ్మవిష్ణులు సేవకులుగా గల దేవదేవుణ్ణి కీర్తించడం ఎవరికీ శక్యం కాదని ధూర్జటి అభిప్రాయం. ఈ వర్ణనను బట్టి భగవంతుడు సర్వవ్యాపకుడన్న విషయం ధ్రువ పడుతుంది. ఆకారం లేనప్పుడే సర్వవ్యాపకత్వం సిద్ధిస్తుంది.

తిన్నడు మూఢభక్తితో శివుణ్ణి ప్రసన్నం చేసుకున్నాడు. "నాకుంజుట్టము తల్లిదండ్రులు చెలుల్ నాథుండు నీదైవమే" అని మిత్రులతో చెప్పిన తిన్నని భక్తి అపూర్వమైంది. తన శతకంలోను ధూర్జటి ఈ అభిప్రాయాన్నే వెలువరించాడు. "అమ్మయ్యంచును ఎవరినేనన్నన్ నిన్ను నౌ సుమీ" నా తల్లిదండ్రులను పిలుస్తున్నానని నీవనుకోకు, ఈ జన్మలో నా తల్లీ, తండ్రీ గురువూ అన్నీ నువ్వే అంటాడు ధూర్జటి. శ్రీకాళహస్తి మాహాత్మ్యంలోని నత్కీరుని కథ విలక్షణమైంది.



www.etelangana.org

నత్కీరుడు ఈశ్వరుని పద్యంలో తప్పుబట్టి, శాపగ్రస్తుడై కుష్ఠ వ్యాధిచే బాధపడి స్వర్ణముఖీనదిలో స్నానం చేసి పవిత్రుడయ్యాడు. శివుణ్ణి సాక్షాత్కరించుకొని విన్నవించుకొన్న తీరు అతని వైరాగ్యాన్ని సూచిస్తుంది.

*"ఈ సంసారము దుఃఖా*
*వాసానందంబు: దీని వర్జింపంగా*
*నేసుఖము గలుగు దయ న*
*న్నా సుఖమున గూర్పవే కృతార్థుడనగుదున్"*

"అథ త్రివిధ దుఃఖాత్యంత నివృత్తి రత్యంత పురుషార్థః" (సాంఖ్య దర్శనం, 1-1)

ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధి దైవికం అని దుఃఖం మూడు రకాలు. దాన్ని పూర్తిగా తొలగించుకోవడమే అత్యంత పురుషార్థం (మోక్షం). ఈ మూడు రకాల దుఃఖాన్నే ధూర్జటి సాంసారిక దుఃఖం అన్నాడు. దాన్ని తొలగించి మోక్షానందాన్ని ప్రసాదించమని శివుణ్ణి వేడుకొన్నాడు.

ధూర్జటి ప్రకృతి వర్ణనల్లోను ఆధ్యాత్మిక విషయాలను పొందు పరిచాడు.

*"ఉదయగ్రావము పానవట్ట, మభిషేకోద ప్రవాహంబువా*
*ర్ధి, దరధ్వాంతము ధూప ధూమము, జ్వలద్దీప ప్రభారాజి కౌ*
*ముది, తారానివహంబు లర్చిత సుమంబుల్ గా తమోదూర సౌ*
*ఖ్యదమై శీతగభస్తిబింబ శివలింగం బొప్పె ప్రాచీదిశన్"*

తూర్పున చంద్రుడనే శివలింగం ఉదయించింది. అది ఎలాగుందంటే తూర్పు కొండ పానవట్టంగా, సముద్రమే అభిషేకోదకంగా, చీకటి - ధూపపు పొగగా, వెన్నెల దీపకాంతిగా, తారలు పూలుగా కలిగి తమోదూర సౌఖ్యదమై అలరారుతుందట. ఇక్కడ తమస్సంటే చీకటితో పాటు అజ్ఞానం గ్రహింపబడుతుంది. అజ్ఞానం భవ బంధానికి హేతువు. జ్ఞానం ముక్తికి హేతువు. "జ్ఞానాన్ముక్తిః" అని సాంఖ్యదర్శనం (3-23) చెబుతున్నది. ధూర్జటి దృష్టిలో శివలింగం అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానమనే అమృతాన్ని అందివ్వ గల్గుతుంది.

ప్రబంధ కవులు వేదాలను, పురాణాలను, సమానంగా గౌరవించినట్లు కనిపిస్తున్నది. వారు పురాణాలనుంచి కథలను గ్రహించినప్పటికీ వాటికి లౌకిక





పారమార్థిక విషయాలను జోడించి అత్యద్భుతంగా ప్రబంధ రచన గావించారు.

ఇహపర సుఖాలను అందించేదే ధర్మం. అర్థకామాలకంటే భిన్నంగా ధర్మాన్ని అవలంబించినప్పుడు అది మోక్షానికి అర్హతనిస్తుంది. ప్రబంధ సాహిత్యాన్ని అవలోకించినప్పుడు వైదిక జీవన విధానాన్ని అనుసరించిన ప్రవరుడు విశేషంగా మనల్ని ఆకర్షిస్తాడు. మానవ జీవన పద్ధతికి ప్రవరుడు ప్రతీక. సిద్ధునిచేత, అగ్నిచేత,తల్లిదండ్రులచేత,శిష్యులచేత, లోకులచేత కీర్తింపబడిన వాడు ప్రవరుడు. కళాపూర్ణోదయంలోని శాలీనుడు, తుంబురుడు,ఆముక్తమాల్యదలోని విష్ణుచిత్తుడు, యామునాచార్యుడు, మాలదాసరి, కేశిధ్వజుడు, పాండురంగమాహాత్మ్యంలోని నిగమశర్మ అక్క మొదలైనవారు తెలుగు సాహిత్యంలో పారమార్థిక జీవితానికి పట్టుగొమ్మలు. వీళ్ళంతా జ్ఞానాన్ని ఆశ్రయించి ముక్తికి అర్హత సంపాదించినవారే. ఇక తిన్నడు మొదలైనవారు భక్తిచేత పరమాత్మను ప్రసన్నం చేసుకొన్నవారు. తిర్యక్కులకు సైతం మోక్షార్హత కలదని చెప్పినవాడు ధూర్జటి. ఎంత దుర్మార్గుడైనా క్షేత్రప్రభావం చేత మోక్షార్హతను సంపాదించగలడని నిరూపించినవాడు తెనాలి రామకృష్ణుడు.

పై విషయాలను గమనించినప్పుడు, చతుర్విధ పురుషార్థాలలో, ధర్మార్థకామాల కంటే, మోక్షమే శ్రేష్ఠమైనదని నిరూపించడానికి ప్రబంధ కవులు ప్రయత్నించినట్లు స్పష్టమవుతుంది. ఏనాటికైనా మానవుడు పరమ పురుషార్థాన్ని పొందాలన్నదే మన ఋషుల అభిమతం కూడా.



www.etelangana.org

# 4. మను చరిత్ర - మన చరిత్ర

మనమంతా మనువుల సంతతివారం. కనుకనే మానవులం అయినాము. ఈ మనువులు పదునాలుగుమంది. ఇప్పుడు ఏడవదైన వైవస్వత మన్వంతరం నడుస్తుంది. మనువులలో మొదటివాడు స్వాయంభువ మనువు. రెండవవాడు స్వారోచిష మనువు. ఈ స్వారోచిష మనువు జన్మ వృత్తాంతమే తన కావ్యంలో వర్ణించి దీనికి స్వారోచిష మనుసంభవం అనే సార్థకనామం ఉంచారు పెద్దనగారు.

అల్లసాని పెద్దనగారు ఆంధ్రభోజుడైన శ్రీకృష్ణదేవరాయల అభ్యర్థనమేరకు శిరీష కుసుమపేశల సుధామయోక్తులతో మనుచరిత్ర కావ్యాన్ని తీర్చిదిద్దారు. ఈ మహాకావ్యంలోని అల్లిక జిగబిగీ, ప్రసన్న మధురమైన శైలీ, కథాసంవిధానమూ, సన్నివేశ చారుత్వమూ, సంభాషణా నైపుణ్యమూ, పాత్రచిత్రణమూ సహృదయులను ఆనందతరంగాలలో ఓలలాడిస్తాయనటంలో సందేహం లేదు. అయితే ఈ మహాకావ్యం ఆనందంతోపాటు ఎటువంటి సందేశాన్ని అందిస్తున్నదో, ఈనాడు ఆ కావ్యాన్ని చదివి ఏమి నేర్చుకోవాలో!

మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ అన్న సార్వకాలికమైన, సార్వజనీనమైన సూక్తులకు చక్కని భాష్యం తన ప్రబంధంలో పొందుపరిచారు పెద్దనగారు.

కుటుంబం అంటే ఎలా ఉండాలో ప్రబంధం ప్రారంభంలోనే మన కళ్లకు కట్టించారు, చూడండి...

*"యౌవనమందు యజ్వయు ధనాఢ్యుడునై కమనీయకౌతుక*
*శ్రీ విధిగూకటుల్ గొలిచి చేసిన కూరిమిసోమిదమ్మ సౌ*
*ఖ్యావహయై భజింప తలిదండ్రులు గూడి దేవియున్*
*దేవరవోలెనుండి యిలుదీర్పగ, గాపుర మొప్పు వానికిన్ "(1.53)*

యౌవనవంతుడైన ప్రవరుడు సోమయాజియై, ఐశ్వర్యవంతుడై ఉన్నాడు. అతనికి ఈడూ జోడైన భార్య సోమిదమ్మ. ఆమె అతనికి అన్ని విధాలా అనుకూలవతియై సేవలు చేస్తున్నది. పార్వతీ పరమేశ్వరుల వంటి తల్లిదండ్రులు ఇంటి పనులన్నీ నిర్వహిస్తున్నారు. ప్రవరుడు హాయిగా కాపురాన్ని నడుపుకొంటున్నాడు.





ఇక్కడి ప్రవరుని కుటుంబవర్ణన ఆంధ్రులందరికీ ఆదర్శప్రాయమైనదే.

మరొక సన్నివేశంలో హిమవత్పర్వత ప్రాంతంలో తన పాదాలకు సిద్ధుడు పూసిన పసరు మంచుతోపాటు కరిగిపోయినప్పుడు...

*"నను నిముసంబు గానకయున్న నూరెల్ల*
*నరయు మజ్జనకు డెంతడలు నొక్కొ*
*యెపుడు సంధ్యలయందు నిలువెళ్ళనీక న*
*న్నోమెడు తల్లి యెంతొఅలు నొక్కొ"(2.17)*

అని ఎక్కడో సుదూరంగా ఉన్న తండ్రినీ, తల్లినీ తలచుకొని ప్రవరుడు తల్లడిల్లటం వల్ల వారికి అతని మీద ఉన్న వాత్సల్యానురాగాలతోపాటు, అతనికి వారి మీద ఉన్న అదరాభిమానాలు సైతం వ్యక్తమైనాయి.

ప్రవరుని దినచర్యను వర్ణించేటప్పుడు ఆచార్యుని స్వరూపం ఏ విధంగా ఉండాలో ఈ సీసపద్యంలో అల్లసానివారు అత్యంత సహజంగా ఆవిష్కరించారు.

*"వరణాతరంగిణీ దరవికస్వర నూత్న*
*కమల కషాయ గంధము వహించి*
*ప్రత్యూష పవనాంకురములు పైకొనువేళ*
*వామనస్తుతి పరత్వమున లేచి*
*సచ్ఛాత్రుడగుచు నిచ్చలు నేగి యయ్యేట*
*నఘమర్షణ స్నానమాచరించి*
*సాంధ్యకృతము దీర్చి సావిత్రి జపియించి*
*సైకతస్థలి కర్మసాక్షి కెఱగి*
*ఫల సమిత్కుశ కుసుమాది బహుపదార్థ*
*తతియు నుదికిన మడుగుదోవతులు గొంచు*
*బ్రహ్మచారులు వెంట రా బ్రాహ్మణుండు*
*వచ్చునింటికి బ్రజ తన్ను మెచ్చి చూడ"* (1.54)

ప్రవరుడు ప్రతిదినం ప్రాతఃకాలంలో చల్లని పిల్లగాలులు ఒంటికి తగులుతుంటే నిద్రలేచేవాడు. వామనస్తుతి చేసేవాడు. శిష్యులతో పాటు వరణానదికి వెళ్ళేవాడు. తలనిండా స్నానం చేసి సంధ్యావందనం కావించేవాడు. గాయత్రీ



www.etelangana.org

మంత్రాన్ని జపించేవాడు. సూర్యభగవానునికి భక్తితో నమస్కరించేవాడు. శిష్యులైన వటువులు పండ్లు, సమిధలు, దర్భలు, పూలతో పాటు ఉతికిన మడిబట్టలు తీసుకొని వెనుకనే వస్తుంటే తిరిగి తన యింటికి చేరుకొనేవాడు. ప్రజలంతా అతని నియమ నిష్ఠలను మెచ్చుకొని నిత్యమూ అతణ్ణి అత్యంతమైన ఆదరాభిమానాలతో అవలోకించేవారు. అచ్చమైన ఆచార్యుడు ఎలా ఉండాలో దీనిని బట్టి మనకు అర్థమవుతుంది.

*"కెడ తోడునీడలై క్రీడించు సచ్ఛాత్రు*
*లింతకు నెంత చింతుంతు రొక్కొ" (2.17)*

అని హిమాయాల్లో చిక్కుకున్న ప్రవరుడు శిష్యులకోసం పరితపిస్తాడు. ఇక్కడ గురుశిష్య సంబంధం ఎలాంటిదో ఉదాత్తరీతిలో స్పష్టం చేయబడింది.

ఆదర్శగృహస్థుడైన ప్రవరుడు అతిథులనూ, అభ్యాగతులనూ అమితమైన ఆసక్తితో ఆదరించి ఆశ్రయించేవాడు. తైర్థికులైన అభ్యాగతులు వస్తున్నారన్న వార్త వినగానే వారికి ఎదురుగా వెళ్ళేవాడు. వారి పాదాలకు నమస్కరించి తన ఇంటికి తీసుకొని వచ్చేవాడు.

శ్రద్ధాభక్తులతో అర్ఘ్యపాద్యాదు లిచ్చేవాడు. ఇష్టమృష్టాన్నాలతో సంతుష్టులను కావించేవాడు. వారు విశ్రాంతిగా కూర్చున్న సమయాన సమీపించి విసనకర్రతో మెల్లమెల్లగా విసరుతూ భారత భూమిలో గల పుణ్యక్షేత్రాల విశేషాలను అడిగి తెలుసుకొనేవాడు. ఈ విధంగా చెప్పటంవల్ల భారతీయుడైన గృహస్థుడు తన యింటికి వచ్చిన వారిని ఎలా ఆదరించాలో, ఏ విధంగా సత్కరించాలో వెల్లడించినట్లయింది.

ప్రవరుని భార్య ఉత్తమగృహిణి, ఆమె కూకటులు కొలిచి చేసిన కూరిమి సోమిదమ్మ. ఆ ఇల్లాలు అన్నపూర్ణాదేవి లాగా ఎప్పుడు ఎంతమంది అతిథులు వచ్చినప్పుకీ ఏమాత్రం విసుగులేకుండా కావలసిన పదార్థాలు వండి వడ్డించేది.

ఆ సాధ్వీమణిని ఆంధ్ర కవితా పితామహుడు ఈ విధంగా అభివర్ణించాడు.

*"వండ నలయదు వేవురు వచ్చి రేని*
*నన్నపూర్ణకు నుద్దియౌ నతని గృహిణి*
*యతిథు లేతేర నడికి రేయైన బెట్టు*





*వలయు భోజ్యంబు లింట నవ్వారి గాగ"* (1.56)

బ్రహ్మచర్యం, గార్హస్థ్యం,వానప్రస్థం, సన్యాసం అనే నాలుగు ఆశ్రమాలలో గార్హస్థ్యం ఎంత గొప్పదో పెద్దనగారు సిద్ధుని నోటివెంట ఘంటాపథంగా చెప్పించారు.

*"కెలకుల నున్న తంగెటిజున్ను గృహమేధి*
*యజమానుడంక స్థితార్థపేటి*
*పండిన పెరటి కల్పకము వాస్తవ్యుండు*
*దొడ్డిబెట్టిన వేల్పుగిడ్డి కావు*
*కదలేని యమృతంపు నడబావి సంసారి*
*సవిధ మేరునగంబు భవనభర్త*
*మరుదేశపథ మధ్యమప్రప కులపతి*
*యాకటి కొదవు సస్యము కుటుంబి*
*బధిర పంగ్వంధ భిక్షుక బ్రహ్మచారి*
*జటి పరివ్రాజ కాతిథి క్షపణ కావ*
*ధూత కాపాలికాద్యనాథులకు గాన*
*భూసురోత్తమ! గార్హస్థ్యమునకు సరియె!"* **(1.66)**

చెవిటి, కుంటి, గ్రుడ్డి మొదలైన వికలాంగులకూ, భిక్షులూ, బ్రహ్మచారులూ, వానప్రస్థులూ, పరివ్రాజకులూ మొదలైన వారికి గృహస్థుడు చేతికి అందుబాటులో ఉన్న తేనెపట్టు వంటివాడు. ఒడిలో ఒదిగిన ధనపేటిక వంటివాడు. పెరటిలో పండిన కల్పవృక్షం వంటివాడు. ముంగిటిలో కట్టిన కామధేనువు వంటివాడు. అమృతంతో నిండిన దిగుడు బావి వంటివాడు. చెంత నిలిచిన మేరు పర్వతం వంటివాడు. ఎడారిలో ఎదురైన చలివేంద్రం వంటివాడు. ఆకలి మంటను చల్లార్చే అన్నం వంటివాడు.

అలాగే సన్యాసాశ్రమ ప్రాధాన్యం గురించి ప్రవరుని పలుకుల్లో ఇలా ప్రశంసింపజేశారు పెద్దనగారు. సిద్ధునితో ప్రవరుడు పలుకుతున్నాడు...

*"మౌనినాథ! కుటుంబ జంబాల పటల*
*మగ్న మాదృశ గృహమేధి మండలంబు*
*నుద్ధరింపంగ నౌషధమొండుగలదె?*
*యుష్మ దంఘ్రి రజోలేశ మొకటి దక్క"*



www.etelangana.org

*"వానిది భాగ్యవైభవము, వానిది పుణ్యవిశేష మెమ్మెయిన్*
*వాని దవంధ్య జీవనము, వానిది జన్మము? వేఱు వేయకె*
*వ్వాని గృహాంతరంబున భవాదృశ యోగిజనంబు పావన*
*స్నానవిధాన్న పానముల సంతస మందుచు బోవు నిచ్చలున్"*

***(1.63, 64)***

ఓ యోగీశ్వరా! సంసారమనే బురదగుంటలో దిగబడి పైకి లేవకున్న మా వంటి గృహస్థులను ఉద్ధరించటానికి మీ వంటి మహానుభావుల పాదధూళి తప్ప మరొక్క టేమున్నది?

మీ వంటి పుణ్యాత్ములైన యోగీంద్రులు ఎవని యింట్లో పాదం పెడతారో? ఎవని యింట్లో అతిథ్యం అందుకుంటారో వాడే అదృష్టవంతుడు! వాడే పుణ్య పురుషుడు! వాని జీవితమే సార్థకం! వాని జన్మమే ధన్యం!

ప్రవరుడు ఎంతటి ఆతిథేయుడో అంతటి ఆహితాగ్ని. ఎంతటి ధర్మజ్ఞుడో అంతటి స్థితప్రజ్ఞుడు. ఎంతటి సౌందర్యవంతుడో అంతటి పత్నీవ్రతుడు. ఎంతటి లోకజ్ఞుడో అంతటి సదాచార సంపన్నుడు. అందుకనే పెద్దన "వాని చక్కదనము వైరాగ్యమునజేసి కాంక్షసేయు జారకామినులకు భోగబాహ్యమయ్యె" నని తన క్రాంత దృష్టిని ప్రకటించాడు.

మను చరిత్ర మహాకావ్యంలో మనకు కొట్టవచ్చినట్లు కనిపించేది ప్రవరుని నియమబద్ధ నిష్కళంక జీవితం. మహాకవి పెద్దన కావ్యారంభంలోనే ప్రవరుని ఆదర్శ జీవితాన్ని కళ్లకు కట్టిస్తాడు. అలేఖ్యతనూవిలాసుడైన ప్రవరాఖ్యుడు మకరాంక శశాంక మనోజ్ఞ మూర్తిగా, భాషాపరశేషభోగిగా, నిర్మల ధర్మకర్మ దీక్షా పరతంత్రుడుగా, అనారతాధ్యాపన తత్పరుడుగా గోచరిస్తాడు. "శీలంబున్ గులమున్ శమంబు దమముం జెల్వంబు లేబ్రాయముం బోలన్ జూచి యితండె పాత్రుడని యే భూపాలుడీవచ్చినన్ సాలగ్రామము మున్నుగా గొనని" సదాచార సంపన్నుడుగా, తరుణాగ్నిహోత్రిగా, అభ్యాగత సేవా పరతంత్రుడుగా, చతురాస్యవంశ కలశోదధి పూర్ణశంశాంకుడుగా సాక్షాత్కరిస్తాడు.

ప్రవరుడు సిద్ధుని పాదలేప ప్రభావం వల్ల హిమవత్పర్వతానికి వెళ్ళి అచ్చటి విచిత్రాలు, విశేషాలు అన్నీ చూస్తాడు. అక్కడి మంచువల్ల పాదాలకు పూసిన





పసరు కరిగిపోతుంది. ఆ కొండ కోనలో చిక్కువడి ఇల్లుచేరే మార్గం కోసం అన్వేషిస్తున్న ప్రవరునికి వరూధిని కనిపిస్తుంది.

ఆ విద్యుల్లతా విగ్రహ, ఆ శతపత్రేక్షణ, ఆ చంచరీక చికుర, ఆ చంద్రాస్య, ఆ చక్రస్తని, ఆ మరున్నారీశిరోరత్నం యక్షతనయేందు జయంత వసంత కంతులను తలదన్నే ప్రవరుని సౌందర్యాన్ని తిలకించి, పులకించిపోతుంది. అతని తోవకు అడ్డంగా వచ్చి నిలుచుంటుంది. విభ్రాంతుడైన ప్రవరుడు "ఎవ్వతెవీవు భీతహరిణేక్షణ?" అంటాడు. నేను ప్రవరుడననే భూసురుణ్ణి, ఇక్కడకు వచ్చి ఇరుకున పడ్డాను. మా ఊరికి దారి చూపిస్తే నీకు శుభం కలుగుతుందని వేడుకుంటాడు.

ప్రవరుని పలుకులకు వరూధిని నవ్వు కొంటుంది. "ఇంతలు కన్నులుండ తెరువెవ్వరి వేడెదు భూసురేంద్ర!" అంటుంది. ఔనులే, ఏకాంతంలో ఉన్న జవరాండ్రను ఇలాగే పలకరిస్తారులే! అయినా వచ్చిన మార్గం నీకు తెలియకపోవటమేమిటి? చాలు పరాచికాలు! నాపేరు వరూధిని. ఘృతాచి, తిలోత్తమ, హరిణి, రంభ, శశిరేఖ మొదలైన వారంతా నా ప్రాణసఖులు. మేము అప్సరసలం. ఓయి నవమన్మథుడా! నీవు మాకు అతిథివైనావు. మా యింటికి రా! ఆతిథ్యం అందుకో, అలుపు తీర్చుకో! అయ్యోపాపం! కుందనం వంటి మేను కందిపోయింది. ఒప్పులొలికే వదనం వడగాలికి వాడిపోయింది. రావయ్య రా! మా గృహం పావనం చేయి అన్నది ఆ చిన్నది.

అందుకు ప్రవరుడు అమ్మాయీ! నీ మర్యాదకు సంతోషం. నేను నీ యింటికి రాకపోయినా వచ్చినట్లే భావించు. నేను తొందరగా ఇంటికి వెళ్ళాలి. మా ఊరికి దారి చెప్పు తల్లీ! అన్నాడు. అతని మాటలకు వరూధిని చిరునవ్వు నవ్వి ఇలా అన్నది.

*"ఎక్కడి యూరు? కాల్నిలుప కింటికి బోయెదనంచు బల్కెదీ*
*వక్కట! మీ కుటీర నిలయంబులకున్ సరిరాకపోయెనే*
*యిక్కడి రత్నకందరము లిక్కడి నందనచందనోత్కరం*
*బిక్కడి గాంగసైకతము లిక్కడి యీ లవలీ నికుంజముల్?"*

***(2.50)***



www.etelangana.org

ఇదిగో ఇంకా దాపరికం దేనికి? ఉన్నమాట చెబుతున్నాను విను. నా మనస్సు నీ మీద లగ్నమయింది, నన్ను విరహాగ్నిలో కూలదోస్తావో! కౌగిటిలో గౌరవిస్తావో! నీ యిష్టం అన్నది.

ఆ మాటలు విని ప్రవరుడు తరుణీ! ఇది ధర్మంకాదు. మా వంటి ధార్మికులైన బ్రాహ్మణులను కామించటం సరికాదు. నా జననీజనకులు వృద్ధులు. నా కోసం భోజనం చేయకుండా ఎదురుచూస్తూ ఉంటారు. మా యింటి వద్ద అగ్నిహోత్రాలు ఆగిపోతాయి. దేవతార్చన, అతిథిపూజ మిగిలిపోతాయి. నేను ఆహితాగ్నిని. నేను ఇంటికి చేరి తీరాలి అన్నాడు.

ప్రవరుని పలుకులకు వరూధిని ముఖం చిన్నబుచ్చుకున్నది. ఓయి అందగాడా? ఇటువంటి ఎలప్రాయం వైదిక కర్మలతో గడిచిపోతే ఇక సుఖాలు అనుభవించేదెప్పుడు? అయినా యజ్ఞాలు, యాగాలు చేసి సోమయాజులు కావటానికి ఫలం మా కౌగిళ్ళలో మైమరచిపోవటమేకదా? ఇదిగో ఇక్కడ కస్తూరి, జవ్వాది, పచ్చకర్పూరం, పన్నీరు సమృద్ధిగా ఉన్నాయి. రకరకాల పూలు ఉన్నాయి. కల్పవృక్షాలు ఉన్నాయి. మణిభూషణాలు ఉన్నాయి. నాతో గూడి హాయిగా అనుభవించు. గ్రుడ్డివాడు వెన్నెలను నిరసించినట్లు మా వంటి గంధర్వకాంతల భోగాన్ని నీవు కాదంటున్నావు. ఇది సరికాదు. సముఖంలో సంప్రాప్తించిన సశరీర స్వర్గసుఖాన్ని నిరాకరించి ఉపవాసాది నియమాలతో కృశించి పోవటం వివేకం కాదని తెలియజేసింది.

వరూధిని మాటలకు ప్రవరుడు ఇలా సమాధానమిచ్చాడు. నీ మాటలు కాముకుడైన వానికి ఇష్టం అవుతాయి కాని, నా వంటి వానికి కాదు. నా వంటి బ్రాహ్మణుడు ఇంద్రియలోలుడైతే బ్రహ్మానందానికి దూరమైపోతాడు.

ప్రవరుని నోటివెంట వచ్చిన బ్రహ్మానంద శబ్దానికి విషయానంద పరంగా వ్యాఖ్యానం చెబుతుంది వరూధిని.

*ఎందే డెందము కదళించు రహిచే నేకాగ్రతన్ నిర్వృతిన్*
*జెందున్ గుంభగత ప్రదీప కళికా శ్రీ దోప, నెందెందు బో*
*కెందే నింద్రియముల్ సుఖంబుగను నాయింపే పరబ్రహ్మ 'మా*
*నందో బ్రహ్మ' యటన్న ప్రాజదువు నంతర్బుద్ధి నూహింపుమా.* **(2.62)**





వరూధిని తడబాటు మాటలను ప్రవరుడు ఏవగించు కున్నాడు. విరక్తిసూచకంగా ఒక చిరునవ్వు నవ్వి, 'ఈ పాండిత్యము నీకు దక్క మరియెందే గంటిమే?' అన్నాడు. వేదోక్త ధర్మాలు పాపమంటున్నావు, సంభోగమే పుణ్యమంటున్నావు. బాగుబాగు! నీవు కామశాస్త్రం బోధించే ఉపాధ్యాయుని వలె పలుకుతున్నావు. నీతో వాదమెందుకు! విను...

***"తరుణీ! రేపును మాపు హవ్యములచేతం దృప్తుడౌ వహ్ని స***
***త్కరుణాదృష్టి నొసంగు సౌఖ్యము లెఱుంగన్ శక్యమే నీకు? నా***
***కరణుల్ దర్భలు నగ్నులున్ బ్రియములైనట్లన్యముల్గా? వొదల్***
***తిరమే? చెప్పకు మిట్టి తుచ్ఛసుఖముల్ మీసాలపై దేనియల్" (2.65)***

ప్రవరుని మాటలను వరూధిని సహించలేకపోయింది. ఇక మాటలతో లాభం లేదనుకున్నది. హఠాత్తుగాపోయి ప్రవరుణ్ణి కౌగలించుకున్నది. అధరం ముద్దాడబోయింది. ధీరచిత్తుడైన ప్రవరుడు మారుమోముతో 'హా శ్రీహరీ!' అని ఆమెను దూరంగా త్రోసివేశాడు.

శాంతం జయించింది. శృంగారం పరాజయం పొందింది. ధర్మం ముందు కామం తలవంచింది. ధర్మవీరుడైన ప్రవరుడు, అతిలోక సుందరి అయిన వరూధినికి లొంగలేదు. ఆమె శృంగార చేష్టలకు అణుమాత్రం చలించలేదు. అతని స్థైర్యం చెక్కుచెదరలేదు. అతని ధర్మనిష్ఠ మొక్కవోలేదు.

త్రోపుపడిన వరూధిని ఏమేమో పలికింది. ఆ కలికి ఉలుకుపలుకులను ప్రవరుడు వినిపించుకోలేదు. ఆమె ఆలింగనం చేసుకున్నప్పుడు తన దేహానికి అంటుకున్న జవ్వాజి సుగంధం పోయేలాగా నీటిలో కడుగుకొని తను నిత్యము ఉపాసించే గార్హపత్యాగ్నిని ఇలా ప్రార్థించాడు.

***"దానజపాగ్నిహోత్రపరతంత్రుడనేని భవత్పదాంబుజ***
***ధ్యానరతుండనేని పరదార ధనాదులు గోరనేని, స***
***న్మానముతోడ నన్ను సదనంబున నిల్పు మినుండు పశ్చిమాం***
***భోనిధిలోన గ్రుంకకయ మున్న రయంబున హవ్యవాహనా!" 2.76***

అగ్నిదేవుడు ప్రవరుని శరీరంలో ప్రవేశించాడు. ఉదయించే సూర్యబింబంవలె అతనిదేహం బంగారుకాంతులు చిమ్మింది. ప్రవరుడు అగ్నిభట్టారకుని



www.etelangana.org

అనుగ్రహంవల్ల సుఖంగా ఇంటికి చేరుకున్నాడు.

ఈ సన్నివేశం ధర్మనిష్ఠగలవారికి దైవం తప్పకుండా సహాయపడుతుందన్న సత్యాన్ని వెల్లడిస్తుంది. దానజపాగ్నిహోత్ర పరతంత్రుడనేని భవత్పదాంబుజ ధ్యానరతుండనేని, పరదాన ధనాదులగోరనేని అన్న వాక్యాలు ప్రవరుని పవిత్ర జీవితానికీ, సదాచార సంపన్నతకూ, ఆత్మ విశ్వాసానికీ ప్రతీకలుగాను, అక్షరాలా విజయ కేతనాలుగాను భాసిస్తాయి. సౌందర్యవంతులైన సతుల మాయలు ధీరుల చిత్తాలను చలింపచేయలేవనీ, తుచ్ఛసుఖాలు మీసాలపై తేనియలవంటివనీ, ఇంద్రియసుఖాలకు లోబడినవాడు బ్రహ్మానంద పదవీ భ్రష్టుడౌతాడని పరూధినీ ప్రవరుల సమావేశంలో ఉజ్జ్వలమైన ఉపదేశం పాఠకులకు సంప్రాప్తిస్తుంది.

మాయా ప్రవరుని రూపంలో వరూధినిని వంచించిన గంధర్వుని నోటివెంట రాదగినది మాత్రం కాదుగాని, ఈ క్రింది పద్యం స్వేచ్ఛాకాముకత్వాన్ని నిషేధిస్తూ సముజ్జ్వలమైన సందేశాన్ని అందిస్తుంది.

*"ఎవ్వడు మీదెఱుంగక యథేచ్ఛసుఖైకరతిం జరింపగా*
*నవ్వల వంశహాని వ్రతహాని యశో ధనహాని పుట్టు; దా*
*నవ్వెడ నమ్మనుష్యపశువయ్యవివేకి చెడున్ జగంబునన్*
*నవ్వగబాలు రౌరవమునం బడబాలును నిందపాలునై." 3.135*

భారతదేశంలో హిమాలయాలకున్న ప్రత్యేకత ఎవరికీ తెలియంది కాదు. మన సాంస్కృతిక యోగకేంద్రం హిమాలయమే. ఎన్నెన్ని పురాణాలు, ఎన్నెన్ని గాథలు ఆ హిమాలయాలను కేంద్రాలుగా చేసికొని వెలిశాయో!

కైలాసవాసునికై పార్వతి తపస్సు చేసినచోటు, మన్మథ దహనం జరిగిన చోటు, భగీరథుడు తపస్సు చేసిన చోటు, గంగను దింపినచోటు, వ్యాసుని బదరికాశ్రమం వెలసినచోటు, మానస సరోవరం ఉన్నచోటు ఇలా... ఇలా ఎంతైనా చెప్పవచ్చు ఆ హిమవన్నగ గరిమను.

అలాంటి హిమవన్నగం పై నుంచి మాయా ప్రవరుని వేషంలో ఈ గంధర్వుడు చెప్పిన పద్యం భారతీయులందరికీ అందవలసిన సందేశమే.

దయ్యాలు వేదాలు వల్లించినట్లు మాయా ప్రవరుడు ఈ పద్యం చెప్పటమేమిటి? అని మనకనిపించవచ్చు. ఒక తండ్రి పచ్చి త్రాగుబోతై తన





మధుపాన దుర్వ్యసనంతో ఎంతో కోల్పోయి చివరికి ఎప్పుడో జ్ఞానోదయం కలిగి తన బిడ్డలకు 'త్రాగుడు మంచిదికాదు' అని చెబుతాడు. హితోపదేశం చేస్తాడు. మరి ఆ తండ్రికి ఇలా చెప్పే అర్హత ఉన్నదా? అంటే ఉన్నదనే చెప్పాలి. ఇంకా చెపితే ఆ అర్హత అతనికే ఎక్కువగా ఉన్నదని చెప్పాలి. ఎందుకంటే ఆ నష్టతీవ్రతను గాఢంగా అనుభవించినవాడు అతడే కాబట్టి. పెద్దల అనుభవం కరదీపికగా చేసుకొని యువత సాగాలి.

పారలౌకిక దృష్టిలేకుండా కేవలం ఐహిక దృష్టితో విషయలోలుడై ఎవడైతే యథేచ్ఛగా సంచరిస్తాడో వంశగౌరవం నశిస్తుంది. అతని దీక్ష సడలిపోతుంది. యశస్సు అంతరిస్తుంది. ఆ వెర్రివాడు... ఆ అవివేకి... ఆ మనుష్య పశువు... సర్వవిధాలా భ్రష్టుడౌతాడు. పదిమందిలో నవ్వులపాలై నిందలపాలై చివరకు నరకంపాలౌతాడు. ఇవి గుర్తు పెట్టుకోదగ్గ మాటలు.

ఆచార్యుణ్ణి అవమానించినవాడు అధఃపతితుడవుతాడనే పరమ సత్యాన్ని ఇందీవరాక్షుని వృత్తాంతంలో పెద్దనగారు మనకు వ్యక్తం చేస్తారు. ఇందీవరాక్షుడనే గంధర్వరాజు తనకు విద్య నేర్పటానికి నిరాకరించిన బ్రహ్మమిత్రుడనే ఆచార్యుని మోసగించి అదృశ్యరూపుడై శిష్యుల నడుమ కూర్చుండి అతని నుండి ఆయుర్వేద విద్య నేర్చుకుంటాడు. నేర్చుకున్నవాడు తన దారిన తాను పోకుండా గురువుగారిని ధిక్కరిస్తాడు.

*"తండ్రీ! నాకు ననుగ్రహింపగదె వైద్యం బంచు బ్రార్థించినన్*
*గండ్రల్ గానటలాడి ధిక్కృతుల బోకాల్మంటి వోహో!మదిం*
*దీండ్రల్ గల్గినవారి కేకరణినేనిన్ విద్య రాకుండునే?*
*గుండ్రా డాచిన బెండ్లి యేమిటి జిక్కుం? గష్టముష్టింపవా!" 5.27*

అని అపహాస్యం చేస్తాడు. విషయం తెలుసుకున్న ఆచార్యుడు ఆగ్రహోదగ్రుడై అతన్ని శపిస్తాడు. గురుశాపంతో ఇందీవరాక్షుడురాక్ష సాకారం ధరిస్తాడు. రాక్షసుడైన ఇందీవరాక్షుడు తన ప్రజలను, చివరకు తన కన్న కుమార్తెను కూడా చంపటానికి వెనుకాడడు. ఈ విధంగా గురుధిక్కారం ఎంత నేరమో పెద్దనగారు మనకు స్ఫురింపజేశారు.

మాన్యులైన పెద్దలను అనాదరించడంవల్ల ఎటువంటి కష్టాలు



www.etelangana.org

అనుభవించవలసి వస్తుందో మనోరమ, విభావసి, కళావతి అనే అమ్మాయిల చరిత్రల వల్ల తెలుస్తుంది. మనోరమ గంధర్వరాజు కుమార్తె. సౌందర్యవతి, అభిమానవతి, అభిజాత్యవతి. ఆమె ఒకనాడు తన చెలికత్తెలైన విభావసీ కళావతులతో విహరిస్తూ ఒక కొండ గుహలో ఏకాంతంగా తపస్సు చేసుకుంటున్న ఒక వృద్ధ మహర్షిని గడ్డాలు మీసాలు కదలించి పరాభవిస్తుంది. క్రుద్ధుడైన ఆ మహర్షి శాపం వల్ల మనోరమకు రాక్షసబాధ సంప్రాప్తిస్తుంది. ఆమె తండ్రే (ఇందీవరాక్షుడు) ఆమెను తింటానికి వెంటపడతాడు. మునిని నిందించినందుకు ప్రతిఫలంగా విభావసికి, కళావతికి క్షయవ్యాధి సంక్రమిస్తుంది. ఈ విధంగా అనవసరంగా పెద్దలను అవమానించినందువల్ల భయంకరమైన బాధలు ప్రాప్తిస్తాయని కవి వ్యంగ్యంగా ఉద్బోధిస్తాడు.

కలి అనే గంధర్వుడు వరూధినిపై మనసుపడి ప్రవరుని రూపంలో వచ్చి ఆమెను మోసగించి మోజు తీర్చుకుంటాడు. వరూధినీమాయాప్రవరులకు జన్మించినవాడు స్వరోచి. కాంతిమంతుడూ, పరాక్రమవంతుడూ, సౌందర్యవంతుడూ అయిన స్వరోచి మందర పర్వత ప్రాంతంలో రాజధానిని నిర్మించుకొని రాజ్యపాలనం చేస్తున్నాడు. ఒకరోజు అతడు అడవిలో వేటకు వెళ్ళాడు. ఇంతలో ఆర్తురాలైన మనోరమ వచ్చి తనను వెంటాడుతున్న రాక్షసుని బారినుండి కాపాడమని అతణ్ణి ప్రార్థిస్తుంది. స్వరోచి రాక్షసుణ్ణి సంహరించి ఆమెను సంరక్షిస్తాడు. రాక్షసుడు శాపవిముక్తుడై గంధర్వరాజైన ఇందీవరాక్షుడుగా మారి స్వరోచికి మనోరమనిచ్చి మహావైభవంగా వివాహం చేస్తాడు.

సతీపతులు శయ్యా మందిరంలో ప్రవేశిస్తారు. ఆ ఆనంద సమయంలో మనోరమ కన్నీరు పెట్టకోవటం చూసి స్వరోచి కారణం అడుగుతాడు. అప్పుడు మనోరమ మునిశాపంతో క్షయవ్యాధిగ్రస్థులైన తన చెలికత్తె విభావసీ, కళావతులను శాపవిముక్తులుగా చేయమని భర్తను వేడుకొంటుంది. స్వరోచి మనోరమ మాటలకు స్పందిస్తాడు. వెంటనే ఆమెను వెంటబెట్టుకొని అరణ్యంలో అలమటిస్తున్న విభావసీ, కళావతుల వద్దకు వెళ్ళి తన మామ అయిన ఇందీవరాక్షుని వల్ల తనకు సంక్రమించిన ఆయుర్వేద విద్యతో వారి వ్యాధిని నివారించి పరిపూర్ణమైన ఆరోగ్యం కలిగిస్తాడు. మనోరమ అభీష్టానుసారంగా వారిని వివాహమాడుతాడు. ఇక్కడ స్వరోచి ఆర్తత్రాణపరాయణత్వం, మనోరమ మైత్రీమాధుర్యం, మనకు కష్టాల్లో





ఉన్నవారిని ఆదుకోవాలని, స్నేహితులను మరువరాదనే చక్కని సందేశాన్ని అందిస్తాయి.

ఒక స్త్రీ మీద ఒక పురుషునికే ప్రేమ ఉండాలని, ఒక పురుషుని మీద ఒక స్త్రీకే ప్రేమ ఉండాలనీ, ఒక భర్తకు పలువురు భార్యల మీద ప్రేమ పరిపూర్ణ ప్రేమకాదని ఒక చక్రవాకి చేత హంసికి చెప్పించాడు కవి.

*"తగులు నెవ్వ డొక్క తరుణికి, నొకనికి*
*మెలత వలచు, నదియు మేలనంగ*
*వచ్చు? గాని పెక్కు వనితలపై గూర్మి*
*గలగు ననుట బొంకుగాదె తరుణి!"* ***(6.74)***

పక్షుల భాష తెలిసిన స్వరోచి ఈ మాటలు విని తన కాముకత్వానికి సిగ్గుపడతాడు.

మరొక సన్నివేశంలో కొన్ని ఆడలేళ్ళు మగలేడి చుట్టూ చేరి దాని మెడనాక సాగాయి. అప్పుడు మగలేడి ఇలా అంటుంది.

***"హుంకారం బొనరించి వే తలగు డోహో! నేను స్వారోచినే***
***పంకే జాక్షులతోడ నెల్లపుడు దర్ప స్ఫూర్తి గ్రీడింప? ల***
***జ్జాంకూరం బడగించినారు; తలపోయన్ నాకు రోతయ్యె; మీ***
***రింకన్ బోయి వరింపు డొక్కరుని భోగేచ్ఛన్ నివారించితిన్"***

ఈ సన్నివేశం కూడా స్వరోచిలో మరికొంత మార్పుకు కారణమయింది.

వరూధిని ప్రవరుని రూపం ధరించి వచ్చిన గంధర్వుణ్ణి నిజమైన ప్రవరుని గానే భావించింది. తాను హృదయపూర్వకంగా ప్రేమించిన ప్రవరుని తేజోమయ స్వరూపమే సంభోగ సమయంలో కూడా ఆమెలో ముద్రవేసుకొని ఉంది. అందుచేత ఆమెకు జన్మించిన స్వరోచిలో ప్రవరుని ధర్మనిష్ఠ, గంధర్వుని తేజస్సు, వరూధిని భోగలాలసత మూడూ కలసి మూర్తీభవించాయి. ఈ కారణం వల్ల వరూధిని పుత్రుడైన స్వరోచికి మనువు అయ్యే అర్హత ప్రాప్తించలేదు. ఆ యోగ్యత స్వరోచికి, వనదేవతకు జన్మించిన స్వారోచిషునికి దక్కింది. ప్రవరుని బ్రహ్మతేజస్సు, మాయా ప్రవరుని రాజసం, వరూధిని దివ్య సౌందర్యం, స్వరోచి పరాక్రమం, వనదేవత పవిత్రత అతణ్ణి సర్వలక్షణ సంపన్నుణ్ణి చేశాయి. స్వారోచిషుడే రెండవ మనువుగా



www.etelangana.org

శ్రీ మహావిష్ణువుచేత పట్టాభిషిక్తుడైనాడు.

ఈ విధంగా పెద్దనగారు పెద్దన్నలాగా తన కావ్యంలో తెలుగువారికి ఎన్నెన్నో చక్కని సందేశాలు అందించారు. స్వారోచిష మనుసంభవం సర్వాంగ సుందరంగా, సర్వ సమర్థంగా, సర్వతోభద్రంగా సుసంపన్నమయింది. ఆనందంతో పాటు సందేశాన్ని సైతం వెల్లడించిన ఉత్తమోత్తమ మహాకావ్యంగా ప్రకాశించింది.

తాతలనాటి చరిత్రను, మనువుతాత చరిత్రతో ముడివెట్టి మన చరిత్రను తీర్చిదిద్దుకొమ్మని, మనుచరిత్రలో చెప్పిన పెద్దన ఆంధ్రకవితా పితామహుడే!



# 5. నారద గానమాత్సర్యం- ఒక పరిశీలన

## 1. కథాశిల్పం - సంవిధాన వైచిత్రి

హితోపదేశ కథలు ప్రపంచ వాఙ్మయంలోనే మొదటివని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. పక్షులు, జంతువులు మొదలైన వాటిచే మాట్లాడించే ఆ రీతి అందరినీ ఆకట్టుకుంది. బుద్ధుని జాతకకథలు బహుళ ప్రచారాన్ని పొందాయి. బృహత్కథ, దశకుమార చరిత్ర మొదలైనవి మనదేశంలో ప్రసిద్ధమైనవి. బాణభట్టు శ్రీహర్షుని ఆస్థానంలో ఉండి కాదంబరి అనే కట్టుకథను సంస్కృతంలో రచించి ప్రపంచంలోనే మొదటి నవలాకారుడయ్యాడేమో అనిపిస్తుంది.

మన తెలుగు భారతికి అపూర్వ కథార్ణవమైన కళాపూర్ణోదయంతో ప్రథమ నవలా కర్పూర నీరాజనాన్ని సమర్పించినవాడు పింగళి సూరన.

కళాపూర్ణోదయ కావ్యానికి కథాకల్పన శక్తియే ప్రధానం. సూరన కల్పనాశక్తి ఇంద్రజాలమై ఒక గంధర్వ లోకాన్ని మనముందు ప్రత్యక్షం చేస్తుంది. భిన్న సంఘటనలు, భిన్న పాత్రలు కథను అపూర్వంగా మలుపులు త్రిప్పడంలో సూరన చూపిన నేర్పు ప్రశంసనీయమైనది. ప్రకృతిని అద్దంలో చూపడమే కవితాశిల్పమని, జీవితం ఒక రంగస్థలమని షేక్స్పియర్ భావించాడు. అతడు మనస్తత్వ శాస్త్రపుటంచుల్ని ఒరసుకునేటట్లు పాత్రసృష్టి గావించాడు. వ్యాస భారతం ఇంతదాకా పుట్టిన, పుట్టబోయే మానవులకు ప్రతిరూపంగా ఎన్నో పాత్రల్ని సృష్టించింది. అట్లే సూరన మానవ ప్రకృతిని తన అపూర్వ పాత్ర చిత్రణకై ఉపయోగించుకున్నాడు. సంఘటనలను కల్పించి కథను నడిపాడు. నారద, మణికంధర, కలభాషిణి, రంభ, నలకూబరాది పాత్రలను ఒకే గుంపుగా తోటలో ప్రవేశపెట్టి, అది మొదలుకొని ఒకరినొకరు జన్మాంతరాలకు కూడా విడివడకుండా కలుపుతూ కడపటి వరకు తెరపై ఆడించాడు. ఏ ఒక్కరు కూడా నడుమ అదృశ్యంకారు. ఇదే ఆయన కల్పనా చాతుర్యం. రంగం మీద ప్రవేశించిన వ్యక్తి మనసుకు అంటీ అంటకముందే నిష్క్రమిస్తే అది కవి పనితనం అనిపించుకోదు. దండలో సూత్రం ప్రతి పూసలో దూరి దండ ఉన్నంతకాలం ప్రకాశించేలాగా సూరన ప్రతిభ సూత్రమై ఆయా పాత్రల్లో ప్రవేశించి కడవరకు నిలిచిపోయింది. కళాపూర్ణోదయంలో



www.etelangana.org

పింగళిసూరన కథాశిల్పం కవి అనల్ప ప్రతిభకు గీటురాయి.

కళాపూర్ణోదయంలోని కథ గట్టిగా పెనవేసుకొని పోయిన ఒక పెద్ద పూదీగ పందిరిలాగా సువాసనలు వెదజల్లుతుంది. పూదీగ మొదలు కనిపించి ఎక్కడనో ఇరుక్కొనిపోయి కొన ఇంకో చోట తేలుతుంది. అలాగే కళాపూర్ణోదయంలోని కథ కొనిసాగింది. కవి తానుగా కథను చెబితే అంత అందంగా ఉండదు. కాని ఆయా పాత్రలచే కథను చెప్పిస్తే అది అపూర్వంగా తేజోవంతంగా ఉంటుంది. పింగళిసూరనకు నాటకీయ శిల్పం తిక్కన నుండి అలవడింది. ఒకే కథను పలువురి చేత చెప్పించి ముగించడం కళాపూర్ణోదయం ప్రత్యేకత. ఉదాహరణకు మణికంధర మణిస్తంభుల కథను నందనవనంలోని చిలుకచేత చెప్పించి చవులూరించాడు సూరన.

కళాపూర్ణోదయ కథాంశాన్ని గమనిస్తే సూరన కథాశిల్పం, సంవిధాన వైచిత్రి వెల్లడవుతాయి. కల్పనాత్మకమైన ప్రధాన కథకు కల్పనాత్మకమైన ఉపకథను జోడించి సూరన అపూర్వమైన సంవిధాన వైచిత్రిని ప్రదర్శించాడు. కళాపూర్ణోదయ కావ్యాన్ని మనం చదువుతున్నప్పుడు ముందు జరిగినవి వెనుక, వెనుక జరిగినవి ముందు తెలుసుకొని ఆశ్చర్యపోతాం. నారదుడు యాదవ ముఖ్యులకు గానవిద్యలో ఎందుకు శిష్యుడయ్యాడో ఆ కారణం మొదట తెలియదు. విష్ణుమూర్తి, ద్వాపరంలో కృష్ణుడుగా అవతరించి ద్వారకలో ఉన్నప్పుడు నారదుడు వచ్చి అతని చేత సత్కృతుడై జాంబవతి మొదలైన వారి దగ్గర సంగీతం నేర్చుకుంటాడు. ఆ తర్వాత గాని మణికంధరుడు అడిగిన మీదట నారదుడు తన పూర్వగాథను వివరిస్తాడు. తుంబురుని మీద తనకు మాత్సర్యం ఏర్పడడానికి గల కారణాన్ని సవివరంగా తెలియజేస్తాడు. ఇదొక అద్భుత కథా నిర్వహణ!

నారదుడు మణికంధరునితో తన గాన శిక్ష పరిపూర్తి అయిన తరువాత ఉత్సాహంతో పలికిన పలుకులు గమనింపదగ్గవి. తాను పడ్డ కష్టాలన్నీ నెరవేరే విధంగా స్వర్గంలోగాని, బ్రహ్మదేవుని కొలువులోగాని, కైలాసంలోగాని, లేదా వైకుంఠంలోగాని తన సంగీత ప్రావీణ్యాన్ని ప్రదర్శించి తుంబురుని గెలుస్తానని పలుకుతాడు నారదుడు.





*" ఏనున్, వేగమయేఁగి నాపడిన పాట్లీడేర, నాకంబులో*
*గానీ, కాంచనగర్భు కొల్వునడుమంగానీ, పురద్విట్సభం*
*గానీ, తొల్లిటి విష్ణుదేవుకడనే కానీ, మదీయోల్లస*
*ద్గాన ప్రౌఢిని వాదుఁబూని, గెలుతున్ గర్వోన్నతుం దుంబురున్"*

నారదుని నోటి నుండి తుంబురుని పేరు వచ్చిన తరువాతగాని మణికంధురునికి నారద, తుంబురుల మధ్య గానవిద్యాసంబంధమైన స్పర్ధ ఉందన్న విషయం తెలిసిరాలేదు. అదే విషయం మణికంధరుని మాటల ద్వారా మనకవగతమవుతుంది. "నీకు గాన విద్యచేత తుంబురుని గెల్చు సంరంభమిప్పటి మాటల వలన యెరుంగంబడియె, నతడియందిట్టి బద్ధమత్సరంబేల పుట్టె! తత్ జయంబున కెన్ని పాట్లం బడితివి? నాకు నింతయు నెరింగింపవలయున్" అని మణికంధరుడు అడిగిన తరువాత గాని నారదుడు తన పూర్వ వృత్తాంతాన్ని అపూర్వంగా చెప్పడానికి సంసిద్ధుడు కాలేదు. మహాత్ములు అడిగితేగాని చెప్పరు అన్న విషయం ఈ సన్నివేశం వల్ల బోధపడుతుంది. నారదుడు తనకూ తుంబురునికి మధ్య ఏర్పడిన స్పర్ధకు గల కారణాన్ని తెలియజేసిన సన్నివేశం ఒక చిన్న నాటకంగా భాసిస్తుంది.

విష్ణుమూర్తి వైకుంఠంలో సభను ఏర్పాటు చేయడం, ఆ సభలో దేవతలు, ఋషులు ఆసీనులై ఉండడం... అంతవరకు బాగానే ఉంది. కాని కథావైచిత్రి అంతా ఆ తరువాత చూడవచ్చు. విష్ణుమూర్తి, మహాసభలో వారాంగన చేసే నాట్యాన్ని దర్శిస్తున్నాడు. లోపల, బైట జనం తాకిడి ఎక్కువైంది. విచిత్ర మేమంటే తనను సేవించడానికి వచ్చిన దేవముని సంఘాన్ని వేత్రహస్తుడైన విష్వక్సేనుడు చెల్లాచెదురు చేయడం. అంతలో లక్ష్మీదేవి అక్కడికి వచ్చిందట. ఆమె మేఘం నుండి వెలువడిన మెరుపు తీగలాగ సఖీజనంతో కూడి ఉన్నదట!

"వారిద పంక్తిలో వెడలివచ్చు మెరుంగుల పిండునాన్ సఖీ వారముతో రమారమణి వచ్చెన్" అని కవి వర్ణించిన తీరు ఎంతో హృద్యమైంది.

కథలో ఎన్నో కల్పనలు చూపిస్తూ ఆ కల్పనలు యదార్ధమైనవా అన్నట్లు మన మనస్సులలో అనుకూల (Positive) భావాన్ని కలిగించడం ఒక విధమైన శిల్పమే. మెరుపు మెరిస్తే ప్రాణికోటి దానిచే ఆకర్షింపబడుతుంది. ఇది ప్రకృతి సహజం. విష్ణుమూర్తి సన్నిధిలో దేవనర్తకి నృత్యం! ఆ కార్యక్రమానికి లక్ష్మీదేవి



www.etelangana.org

స్వయంగా వచ్చింది. ఆమె మెరుపుతీగలా ఉంది. సభకు వెలుపల ఉన్నవారు మరింత సంభ్రమంతో ఆమెను చూడటానికి తొందరపడ్డారు. కనుకనే విష్వక్సేనుడు తన బెత్తానికి పని చెప్పి వారిని పారద్రోలవలసి వచ్చింది. ఈ విధంగా ప్రతి సన్నివేశాన్ని సూరన సంవిధాన చాతుర్యంతో తీర్చిదిద్దాడు. ఇట్లే వెలుపల ఉన్న వారిలో తుంబురుడొక్కడే ఆహ్వానింపబడినాడు. నారదుడిదంతా గమనిస్తున్నాడు. కొంతసేపటి తరువాత తుంబురుడు వెలుపలికి వచ్చాడు. కాని అతడు ఒట్టి చేతులతో రాలేదు. ఏవో బహుమతులతో వస్తే ఇబ్బంది లేదు. కాని గంధపు మైపూతలతో వచ్చి బయటి వాతావరణాన్ని సుగంధభరితం చేశాడు. అది నారదునికి కోపకారణమైంది. ఇది చిన్న విషయమే కాని కథాగమనానికి ఇలాంటి చిన్న విషయాలే ఎంతో ఉపకరిస్తాయి. నారదుని మాటల్లో చెప్పాలంటే

*క॥ "ధగధగ యను పదకంబున*
*నిగనిగయను క్రొమ్మెఱుంగు నేత్రపటమునన్*
*బుగబుగ యను మే పూఁత*
*న్బుగబగ యనిపించె నతఁడు నా హృదయంబున్"*

మొదట "నాకంటే తాను ఘనుడే?" అని తుంబురుని మీద ఆగ్రహాన్ని వెలిబుచ్చిన నారదుడే ఆతర్వాత తుంబురుని ఇంటికి వెళ్ళి అతని చేత మేళవింపబడి ఉన్న వీణను పరిశీలించి అతని గానవిద్యకు పరవశించి సిగ్గుపడ్డాడు. ఈ సన్నివేశాన్ని సూరన ఎంతో ఉదాత్తంగా చిత్రించాడు. తుంబురుణ్ణి తన మనసులో "కడు ప్రావీణ్య ధురీణుడీతడు" అని ప్రశంసించక తప్పలేదు నారదునికి. ఈ కథలోని విశేషమేమంటే తుంబురుడు తన విద్యను ప్రదర్శించడం ద్వారా ప్రసిద్ధుడైనట్లు తెలుస్తున్నది. నారదుని గూర్చి తుంబురుని అభిప్రాయమేమిటి? అన్న ప్రశ్నకు సమాధానం పాఠకులకే విడవబడింది. నారదుడు తుంబురుని మీద తన మనస్సులో ఆగ్రహించాడు, మాత్సర్యాన్ని వహించాడు.అంతే తప్ప దాన్ని ఎక్కడా ప్రదర్శించలేదు. విష్ణుమూర్తి చేత తుంబురుడు సత్కృతుడైన తరువాత కూడా నారదుడు మునుపటి లాగా తుంబురునితో స్నేహంగా ఉన్నాడు. కాకపోతే కొంతవరకు నటించాడు. నారదునికి తుంబురుని విషయంలో ఆగ్రహం ఉంది. కానితుంబురునికి నారదుని విషయంలో ఎలాంటి కోపం లేకపోవడం ఇక్కడ గమనింపదగిన విషయం. తుంబురుని వ్యక్తిత్వాన్ని, నారదుని వ్యక్తిత్వాన్ని విభిన్న





రీతుల్లో అపూర్వంగా చిత్రించి ఉత్తములైన కళాకారుల వ్యక్తిత్వాలు ఎలా ఉంటాయో నిరూపించాడు పింగళి సూరన. నారద గాన మాత్సర్యం కథా భాగాన్ని చదువుతూ ఉంటే ఇదొక ఖండకావ్యమా? అనిపిస్తుంది. వైకుంఠవర్ణనతో ఆరంభమైన ఈ కథ నారదుడు వైకుంఠవాసుని గూర్చి తపస్సు చేసి అతని దయకు పాత్రుడు కావడంతో ముగుస్తుంది. తుంబురునితో పాటు నారదుడు సభలో ప్రవేశించి తన గానవిద్యను ప్రదర్శించి సత్కృతుడు కాకపోవచ్చుగాని, తాననుకున్న పనిని నెరవేర్చుకోవడంలో దృఢ దీక్షా పరతంత్రుడై తపస్సు చేసి విష్ణుమూర్తినే ప్రత్యక్షం చేసుకోవడం నారదుని వ్యక్తిత్వంలోని విశేషం.

నారద గానమాత్సర్యం సంవిధాన వైచిత్రికి, అపూర్వ కథా నిర్వహణకు ఆలవాలమై పింగళి సూరన ప్రతిభను వేనోళ్ళ చాటుతుంది.

## ౨. మానవ మనస్తత్వం -వాస్తవికత

నారదుడు ఒకనాడు శ్రీకృష్ణ దర్శనార్థం ద్వారకా నగరంలో ప్రవేశించాడు. అతడు నేరుగా పట్టణంలో దిగక అక్కడ వ్రాలినందుకు ఏదో విశేషం ఉండి తీరుతుందని అందరూ భావించారు. పౌరులు ఆ బ్రహ్మపుత్రునికి భక్తి శ్రద్ధలతో స్వాగతం చెప్పారు. శ్రీకృష్ణుడు నవరత్నఖచితమైన తూగుటుయ్యేలలో వినోదిస్తూ నారదమహర్షి ఆగమన వార్తను తెలిసికొని దిగ్గునలేచి ఎదురేగి అతణ్ణి తోడ్కొని అంతఃపురంలోకి నేరుగా బయల్దేరాడు. ఆ సమయంలో నారదుణ్ణి చూసిన కలభాషిణి అతనికి నమస్కరించి వినయ సంభ్రమాలతో అతని వీణను తన చేత పట్టుకొని తోడుగా నడిచింది. కృష్ణుడు నేరుగా నారదుణ్ణి అష్టమహిషులలో ఒకరైన జాంబవతి అభ్యంత మందిరానికి తీసుకొని వచ్చాడు. అక్కడే నారదుడు జాంబవతీ దేవికి శిష్యుడై ఆమె వల్ల ప్రత్యేక గానవిద్యను నేర్చుకొన్నాడు. నారదుడు ఒక్క జాంబవతి దగ్గరే కాక సత్యభామ దగ్గర, రుక్మిణి దగ్గర, కృష్ణుని దగ్గర ఒక్కొక్క సంవత్సరం గానవిద్యను అభ్యసించాడు. నిజంచెప్పాలంటే తుంబురుణ్ణి గానవిద్యలో జయించాలన్న గట్టి పట్టుదలతోనే నారదుడు భూలోకానికి వచ్చి యాదవ ముఖ్యులకు శిష్యుడైనాడు.

ఒకరోజు నారదుడు యాదవుల నోట తాను గానవిద్యలో నేర్పరి నన్నమాట



www.etelangana.org

విన్నవాడై అది నిజమో కాదో తెలుసుకొని రమ్మని కలభాషిణిని పురమాయించాడు. కలభాషిణి అప్పుడు తాను కోరిన స్త్రీ రూపం ఎత్త గలిగిన శక్తిని తనకు ప్రసాదించినట్లయితే అంతఃపురంలో అందరితో కలిసి ఈ సంగతి కనుగొనగలనని పలికింది. నారదుడు ఆమెననుగ్రహించాడు. ఆమెకు కామరూపధారణ శక్తి సమకూరడంవల్ల రంభగా మారి నలకూబరుణ్ణి చేరే అవకాశం లభించింది. కలభాషిణి ఏ విధంగానైతే నేమి వారివారి అభిప్రాయాలను తెలుసుకొని, నారదుడు నిజంగా గానకోవిదుడే అన్న విషయాన్ని అతనికి తెలియజేసింది.

నారదుడు యాదవ ముఖ్యులకు గానవిద్యలో శిష్యుడుగా మారాడు. అందుకు గల కారణం ఏమిటని మణికంధరుడడుగగా స్వయంగా నారదుడే ఆ కథంతా వివరించాడు.

ఒకరోజు విష్ణువు వైకుంఠంలో గొప్పసభ నిర్వహించాడు. ఆ సభకు దేవతలు, ఋషులు, పండితులు లోకలోకాల నుంచి వచ్చారు. నారదుడు, తుంబురుడు కూడా సభాస్థలిని చేరుకున్నారు. ఐతే అక్కడ దేవనర్తకి నాట్య ప్రదర్శన జరుగుతున్నందున వైకుంఠవాసులు విరగబడి చూస్తున్నారు. వైకుంఠవాసుని సేనాని విష్వక్సేనుడు బెత్తం పట్టుకొని చేజిక్కిన వారిని ఇష్టం వచ్చినట్లుగా మోదినాడు. ఆ సమయంలోనే లక్ష్మీదేవి కూడా ఆ ప్రదర్శనను తిలకించడానికి వచ్చింది. జనం రెచ్చిపోయి తొక్కిడి మరీ ఎక్కువైంది. ఆ గలభాలో బ్రహ్మదేవుడు కూడా పారిపోవలసి వచ్చింది. అంతలో ఒక వేత్రహస్తుడు ఓ తుంబురా! తుంబురా! అని అరుస్తూ వచ్చి అతన్ని లోపలికి తీసుకొని పోయాడు. ఎంతోమంది బయట నిలిచి ఉండగా తుంబురుడొక్కడే లోపలికి తీసికొనిపోబడడం నారదుని ఈర్ష్యకు కారణమైంది. కొంతసేపటికి తుంబురుడు సభలో సత్కారాన్ని పొంది వెలుపలికి వచ్చాడు. నారదునికి మరింత బాధ కలిగింది. ఎలాగైనా తుంబురున్ని జయించి విష్ణువు చేత గౌరవం పొందుతానని ప్రతిజ్ఞ చేశాడు.

ఆ తరువాత నారదుడు తుంబురునితో స్నేహం నటించి అతని విద్యారహస్యాలను తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఒకనాడు తుంబురుని ఇంటికి వెళ్ళి అప్పటికే తుంబురుని చేత మేళవింపబడి మొగసాల అరుగుపై పెట్టబడిన వీణను చేతిలోకి తీసుకొని పలికించాడు. అప్పుడది అపూర్వ శ్రుతులను వినిపించగా నారదుడు ఆవీణను ఉన్నది ఉన్నట్లుగా ఉంచి, అతణ్ణి చూడకుండా తిరిగి వచ్చాడు.





తుంబురుని జయించాలన్న కోరికతో అప్పుడతడు యాదవముఖ్యులకు శిష్యుడై గానవిద్యలో ప్రావీణ్యం సంపాదించాడు.

లోకంలో ఏ విద్యలోనైనా సమాన స్కంధుల మధ్యగాని, సమానులు కానివారి మధ్యగాని స్పర్థలు ఉండనే ఉంటాయి. తాను అభిమానించే స్నేహితుడే ఐనప్పటికీ తనను మించి పోతే ఓర్వలేకపోవడం లోకసహజం. తన కంటె ప్రతిభగలవాడు, తనను మించినప్పుడు బాధపడవలసిన అవసరం లేదు. కాని తనకంటె మించి, విద్యాపరిశ్రమ చేసి తత్ఫలితంగా గొప్ప పేరు, ప్రఖ్యాతి పొందినపుడు సంతోషించాలి కాని దానికి బదులుగా మాత్సర్యాన్ని వహించడం పద్ధతి కాదు. వైకుంఠంలో జరిగిన సంఘటన ఆధారంగా నారదునికి తుంబురుని మీద ఎంతో కోపం వచ్చింది. ఈర్ష్య పెరిగింది. ఏదైతేనేమి నారదుడు తిరిగి గాన విద్యాభ్యాసాన్ని ప్రారంభించి గానవిద్యలో మరింత ప్రావీణ్యాన్ని సంపాదించగలిగాడు. 'నారద గానమాత్సర్యం' మానవ మనస్తత్వానికి అద్దం పడుతుంది. సాధారణంగా సభాకార్యక్రమం నిర్వహింప బడేటప్పుడు వేత్రహస్తుల హడావుడి తప్పదు. అది వైకుంఠపురం. విష్ణుమూర్తి సభలో ఆశీనుడయ్యాడు. అత్రి, మరీచి, కపిలుడు, దక్షుడు, అంగిరసుడు మొదలైన మహామునులు విష్ణుమూర్తి సందర్శనార్థం విచ్చేసినారు. నారదుడు కూడా తుంబురునితో పాటు సభాస్థలికి విచ్చేసినాడు. ఆ సమయంలో సభలోపల దేవనర్తకి నాట్య ప్రదర్శన జరుగుతుంది. లోపల వైకుంఠవాసులు ఉండి ఉంటారు. బైట కూడా లోపలికి వెళ్ళలేక నిలిచిపోయిన వారూ ఉన్నారు. అందులో నారదుడు, తుంబురుడు కూడా ఉన్నారు.

నేటికాలంలో కూడా ఏదైనా ముఖ్య కార్యక్రమం లేదా సంగీత, నృత్య కార్యక్రమాలు జరుగుతుంటే లోకులు విరగబడి చూస్తారు. లోపల,బైట విశేషంగా జనం ఉండటం కద్దు. జనాన్ని అదుపులో పెట్టడానికి రక్షకభటులు లాఠీలకు పని చెప్పడం కూడా జరుగుతుంది. విష్వక్సేనుడు సేనా నాయకుడు. అతడు స్వయంగా బెత్తం చేత పట్టుకొని ఎక్కడి వారిని అక్కడికక్కడే మోది పారద్రోలినాడు. సృష్టికర్తగా చెప్పబడే బ్రహ్మదేవుడు కూడా విష్వక్సేనుడి బెత్తాన్ని చూసి పారిపోయినట్లు పింగళి సూరన అద్భుతమైన కల్పన చేశాడు. ఎక్కిడి వాళ్ళు అక్కడ వెళ్ళిపోయిన తర్వాత ఇంకా ఆశ చావక కొందరు ప్రదర్శనాస్థలంలో ఉండడం కద్దు. అదృష్టవశాత్తు తుంబురునికోసం లోపలి నుంచి పిలుపు వచ్చింది. తుంబురునికి విష్ణుమూర్తి



www.etelangana.org

సభలో ప్రవేశం లభించింది. నారదునికి ఆవేశం కట్టలు త్రెంచుకునంది. పైగా తుంబురుడు విష్ణువుచే మహాసత్కారాన్ని పొంది గంధపు మైపూతలతో సగర్వంగా అందరి ముందు బైటికి నడిచివచ్చాడు. అది చూసిన నారదుని హృదయం భగభగ మండిపోయింది. తనకు, తనకు జన్మను ప్రసాదించిన బ్రహ్మదేవునికి మహాసభలో ప్రవేశమైనా లభించలేదు. కాని తన తోటి సంగీతకారునికి ఇంత సత్కారమా? అని నారదుడు అవమానభారం చేత క్రుంగిపోయాడు.

నారదుణ్ణి కాదని తుంబురుణ్ణి మాత్రమే సభలోనికి తోడ్కొని పోవటం వల్ల వెలుపల ఉన్నవారు ఏమనుకున్నారో కవి చక్కగా వర్ణించాడు.

*చ॥ కని, తమ లోనఁదా "రితనిఁగ్రమ్మఱఁగాఁ బిలిపించె నేమొకో!"*
*యనియెడువారు, 'గానవిధులందుఁ బ్రసంగము లేమి గల్గెనో!'*
*యనియెడువారు, 'దచ్చతురు లన్యులు లేరె? యితండ కాని యిం?*
*దనియెడు వారునై మనములందున సందియ మొందిరందఱున్*

తమనెవరినీ పిలువకుండా తుంబురుని మాత్రమే ఎందుకు పిలిచారో? అతనికంటె చతురులు ఇంకొకరు లేరేమో! అని సంశయించడం సహజమే. కాని నారదుని యొక్క మానసిక స్థితి సాధారణంగా తోటి కళాకారుల మానసిక స్థితికి అద్దం పడుతుంది. నారదుడు "ఇతనింబిలిపించుటెట్లొకో యిప్పుడు" అని సంశయిస్తూనే, విష్ణుమూర్తి స్వయంగా లక్ష్మీదేవితో పాటు తుంబురుని గానం విన్నాడన్న సంగతి తెలుసుకొని ఎంతో బాధపడ్డాడు.

*కం॥ "మమ్మెల్లఁ దేవి, యొక్కని*
*నిమ్మెయిఁ బిలిపించి, హరియు నిందిరయుఁగడున్*
*సమ్మదమునఁ దుంబురుగా*
*నమ్మును వినుచునికి విలి, మనం బెరియంగన్"?*

తుంబురుడు సభలో ప్రవేశించిన తరువాత నారదుడు తనకెందుకులే అని అక్కడినుండి వెనకకు తిరిగి రాలేదు. తరువాత ఏం జరుగుతుందోనని అక్కడే "ఒక్క మరుంగునన్ కొంతతడవు కనిపెట్టుకొని" ఉన్నాడు. 'ఒక్క మరుంగున' అనగా ఎవరి కంట పడకుండా చాటుగా ఒక మూల నారదుడు నక్కి, తుంబురుడు బైటికి ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూసిన విషయం తేటతెల్లమవుతుంది.





నారదుడు తనను తుంబురుని కంటె తక్కువగా ఊహించుకోవడానికి సిద్ధంగా లేడు. అతడు తనకంటె ఏమాత్రం గొప్పవాడు కాడు అని అభిప్రాయపడ్డాడు. అతన్ని ఎలాగైనా వాదంలో ఓడించి సంగీత చాతురిని ప్రదర్శించి విష్ణుమూర్తి చేత సన్మాన గ్రహీతుడు కావాలని ఆశపడ్డాడు. ప్రత్యర్థి మీది కోపంతో పరుషవాక్కు లాడడం మానవ సహజం. కాని నారదుడు మాత్రం తుంబురుని ఎదురుగా నిలబడి అవమానించే సాహసానికి ఒడిగట్టలేదు. "నా కంటె తాను ఘనుడై" అని తనలో తాను అవమానాన్ని దిగమ్రింగాడు. విద్యాసంబంధమైన స్పర్థను కేవలం స్పర్ధగానే భావించిన నారదుడు చివరికి గానవిద్యలో తన చాతుర్యాన్ని ప్రదర్శించాడు. ఉచితజ్ఞుడు కనుక తన ఈర్ష్యా బుద్ధిని లోలోపలనే అణచుకొని తుంబురుడు ఏ గుణ విశేషాల చేత తన గాన విద్యను లోకోత్తరం, జనరంజకం చేశాడో తెలుసుకోవాలనుకున్నాడు. ఇది నిజంగా ఉత్తమ మానవుని హృదయ సంస్కారాన్ని చాటుతుంది.

*చ॥ "తలఁగక, యిప్పుడిట్లు సముదగ్రతఁ చేర్చిన యీర్ష్యబుద్ధిలో*
*పలన యడంచి, మైత్రి గనుపట్టఁగ నింకను గొంత రాకపో*
*కలు ఘటియించియే నతని గానములో గుణదోషవర్తనల్*
*దెలియుట నీతి, యా తెలివి లేకగునే జయమంచు నెంచితిన్"*

నారదుడు తుంబురునితో స్నేహాన్ని నటించి అతని యింటికి రాకపోకలు సాగించాడు. అతని గాన విద్యా ప్రావీణ్యానికి కారణభూతమైన వీణను రహస్యంగా పరిశీలించి తద్వారా తుంబురుని సంగీత వైదుష్యాన్ని గ్రహించాడు. నిజాన్ని నిజంగా తెలుసుకోగలిగిన శ్రద్ధాళువు కనుకనే నారదుడు, తుంబురుడు తనకంటే "కడు ప్రావీణ్య ధురీణుడని" నిశ్చయించి, తాడి దన్నే వాని తలదన్నే వాడుంటాడని భావించి తాను గాన విద్యలో ప్రావీణ్యాన్ని సంపాదించడానికి సంసిద్ధుడయ్యాడు. ఉత్తములైనవారు ఉత్తముల వద్దనే తమ విద్యను ప్రదర్శిస్తారుకనుక, తుంబురుడు విష్ణుమూర్తి ఎదుట తన గాన విద్యను ప్రదర్శించి మెప్పుపొందాడనికూడా నారదుడు గ్రహించాడు.

లోకంలో విద్యా సంబంధమైన మాత్సర్యం కళాకారులలో ఏవిధంగా ఉంటుందో నారద గాన మాత్సర్యం ద్వారా నిరూపించి మానవ మనస్తత్వాన్ని వాస్తవికతా దర్పణంలో ప్రతిఫలింపజేసిన పింగళి సూరన గొప్ప మనస్తత్వశాస్త్రవేత్త.



www.etelangana.org

# ౬. వామనపురాణం - కథానుశీలనం

'పార్జిటర్' అనే పాశ్చాత్య పరిశోధకుని అభిప్రాయం ప్రకారం పద్దెనిమిది పురాణాలు ఇంచుమించుగా క్రీస్తుశకారంభానికే రాయబడ్డవి. కాని బాలగంగాధర్ తిలక్ విశ్లేషణను బట్టి క్రీ.శ. 2వ శతాబ్దినాటికి పురాణరచన పూర్తి అయినట్లు భావించాలి. కాని ఎడనెడ వాటిలో ప్రసక్తమైన అంశాలను బట్టి పురాణాలు 9వశతాబ్ది దాకా రచింపబడినట్లు ఊహించవచ్చు.

వామనపురాణ రచనాకాలాన్ని ఇదమిత్థంగా చెప్పలేం. కాని అంతర్గత సాక్ష్యాన్ని బట్టి అది క్రీ.శ 9వ శతాబ్ది కాలం నాటిదని ఊహించవచ్చు. 14వ అధ్యాయంలోని సుకేశి కథలో ఋషులు సుకేశికి చెప్పిన సదాచారాల్లో "శంకర ప్రోక్తమైన ప్రాభాతిక మంగళ స్తోత్రం" పఠించడం వల్ల శుభం కల్గుతుందనే విషయం ప్రస్తావింపబడింది.

*"కింతదుక్తం సుప్రభాతం శంకరేణ మహాత్మనా*
*ప్రభాతే యత్పఠన్మర్త్యోముచ్యతే పాప బంధనాత్"*

శంకరాచార్యులది 9వ శతాబ్ది కనుక ఆ కాలం నాటిదే వామనపురాణమని చెప్పడానికి అవకాశం కల్గుతుంది.

మహావిష్ణువు ఐదవ అవతారమే వామనావతారం. వామనావతారంలో కేవలం వామనుని కథ మాత్రమే లేదు. శివకేశవులకు సంబంధించిన మహిమోపేతమైన ఎన్నో ఉపాఖ్యానాలు ఈ పురాణంలో చోటు చేసుకొన్నాయి.

శ్రీమద్భాగవతంలో "వామనచరిత్ర" కనిపిస్తుంది. కాని మనం వామనచరిత్ర అనడం కంటె వామనుని కథ అంటేనే బాగుంటుంది. చరిత్ర అన్నప్పుడు అది యథార్థమై, ఒక కాలానికి చెందినదై ఉండాలి. వామనావతారం స్థలకాలాదులకు అతీతమైంది.

వామనపురాణం అన్ని పురాణాలలాగానే వ్యాస విరచితమై అలరారుతుంది. ఇది పూర్వోత్తర భాగాలతో పదివేల శ్లోకాలలో రచింపబడింది. కాని మనకు పూర్వభాగం మాత్రమే 97 ఆధ్యాయాలలో లభిస్తుంది. బృహద్వామనమనే పేరుగల ఉత్తర భాగం అలభ్యం. ఈ 97 అధ్యాయాలలో ఇరవై ఎనిమిది అధ్యాయాలు 'సరోమాహాత్మ్యం' పేరుతో కురుక్షేత్రంలోని బ్రహ్మ సరోవరంతో పాటు ఇతరమైన





అనేక సరోవరాలను గూర్చి వర్ణిస్తున్నాయి. బలిచక్రవర్తి యజ్ఞం చేసింది కురుక్షేత్రంలోనే అని వామన పురాణం చెబుతుంది. కాని బలియజ్ఞం పుష్కరతీర్థంలో జరిగినట్లు పద్మపురాణం, హరిద్వారంలో జరిగినట్లు అగ్ని పురాణం, ప్రభాస క్షేత్రంలో జరిగినట్లు స్కాందపురాణం, నర్మదాతీరంలో జరిగినట్లు శ్రీమద్భాగవతం తెలుపుతున్నాయి.

వామన పురాణాన్ని పులస్త్యబ్రహ్మ మొట్ట మొదటిసారి నారదునికి వినిపించాడు. నారదుడు వ్యాసునికి, వ్యాసుడు సూతునికి, సూతుడు నైమిశారణ్యంలోని శౌనకాది మునులకు వినిపించినట్లు ఈ పురాణంలోనే ఉంది.

వామనపురాణంలో మహావిష్ణువు త్రివిక్రముడైన కథతో పాటు మరికొన్ని కథలున్నాయి. వాటిలో నరనారాయణోపాఖ్యానం, ప్రహ్లాదుని కథ, శ్రీరాముని కథ ప్రసిద్ధమైనవి.

పద్దెనిమిది పురాణాలలో వామనపురాణం ప్రత్యేకమైంది. వామనపురాణం అనడంకంటే మనపురాణం అంటే బాగుంటుంది! ఈ పురాణంలో విష్ణువు, విష్ణుసంబంధమైన కథలు ప్రాధాన్యం కల్గినవైనప్పుటికీ శివుని శ్రేష్ఠత్వానికి ఎక్కడా భంగం వాటిల్లలేదు. శివకేశవుల ఐక్యతాసూత్రానికి వామనపురాణం మంచి ఉదాహరణ. శైవవైష్ణవ సంప్రదాయాలకు సమప్రాధాన్యం ఇస్తున్న ఈ పురాణంలో హరిహరుల మహిమలు పడుగు పేకల్లా కలిసిపోయాయి. అసలీ పురాణం దక్షాధ్వర ధ్వంసంతోనే అరంభం కావడం విశేషం.

విష్ణుకథలతో పాటు, శివలీలలు, బ్రహ్మశిరచ్ఛేదన కథ, కపాల విమోచనం, దక్షాధ్వర ధ్వంసం, విష్ణుమూర్తి కాలరూపం, కామదహనం, ప్రహ్లాద నారాయణుల యుద్ధం, భువనకోశం, దుర్గాదేవి చరిత్ర, కురుక్షేత్ర వర్ణనం, సత్యామాహాత్మ్యం, పార్వతీదేవి జననం, గౌరీదేవి ఆఖ్యానం, స్కందచరిత్ర, అంధకాసుర వధ, జాబాలి కథ, మరుద్గణాల అవిర్భావం, ప్రేతోపాఖ్యానం, నక్షత్ర పురుషాఖ్యానం మొదలైన కథలు పఠితల మనస్సులమీద ఎంతో ప్రభావాన్ని చూపుతాయి.

ఇతర పురాణాలలో కనిపించని విషయాలు వామన పురాణంలో సాక్షాత్కరిస్తాయి. శివుడు ధరించే సర్పాల పేర్లు, దేవదానవులధిరోహించే వాహనాల పేర్లు, కర్కాటక చవితి వ్రతం, కాయజ్ఞలివ్రతం, గంగా మానసిక స్నానం,



www.etelangana.org

వేంకటేశగిరి మహిమ, సుకేశి చరిత్ర, ప్రహ్లాదుని తీర్థయాత్ర, వామనమూర్తి వివిధరూపాలు మొదలైనవి ఈ పురాణానికే పరిమితమైనవి.

దక్షాధ్వరంతో ఆరంభమై ప్రహ్లాదుడు తన మనుమడైన బలిచక్రవర్తికి చేసే విష్ణుమహిమోపదేశంతో ముగుస్తున్న ఈ పురాణంలో రెండు వామనావతార కథలున్నాయి. వాటిలో ఒకటి బలిచక్రవర్తి కథ కాగా, రెండవది "ధుంధుడ" నే రాక్షసునికి సంబంధించిన వామనుని అవతార కథ. ఈ ధుంధుని కథ యాబది రెండవ అధ్యాయంలో ఉంది.

**ధుంధుని కథ:**

విష్ణువు వామనుడుగా అవతరించి బలిని పాతాళానికి పంపిన కథకంటె ముందు త్రివిక్రముడై ధుంధుడనే రాక్షసుణ్ణి మట్టుపెట్టాడు. ధుంధుడు కూడా కశ్యప ప్రజాపతికి ఔరసుడే. రాక్షసులందరిలాగానే బ్రహ్మచే చావులేకుండా వరాన్ని పొంది స్వర్గం మీదికి యుద్ధానికి వెళ్లాడు. ఇంద్రాది దేవతలను పారద్రోలి స్వర్గాన్ని జయించాడు. పారిపోయిన దేవతలు చివరికి బ్రహ్మలోకం చేరుకోగా ధుంధుడక్కడికి కూడ వెళ్లి వారిని సంహరించాలనుకున్నాడు. ఐతే బ్రహ్మలోకం చేరాలంటే నూరు అశ్వమేధయాగాలు చేయాలని, దక్షిణలివ్వాలని గురువు శుక్రాచార్యుడు సలహా ఇచ్చాడు. వెంటనే ధుంధుడు యజ్ఞాన్ని ఆరంభించగా యజ్ఞధూమం బ్రహ్మలోకాన్ని చేరి దేవతలకు తాపకారణమైంది. వారంతా బ్రహ్మకు తమ కష్టాలను విన్నవించుకోగా బ్రహ్మ వారిని శ్రీమహావిష్ణువు దగ్గరికి తీసుకొని వెళ్ళాడు. వారి ప్రార్థనను ఆలకించిన విష్ణుమూర్తి మరుగుజ్జురూపాన్ని ధరించి ధుంధుని యజ్ఞ సమీపంలోని దేవికానదీ జలాల్లో పడిపోయాడు. యజ్ఞనిష్ఠలో ఉన్న ధుంధుడు వామనుని రూపంలో ఉన్న విష్ణువుని రక్షించి నీకేమి కావాలని అడగ్గా అతడు తనకిద్దరు సోదరులున్నారని, వారివల్ల ఆస్తి తగాదా ఏర్పడిందని, కోపంలో వారు తనను నదీజలాల్లో తోశారని చెప్పినాడు. ధుంధుడు జాలిపడి "నీకేం కావాలో కోరుకో" అన్నాడు. వామనుడు తనకు మూడడుగల నేలను ఇస్తే చాలన్నాడు. ధుంధుడు అట్లే మూడడుగుల నేలను దానం చేయగా, వామనమూర్తి దివినీ, భువినీ వశం చేసుకొని మూడవ అడుగును అతని వీపుమీద పెట్టాడు. అప్పుడు ధుంధుడున్నచోట ముప్పదియోజనాల మేరకు భూమికి గుంత ఏర్పడింది. వామనుడు తన మహిమచే ఆ గుంతను ఇసుకతో నింపి అంతర్ధానమైనట్లు వామనపురాణం తెలుపుతుంది.





ఇంచు మించుగా రెండు వామనావతార కథలు ఒకటే. రెండింటిలోను ప్రహ్లాదుడున్నాడు. స్వర్గాన్ని ఆక్రమించి దేవతలకు అన్యాయం చేసినందుకు నొచ్చుకున్న ప్రహ్లాదుడు అటు బలిని, ఇటు ధుంధున్ని శపించాడు. అంతేకాదు వారికి విష్ణువుయొక్క గొప్పతనాన్ని కూడా తెలియజేశాడు. హిరణ్యకశ్యపుని కుమారుడు ప్రహ్లాదుడు. ప్రహ్లాదుని కుమారుడు విరోచనుడు. విరోచనుని కుమారుడు బలి. బలిని శపించి, అతని గర్వాన్ని పరోక్షంగా పోగొట్టినవాడు ప్రహ్లాదుడే. వంశక్షయం కాకుండా చూడవలసిన బాధ్యత తద్వంశీయులకు ఉండడం సహజమే కదా!

ఈ పురాణంలోని కథలు ఒకదానికొకటి సంబంధం కలిగి ఉన్నాయి. శివుడు కపాలిధారి కనుక దక్షుడతణ్ణి యజ్ఞానికి పిలువలేదు. ఈ విషయాన్ని దాక్షాయణి, జయ అనే తన సోదరి ద్వారా తెలుసుకొని ప్రాణాలు విడిచింది. శంకరుడు కోపించగా అతని క్రోధం నుండి వీరభద్రుడు జన్మించాడు. రుద్రగణం యజ్ఞాన్ని ధ్వంసం చేసింది. అక్కడున్న దేవతలు, ఋత్విజులు విష్ణువును ఆశ్రయించారు. విష్ణువు వీరభద్రుని మీద శార్ఙ్గధనువును ప్రయోగించి విఫలుడయ్యాడు. చివరికి చక్రాన్ని ప్రయోగిస్తే దాన్ని వీరభద్రుడు మ్రింగాడు. కాని విష్ణువు అతణ్ణి మర్దించడం వల్ల ఆ చక్రం బయటికి వచ్చింది.

శివుడు కపాలి ఎట్లా అయ్యాడు? అనేదానికి, విష్ణువుకు సుదర్శనచక్రం ఎట్లా లభించింది? అనేదానికి సమాధానంగా చక్కని కథలు ఈ పురాణంలో కనిపిస్తాయి. సృష్ట్యాదిలో శివబ్రహ్మలకు విరోధమేర్పడినప్పుడు శివుడు బ్రహ్మయొక్క ఐదవముఖాన్ని కొనగోటితో తొలగించాడు. అప్పుడా బ్రహ్మకపాలం తన చేతికంటు కొన్నది. బ్రహ్మకపాలంతో పాటు బ్రహ్మహత్యాపాపం కూడా శంకరుణ్ణి ఆవహించింది. పాప ప్రక్షాళనకై అతడు బదరికావనానికి వెళ్లి నారాయణున్ని దర్శించుకొని, అతని ఆజ్ఞచే కాశీకి వెళ్లి బ్రహ్మహత్య నుండి విముక్తుడై తిరిగి బదరికావనంలోని తీర్థంలో స్నానమాడి కపాలమోక్షం పొందినాడు. కపాలమోక్షం పొందడం వల్ల కపాలమోక్షమనే తీర్థం ఏర్పడినట్లు వామనపురాణంలో సుందరమైన కథ వర్ణింపబడింది.

ఇట్లే సుదర్శన చక్రం కథను పరిశీలించవచ్చు. ఉపమన్యువు ఆత్రేయీ వీతమన్యుల కుమారుడు. దారిద్ర్యం చేత తల్లి నీటిలో పిండి కలిపి పాలని చెప్పి



www.etelangana.org

పిల్లవాణ్ణి భ్రమింపజేసింది. ఒకరోజు ఉపమన్యువు తండ్రితో కలిసి ఒకరి యింటికి విందుకు వెళ్లి అసలు పాల రుచి చూసి, ఇంటికి వచ్చి ఇదేమిటని తల్లిని ప్రశ్నించాడు. ఆమె విషయం చెప్పి "బాబూ! నీకు ఒక్క పాలేమిటి అమృతం కూడా దక్కాలంటే విరూపాక్ష స్వామిని ఆరాధించ" మంటుంది. ఉపమన్యువు ఆయన ఎవరని అడుగుతాడు. ఆమె ఈ క్రింది కథ చెబుతుంది.

శ్రీధముడనే రాక్షసుడు విష్ణుమూర్తి సర్వస్వమైన లక్ష్మీదేవిని అపహరించగా విష్ణువు చేసేది లేక శివుని గూర్చి వెయ్యేళ్లు తపస్సు చేసి ఆ రాక్షసుణ్ణి సంహరించడానికి చక్రాన్ని సంపాదిస్తాడు. ఐతే దాని ప్రభావం తెలుసుకునే కోరికతో శివుని మీదనే ప్రయోగిస్తాడు. ఆ కారణంగా శివుడు మూడుముక్కలౌతాడు. ఆ రూపాలే హిరణ్యాక్షుడు, సువర్ణాక్షుడు, విరూపాక్షుడు అనేవి. ఆ మూడురూపాలలో విరూపాక్షున్ని ఆరాధిస్తే నీకు శుభం కల్గుతుందని తల్లి ఆదేశించగా ఉపమన్యువు అట్లే చేసి క్షీరాన్నాలను సమృద్ధిగా పొందుతాడు.

కపాలమోక్షం కథలో విష్ణుమహిమను, ఉపమన్యుని కథలో శివమహిమను తెలుసుకోవచ్చు. ఇట్లే వామనపురాణంలోని ప్రతికథ శివకేశవుల మహిమలను విరోధం లేకుండా తెలపడం విశేషం.

గజేంద్రమోక్ష కథకు మూలం వామన పురాణంలో లభిస్తుంది. ఈ కథ యాభైఏడవ అధ్యాయంలో వర్ణింపబడింది. ప్రహ్లాదుడు గజేంద్రమోక్షణ స్తవాన్ని జపించినట్లు చెప్పబడింది.

**గజేంద్రుని కథ:**

త్రికూట పర్వతం మీద గంధర్వులు విహరిస్తారు. అలాంటి చోట గజేంద్రుడూ విహరిస్తూ అక్కడి సరోవరంలో నీళ్ళు తాగి కాసేపు అందులోకి దిగి విహరించాడు. ఇంకేముంది? మొసలి అతని కాలు పట్టుకొంది. అతని ఆడ ఏనుగులు విలపించాయి. మొసలి కన్నీరు కార్చింది కాని వారి కన్నీటికి జాలి పడి మాత్రం కాదు. గజేంద్రుడు ఎంతోకాలం పోరాడి శక్తిహీనుడయ్యాడు. చివరికి నారాయణున్ని స్మరించాడు. ఉపనిషత్తుల్లోలాగా స్తుతిని తలపిస్తున్న స్తుతి గావించాడు.

**"కూటస్థమవ్యక్త మచింత్యరూపం నారాయణ కారణమాదిదేవం**
**యుగాంతశేషం పురుషం పురాణం తం దేవ దేవం శరణం ప్రపద్యే"**





**"అదృశ్యమవ్యక్తమచింత్యమవ్యయం,**
**మహర్షయో బ్రహ్మమయం సనాతనం**
**వదంతి యం పురుషం సనాతనం,**
**తం దేవ గుహ్యం శరణం ప్రపద్యే"**

విష్ణుమూర్తి వెంటనే ప్రసన్నుడై మొసలి మీద చక్రాన్ని ప్రయోగించి గజేంద్రునికి మోక్షం లభింపజేశాడు. పరోక్షంగా దేవలుని శాపం చేత మకరిగా మారిన "హూహూ" అనే గంధర్వుడు కూడా శాపవిముక్తుడయ్యాడు. ప్రార్థించినవాణ్ణి, ప్రార్థించనివాణ్ణి ఇద్దరినీ బ్రోచినవాడు శ్రీమన్నారాయణుడు.

ఈ సందర్భంలో 60,61 అధ్యాయాలలో గల పాపశమన స్తోత్రాలు భగవంతుని గుణగణాలను తెలిపేవి మాత్రమే కాదు మనలోని మాలిన్యాన్ని కడిగివేయ గలిగినవి.

ఈ పురాణంలో ప్రహ్లాదుడు నరనారాయణులతో యుద్ధం చేసిన కథ మనకు ఆసక్తిని కల్గిస్తుంది. ప్రహ్లాదుడు పాతాళం నుంచి నైమిశారణ్యానికి వచ్చి విష్ణుమూర్తిని దర్శించాలని కోరుకున్నాడు. కాని అక్కడ ఒక సాలవృక్షం బాణాలతో సందు లేకుండా గ్రుచ్చబడి ఉండడం చూసి, ఆవిధంగా చేసినవారు దాంభికులని భావించి వారితో యుద్ధం చేయాలనుకున్నాడు. నిజానికి ఆ సాల వృక్షాన్ని బాణాలతో గ్రుచ్చిన వాళ్లు నరనారాయణులే. అదీ కారణం నర నారాయణులతో యుద్ధం చేయడానికి. కాని ఆ యుద్ధంలో విష్ణువే గెలిచాడు. వరం కోరుకొమ్మన్నాడు. విష్ణుభక్తిని కోరుకున్నాడు ప్రహ్లాదుడు. మళ్లీ వరం కోరుకొమ్మన్నాడు విష్ణువు. రాజ్యాన్ని ఏలుకోమన్నాడు కాని, ప్రహ్లాదుడు ఒకసారి విడిచిన దాన్ని మళ్లీ స్వీకరించనన్నాడు. అంధకునికి రాజ్యమిచ్చి తపస్సుకు వెళ్ళాడు. నేటికాలంలో మనవాళ్ళైతే ఎన్నిసార్లైనా ఒకే పదవిని అధిరోహిస్తారు. ఖాళీగా ఉండడం ఇష్టంలేక చిన్నదైనా స్వీకరిస్తారు. కాని ప్రహ్లాదుడు దీనికి భిన్నుడు.

వామనపురాణంలోని కథల్లో సుకేశి కథ కూడా ప్రసిద్ధమైందే. సుకేశి విద్యుత్కేశి అనే దైత్యరాజు కుమారుడు. మగధకేతెంచి, ఋషులకు మ్రొక్కి ఇహపర సాధనమేమిటని అడుగగా వారు "అభ్యుదయ నిశ్శ్రేయస సిద్ధిః సధర్మః" అని చెబుతారు. ఐతే వారు 12 యోనుల ధర్మాలను వివరిస్తూ పరస్త్రీలను చెరబట్టడం,



www.etelangana.org

పర ధనాలను అపహరించడం రాక్షస ధర్మాలని చెప్పి, అట్టి ధర్మాలను ఉల్లంఘించడం వల్ల రాక్షసులకు నరకం లభిస్తుందనడం విచిత్రంగా ఉంది. సుకేశి ఋషుల వల్ల ఎన్నో విషయాలను తెలుసుకొని తన నగరానికి వచ్చి రాక్షసులను ధార్మికులుగా మార్చి వేసినాడు. తన నగరం పగటివేళ చంద్రుడుగా, రాత్రివేళ సూర్యుడుగా మారి కాంతివంతమైంది. అందుకే సూర్యుడు సుకేశి నగరాన్ని కిందికి పడదోశాడు. ఎవరి పనులు వారు నిర్వహించాలనే ఉపదేశాన్ని ఇస్తున్నదీ కథ.

విస్తారంగా వర్ణింపబడిన సరోమాహాత్మ్యంలో బ్రహ్మసరోవరం విశిష్టమైంది. సాక్షత్తు సరస్వతి అందులో నిలిచింది. కురుక్షేత్రంలో దీనితోపాటు ఇంకెన్నో తీర్థాలు, నదులు ఉన్నాయి. పంచనద తీర్థం, అశ్వినీ తీర్థం, సోమతీర్థం, ఏకహంస తీర్థం, ముంజవట తీర్థం, పుష్కర తీర్థం, కపిల తీర్థం ముఖ్యమైన తీర్థాలు. ఇట్టి వర్ణనల వల్ల పురాణాల ప్రాశస్త్యం ఇనుమడిస్తుంది. యుగంధర తీర్థంలో పెరుగును తిని అచ్యుతతీర్థం లో ఉపవాసముండి, భూతాలయ తీర్థంలో స్నానం చేస్తే, సమస్తపాపాలు పోతాయని భక్తుల భావన. ఈ తీర్థాల్లో "అన్య జన్మ"మనే తీర్థం ఒకటుంది. ఇది విచిత్రమైంది. విష్ణువు నరసింహావతారం ఎత్తి, రాక్షసవధానంతరం సింహరూపంలోనే ఉండిపోయాడు. అప్పుడు శివుడు శరభ రూపమెత్తి అతనితో వేయి దివ్యవర్షాలు యుద్ధం చేశాడు. ఇద్దరూ బ్రహ్మ సరోవరంలో పడిపోయారు. విష్ణువు చతుర్భుజుడయ్యాడు. శివుడు లింగాకృతి ధరించాడు. సరోవరమాహాత్మ్యాన్ని పఠిస్తుంటే దేశంలోని ఇన్ని తీర్థాలు ఇప్పుడేమయ్యాయి? అన్న ప్రశ్న మనకు తప్పక కల్గుతుంది.

**కొత్తకథ:**

కచ దేవయానుల కథ మనకు తెలుసు. వామనపురాణంలో ఇలాంటికథే ఉంది. దండుడనే రాక్షస రాజు ఒకడుండేవాడు. అతని పురోహితుడు శుక్రుడు. శుక్రాచార్యుడు లేని సమయంలో అతని ఆశ్రమానికి దండుడు వచ్చి గురుపుత్రిక అయిన "అరజ"ను మోహిస్తాడు. ఆమె అతణ్ణి తన తండ్రిగారి శిష్యుడు గనుక సోదరునిగా భావించి అతని కోరికను తిరస్కరిస్తుంది. అప్పుడతడు ఆమెకు ఎన్నో కథలు చెప్పి లొంగతీసుకోవడానికి ప్రయత్నిస్తాడు. కాని ఆమె వినదు. అతడు ఆమెను తన కామాగ్నికి బలిచేస్తాడు.

ఆ తర్వాత శుక్రుడు ఆశ్రమానికి వచ్చి దండున్ని శపించడమే గాక వాని





పేరుతో ఏర్పడ్డ దండకారణ్యాన్ని రాక్షస నిలయంగా ఉండుగాక అని పరుషంగా పలుకుతాడు.

కచదేవయానుల కథ మహా భారతంలో ఉంది. శుక్రుని పుత్రిక దేవయాని. ఆమె స్వయంగా కచుణ్ణి పెళ్లాడమని కోరగా "నీవు నా గురుపుత్రికవు, నాకు సోదరితో సమానురాలవు" అని తిరస్కరిస్తాడు. వామనపురాణంలోని కథ దీనికి విరుద్ధమైంది. ఇంకా కొన్ని కథలు విచిత్రమైనవి. ఉదాహరణకు జలోద్భవుని కథ ఉంది. ఇది శివకేశవుల అభేదానికి ప్రతీక. జలోద్భవుడు రాక్షసుడు. అతణ్ణి చంపడానికి విష్ణువు శూలాన్ని, శివుడు చక్రాన్ని ధరించినట్లు వర్ణింపబడడం గమనార్హం.

సుకేశికథ ఆధారంగా ఆనాటి ఆచారాలు కొన్ని తెలుస్తున్నాయి. ఆకాలంలో విధిపూర్వకంగా చేయని దానాలు, అవైదికమైన శ్రాద్ధకర్మలు, శ్రద్ధాభక్తులు లేని హోమాలు, దక్షిణలేని యజ్ఞాలు, బ్రహ్మచర్యం పాటించని వేదాధ్యయనాలు జరిగినట్లు ఈ పురాణం తెలియజేస్తుంది.

బహుశా ప్రాచీనకాలంలో వల్లభ వ్రతం చాల ప్రసిద్ధి పొందినటువంటిది. వామన పురాణంలోని యాభైనాల్గవ అధ్యాయంలో ఈ వ్రతవిధానం చెప్పబడింది. చైత్రశుద్ధ అష్టమినాడు చంద్రుడు మూలా నక్షత్రంతో కలిసి ఉన్నప్పుడు శ్రీహరికి నైవేద్యాలు సమర్పించాలి. వాటిలో ముఖ్యంగా బెల్లపు ఉండలు, పెసరులడ్లు, బియ్యపు పేలాలు, శాల్యన్నం(వరి అన్నం), పరమాన్నం (బెల్లంబువ్వ), యవాన్నం, దోసపండ్లు, నూవులడ్లు, పెరుగన్నం, నేతిపాయసం, నూవుల వడలు, అల్లం, బెల్లంతో చేసిన కుడుములు ఉండదగినవి. భక్తులు వీటినన్నింటిని ఆ కాలంలో చక్కగా తయారుచేసి భగవంతునికి అర్పించేవారని తెలుస్తుంది.

వామనపురాణంలో కేవలం భక్తికథలే కాక జ్ఞానాంశాలు కూడా ఉన్నాయి. ద్వాదశ రాశులకు, నక్షత్రాలకు సంబంధించిన శాస్త్ర విషయాలున్నాయి. అక్కడక్కడ కావ్యానుభూతిని కల్గించే వర్ణనలు కూడా ఉన్నాయి. శిశిరం పోయి వసంతం రావడాన్ని కవి **"శిశిరం నామ మతంగం విదార్య నఖైరివ, వసంత కేసరీ ప్రాప్తః పలాశ కుసుమైర్మునే"** శిశిరమనే ఏనుగును మోదుగు పూలనే గోళ్లతో చీల్చుతున్నదా? అన్నట్లు వసంతమనే సింహం విజృంభించిందట!



www.etelangana.org

# 7. ఉపనిషత్తులలో స్త్రీ చైతన్యం

ఉపనిషత్తులు భారతీయ సంస్కృతికి పట్టుగొమ్మలు. మానవ జీవన పరమార్థాన్ని వివరించి చెప్పడంలో ఉపనిషత్తుల ప్రాధాన్యం సాటిలేనిది. ఆదిశంకరుని నుండి అరవిందుని వరకు ఎంతోమంది మహనీయులను ఆకర్షించిన ఉపనిషత్తులు అందరూ పఠింప దగ్గవి.

ఉపనిషత్తులు ఏ కాలం నాటివో చెప్పడం కష్టం. కొన్ని ఉపనిషత్తులు మాత్రం జైన బౌద్ధ మతాల కంటే పూర్వమే రచింపబడినట్లు పండితులూహిస్తున్నారు. కాలక్రమేణ వివిధ సంప్రదాయాల వారు సొంత ఉపనిషత్తులను రూపొందించుకోవడం వల్ల ఉపనిషత్తుల స్వభావంలో మార్పులు రావడమేగాక, వాటి సంఖ్య కూడా పెరిగింది.

ఆదిశంకరులు పది ఉపనిషత్తులను పేర్కొనగా, ముక్తికోపనిషత్తు నూట ఎనిమిది ఉపనిషత్తులను గుర్తించింది. పాశ్చాత్య పరిశోధకుడైన బార్త్ రెండు వందల యాభై ఉపనిషత్తులున్నాయని తెలియజేశాడు.

ఉపనిషత్తును ఒక వ్యక్తి కర్తృత్వంగా భావించడం కంటె ఒక కాలంలో, ఒక సంప్రదాయంలో వెలువడిన జ్ఞాన ప్రవాహంగా భావించడం సముచితంగా ఉంటుంది.

'ఉపనిషత్' అనే పదానికి గల అర్థం విశిష్టమైంది. ఉప=సమీపంలో, ని=బాగుగా, షత్=కూర్చోవడం అని ఆ పదానికి అర్థం. ఉపాధ్యాయునికి సమీపంలో కూర్చొని చక్కగా ఒక విషయాన్ని గూర్చి అధ్యయనం చేయడం లేదా చర్చించడం ఉపనిషత్తుల పరమలక్ష్యం.

ఉపనిషత్తులలో ఒకటైన 'ఈశావాస్యమ్' వేదాంతర్భాగమే. బృహదారణ్యకం, ఛాందోగ్యం అనే ఉపనిషత్తులు పరిమాణంలో పెద్దవేగాక ప్రాచీనమైనవి కూడా. వాటిలో కనిపించే స్త్రీలు సామాన్యులు కారు. విద్యాగంధం లేనివారు అంతకంటే కారు. వారు కేవలం గృహిణులుగానే కాక విదుషీమణులుగా, బ్రహ్మజ్ఞానులుగా కనిపిస్తారు.

యాజ్ఞవల్క్యుడు బ్రహ్మజ్ఞాని. అతనికిద్దరు భార్యలు. ఒకరు మైత్రేయి, మరొకరు





కాత్యాయని. గృహస్థాశ్రమం తర్వాత యాజ్ఞవల్క్యుడు ఆశ్రమాల్లో మూడవదైన సన్యాసాశ్రమంలో ప్రవేశిస్తూ మైత్రేయిని పిలిచి "నీకూ, కాత్యాయనికీ నాకున్న ఆస్తిని పంచి ఇస్తున్నాను, స్వీకరించండి" అని కోరాడు.

అప్పుడు మైత్రేయి "మీరు నాకిచ్చే సంపదతో అమృతత్వం (మోక్షం) పొందగలనా?" అని ప్రశ్నించింది.

"సంపద ఉంటే సుఖంగా జీవించవచ్చు గాని, మోక్షం మాత్రం లభించదు" అని సూటిగా సమాధానం ఇచ్చాడు భర్త.

వెంటనే మైత్రేయి భర్తతో "ఏ సంపద నాకు మోక్షాన్ని ప్రసాదించదో, ఆ సంపదతో నాకేం పని? మోక్షాన్ని పొందడానికి మీరు తెలుసుకున్న రహస్యాన్ని దయచేసి నాకు ఉపదేశించండి" అని కోరింది.

ఆ విధంగా మైత్రేయి తనను అడిగినందుకు బ్రహ్మవేత్త ఐన యాజ్ఞవల్క్యునికి కోపం రాలేదు. పైగా సంతోషం కల్గింది. కనుకనే ఆయన "ప్రియా బతారే నః సతీ ప్రియం భాషసే" (నీవు నా ప్రియమైన భార్యవు. ప్రియంగా మాట్లాడుతున్నావు) అని ప్రశంసించడమేగాక, తన ముందు కూర్చొమ్మని చెప్పి ఆమెకు బ్రహ్మవిద్యను ఉపదేశించాడు.

ఈ సందర్భంగా ఆ మహర్షి ఆమెతో "తన సుఖాన్ని మాత్రమే చూసుకొనే భర్త భార్యకు ఏనాటికీ ప్రేమపాత్రుడు కాజాలడు. నిజంగా భార్య సుఖం కోరే భర్తే భార్యకు ప్రేమ పాత్రుడౌతాడు" అని పలికిన పలుకులు మహిళల పట్ల పురుషుల కుండవలసిన గౌరవ భావాన్ని తెలియజేస్తున్నాయి. ఏ విద్య ఐనా భార్యాభర్తలు కలిసి సాధించవచ్చుననే విషయం కూడా బోధపడుతుంది.

"ఆత్మను గూర్చి తెలుసుకోవాలి. ఆత్మ తత్త్వాన్ని గూర్చి వేదాది గ్రంథాలు చెప్పినదాన్ని వినాలి. ఆత్మను గూర్చి ఆలోచించాలి. ఆత్మనే ధ్యానించాలి". అన్నదే యాజ్ఞవల్క్యుడు మైత్రేయికి చేసిన బ్రహ్మోపదేశం.

యాజ్ఞవల్క్యునికి తన భార్యపట్ల గల ప్రేమ ఎలాంటిదో ఈ సంఘటన నిరూపిస్తుంది. తాను తెలుసుకున్న బ్రహ్మ విద్య ద్వారా తాను తరించడమేగాక తన భార్యను కూడా తరింపజేసిన మహాపురుషుడు యాజ్ఞవల్క్యుడు.

ఈ సన్నివేశం స్త్రీ చైతన్యాన్ని నిరూపిస్తుందని వేరే చెప్పనవసరం లేదు.



www.etelangana.org

ఇలాంటిదే మరొక ఉదాహరణ.

జనకుడు లోక కళ్యాణార్థమై 'బహుదక్షిణ' మనే పేరుతో ఒక గొప్ప యజ్ఞాన్ని ఆరంభించాడు. కురుపాంచాల దేశాల నుండి ఎంతోమంది పండితులు ఆ యజ్ఞానికి ఆహ్వానింపబడ్డారు. ఆ విధంగా వచ్చిన వారిలో అశ్వలుడు, ఆర్తభాగుడు, భుజ్యుడు, ఉషస్త చాక్రాయణుడు, కహోలుడు, ఉద్దాలకుడు, విదగ్ధుడు, గార్గి అనే విదుషీమణి, యాజ్ఞవల్క్యుడు అనేవారు ముఖ్యులు.

జనకునికి ఇంతమంది పండితులలో బ్రహ్మవేత్త ఎవరో తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. బ్రహ్మవేత్త ఎవరో తెలిస్తే, అతనికి బహుమానంగా ఒక్కొక్క శృంగానికి పదేసి బంగారు నాణాల చొప్పున కట్టిన వెయ్యి గోవులను ఈయడానికి సిద్ధపడ్డాడు.

జనకుడు సభలోని పండితులను ఉద్దేశించి "మీలో ఎవరు బ్రహ్మవేత్తలో, వారు ఈ గోవులను తమ ఆశ్రమానికి తోలుకొని పోవచ్చు"నని సెలవిచ్చాడు.

సభలోని వారంతా మౌనంగా ఉండిపోయారు. కాని యాజ్ఞవల్క్యుడు మాత్రం ఆ గోవులను తమ ఆశ్రమానికి తోలుకొని పోవలసిందిగా తన శిష్యుడైన బ్రహ్మచారిని ఆజ్ఞాపించాడు. అప్పుడు సభలో కలకలం బయలుదేరింది. పండితులు యాజ్ఞవల్క్యుని మీద ప్రశ్నల వర్షం కురిపించారు. వారికతడు సరియైన సమాధానాలిచ్చాడు.

గార్గికి మాత్రం యాజ్ఞవల్క్యున్ని రెండు మార్లు ప్రశ్నించే అవకాశం లభించింది. మొదటిసారి అందరిలాగే అడిగి సమాధానాల్ని పొందింది. కాని చివర మాత్రం యాజ్ఞవల్క్యున్ని బ్రహ్మవేత్తగా నిర్ణయించే అధికారాన్ని పండితులు ఏకగ్రీవంగా ఆమెకప్పగించారు. తనకు కలిగిన అవకాశాన్ని గార్గి వదులుకోలేదు. జనకుని సభలో ఎంతోమంది సుప్రసిద్ధులైన పండితులుండగా ఒక వ్యక్తిని బ్రహ్మవేత్తగా నిర్ణయించే అదృష్టం భారతీయ చరిత్రలో ఒక స్త్రీకి లభించిందంటే ఆశ్చర్యపోనక్కరలేదు.

ఈ సందర్భంగా ఆమె పలికిన పలుకులు ఉదాత్తమైనవి. "పూజ్యులైన పండితులారా! మీరనుమతించారు కనుక యాజ్ఞవల్క్యున్ని రెండవసారి ప్రశ్నిస్తున్నాను. నేను రెండే ప్రశ్నలడుగుతాను. వాటికతడు తగిన సమాధానాలిస్తే,





అతడు బ్రహ్మవేత్తగా మనందరిచే ప్రశంసింపబడుతాడు. ఆ తర్వాత అతనిని ఇంకెవరూ జయించలేరు".

గార్గి పలికిన ఆ పలుకులకు అందరూ సంతోషపడ్డారు. అప్పుడామె యాజ్ఞవల్క్యునితో "కాశి, విదేహ నగరాలకు చెందిన వీరులు ధనువును ఎక్కుపెట్టి వాడియైన బాణాలతో శత్రువును ముప్పుతిప్పలు పెట్టినట్లు నా ప్రశ్నలతో మిమ్మల్ని ఎదుర్కొంటాను" అని ప్రతిజ్ఞ చేసింది.

యాజ్ఞవల్క్యుడు సరేనన్నాడు. గార్గి అడిగిన ప్రశ్నలు రెండు.

మొదటి ప్రశ్న : *ద్యులోకానికి పైన, భూలోకానికి క్రింద, మరియు ఆ రెండు లోకాలకు మధ్య ఉన్నదేది?*

సమాధానం : ఆకాశం.

రెండవ ప్రశ్న : *ఆ ఆకాశం ఎవనియందు ఓతప్రోతమై ఉంది?*

సమాధానం : ఆ ఆకాశం పరమాత్మయందు ఓతప్రోతమై ఉంది.

సమస్త విశ్వం పరమాత్మలోనే ఉందని, పరమాత్మ సర్వ వ్యాపకుడని యాజ్ఞవల్క్యుని మాటల సారాంశం. యాజ్ఞవల్క్యుని సమాధానాలకు గార్గి సంతృప్తి చెందింది. జనకుని సభలోని వారంతా హర్షధ్వానాలు చేశారు.

ఒకవ్యక్తి బ్రహ్మవేత్తో, కాదో పరీక్షించే అధికారం ఆ కాలంలో ఒక స్త్రీకి లభించిందంటే, స్త్రీ చైతన్యానికి ఇంతకంటె వేరే దృష్టాంతం అవసరం లేదు.

ఛాందోగ్యోపనిషత్తులోని సత్యకాముని కథను చదివినప్పుడు కూడా ఉపనిషత్ కాలం నాటి స్త్రీల యొక్క ధైర్యసాహసాలు ఎలాంటివో తెలుస్తాయి.

సత్యకామునికి తన తల్లి ఎవరో తెలుసు కాని, తండ్రి ఎవరో తెలియదు. అంత మాత్రాన అతడు కోల్పోయింది ఇసుమంత కూడా లేదు. కాని బ్రహ్మజ్ఞాని ఐన సత్యకాముని తల్లి ఒక పరిచారిక అని తెలిసినప్పుడు మనకు ఆశ్చర్యం కలుగుతుంది. చిత్ర మేమంటె ఆ తల్లికి సత్యకాముడు ఎవరి వల్ల జన్మించాడో కూడా తెలియదు. ఐనా తన కుమారుణ్ణి ఆమె ధైర్యంగా పెంచింది. ఉత్తమ గుణాలు కల్గిన వానిగా తీర్చి దిద్దింది. సత్యకాముడనే పేరు కూడా ఆమే పెట్టింది. సత్యకాముడంటే సత్యం పలకడంలో కోరిక గలవాడని అర్థం.

www.etelangana.org

ధనవంతుల ఇండ్లలో పరిచారికగా పనిచేసే ఒక స్త్రీ (జబాల) తనకు జన్మించిన బిడ్డను సత్య నిష్ఠాగరిష్ఠుణ్ణి చేయడం గొప్ప విషయం అనక తప్పదు. ప్రాణులపట్ల ప్రేమ; పెద్దల పట్ల గౌరవం; సత్యం, అహింసల పట్ల కోరిక గల సత్యకామునికి ఎనిమిదేళ్ల వయస్సు వచ్చింది. ప్రాచీనకాలంలో ఎనిమిదేళ్ల వయస్సు వచ్చిందంటే చాలు పిల్లలకు ఉపనయన సంస్కారం చేయవలసిందే. సత్యకాముడు తల్లి అనుమతిని పొంది మంచి ఆచార్యుణ్ణి వెదుకసాగాడు.

ఒకరోజు గౌతముడనే ఆచార్యుణ్ణి సమీపించి, నమస్కరించి, తనకు ఉపనయనం చేయమని అర్థించాడు. అందుకు స్పందించిన గౌతముడు "నీ గోత్రం ఏమిటి?" అని ప్రశ్నించాడు. గోత్రాన్ని తెలుసుకొని గురూపదేశం చేసే ఆచారం ఆ కాలంలో ఉంది. అందుకే గురువుగారా విధంగా అడిగారు.

వెంటనే సత్యకాముడు తన తల్లి దగ్గరికి వచ్చి "నా గోత్రమేమిటి" అని అడిగాడు. గోత్రం తండ్రి వల్ల ఏర్పడుతుంది. ఈ విషయం తెలిసిన ఆమె "నీవే గోత్రంవాడవో నాకు తెలియదు. నేను మాత్రం పరిచారికగా ఉన్నప్పుడు అజ్ఞానం చేత యవ్వనంలో నిన్ను కన్నాను. నీతండ్రి ఎవరో నాకు తెలియదు. కనుక నీవు జబాల పుత్రుడనని, సత్యకాముడనని మాత్రమే గురువుగారికి చెప్పు" అని కుమారునికి తెలియజేసింది.

సత్యకాముడు తిరిగి గౌతముని దగ్గరికి వచ్చి తల్లి చెప్పినట్లే చెప్పినాడు. గౌతముడు అతని సత్యనిష్ఠకు, వినయసంపదకు పరవశించి, ఉపనయన సంస్కారం చేసి వేదోపదేశం చేశాడు.

సత్యకాముడు తాను జబాల తనయుణ్ణి అని చెప్పుకోవడానికి ఎన్నడూ వెనుకంజవేయలేదంటే, ఆ తల్లి ఎంత గొప్పదో మనం అర్థం చేసుకోచ్చు. పరిచారిక అయినంత మాత్రాన స్త్రీకి చైతన్యం లేదనడం వట్టిమాట. జబాల తన జీవితంలో జరిగిన పొరపాటుకు జీవిత కాలమంతా కుమిలిపోలేదు. నిలదొక్కుకొని తన కుమారునికి మంచి విద్యాబుద్ధులు చెప్పి, పెంచి పెద్దవాణ్ణి చేసింది. సత్యకాముడు గురూపదేశాన్ని పొంది జ్ఞానులలో గొప్ప జ్ఞానిగా పేరు తెచ్చుకొన్నాడు. వేలాదిమంది శిష్యులకు అతడు గురువయ్యాడు.

సత్యకాముని చరిత్ర ఉపనిషత్తులకే అలంకారమైంది. అతని తల్లి జబాల అభినందించదగింది. స్త్రీ చైతన్యానికి ఉదాహరణగా నిలిచే ఇలాంటి కథలు ఉపనిషత్తులలో ఎన్నో ఉన్నాయి.



## 8. అన్నమయ్య - పోతులూరి వీరబ్రహ్మం

ప్రకృతిలోలాగా సమాజంలోనూ మార్పులు అనివార్యం. ప్రపంచ చరిత్ర పుటల్ని తిరగేస్తే ఎందరో మహానుభావులు కనిపిస్తారు. వారివల్ల సమాజంలో ఎన్నో మార్పులు జరిగాయి. ఇవన్నీ సంస్కరణల ఫలితాలే.

ఒక రాముడుగాని, ఒక కృష్ణుడుగాని, యుగాలను ప్రభావితం చేస్తే, మరికొందరు మహాపురుషులు జన్మించి సామాజికంగా మానవులకు ఉత్తేజాన్ని కల్గించారు. భారతదేశానికి సంబంధించినంత వరకు బుద్ధుడు, శంకరుడు, రామానుజుడు, మధ్వుడు, దయానందుడు సమాజంలోని రుగ్మతలకు ఆధ్యాత్మికంగా చికిత్స చేశారు. వీరి మధ్యన నిలవగలిగి తెలుగునాట సామాన్యుల్లోనూ భక్తి, సంస్కరణ బీజాలను నాటటానికి ప్రయత్నించి సఫలులైన మహానుభావులే తాళ్లపాక అన్నమయ్య, పోతులూరి వీరబ్రహ్మం గార్లు.

మతం అంటే అందని ద్రాక్షపండుగా కాక, అన్ని విధాలా జీవితానికి మార్గోపదేశం చేయగల్గిన ఒక తాత్విక చింతన అని నిరూపించిన వారు అన్నమయ్య - వీరబ్రహ్మం గార్లు.

మూఢనమ్మకాల ఊబిలో కూరుకొని పోయిన తెలుగు సమాజాన్ని భక్తి జ్ఞాన స్రోతస్వినులలో ఓలలాడించిన గౌరవం ఆ ఇద్దరిదే. ఇద్దరి కాలాలు కొంచెం వేరైనా ప్రజల్ని సమైక్య పరచడంలో వారి లక్ష్యం ఒక్కటే. ఇద్దరూ సామాన్య ప్రజలతో కలిసిపోయినవారే.

అన్నమయ్య 1408-1503 మధ్య కాలంలో జీవించాడు. వీరబ్రహ్మం 17వ శతాబ్దం లోని వాడు. అన్నమయ్య సుమారు ఎనభై ఏండ్లు జీవిస్తే, వీరబ్రహ్మంగారు ఇంకో ఐదేళ్లు ఎక్కువగానే జీవించాడు. అన్నమయ్యది విశిష్టాద్వైతం కాగా, వీరబ్రహ్మానిది అద్వైతం.

అన్నమయ్య వైష్ణవుడు. శ్రీవేంకటేశ్వరుని భక్తుడు. రోజుకొక కీర్తన చొప్పున ముప్పదిరెండు వేల కీర్తనలను రచించిన పదకవితా పితామహుడు. ఇవన్నీ రాగిరేకుల మీద చెక్కింపబడ్డాయి. గృహస్థుడుగా ఉండి ముక్తికై ప్రయత్నించిన మహాభక్తుడు. తాళ్ళపాక, తిరుపతి, అహోబలాల్లో నివసిస్తూ ఎన్నో కీర్తనలు



www.etelangana.org

రచించాడు. శఠగోపయతీంద్రుల దగ్గర వేదాంత శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు.

వీరబ్రహ్మం సిద్ధపురుషుడు. బ్రహ్మజ్ఞాని. కాలజ్ఞాన తత్వాలను రచించాడు. వీరబ్రహ్మం కూడా గృహస్థ జీవనంలో ఉండి ఆత్మజ్ఞానం చేత మోక్షం వైపు వెళ్లటానికి ప్రయత్నించాడు. అల్లాడు పల్లెలోని వీరభద్రస్వామియే వీరబ్రహ్మం గురువని తెలుస్తుంది. వీరబ్రహ్మంగారికి గురువెవరూ లేరనే వాదం కూడా ఉంది.

భక్తియోగంచేత కైవల్యాన్ని సాధించవచ్చునని అన్నమయ్య నిరూపిస్తే - వీరబ్రహ్మం రాజయోగం ద్వారా దాన్ని సాధించవచ్చునని తెలియజేశాడు. వీరబ్రహ్మం వడ్రంగం పని చేస్తూనే లభించిన దానితో జీవితం గడిపాడు. గుణ కర్మలను బట్టి ఎవరైనా తత్త్వవేత్త కావచ్చునని నిరూపించడమే గాక, మూఢ విశ్వాసాలకు తావులేని ఆచరణకు భక్తిని జోడించాడు. అన్నమయ్య తేట తెలుగులో సంకీర్తనలను రచించగా, వీరబ్రహ్మం కూడా అదే విధంగా కీర్తనలను, తత్వాలను రచించాడు. ఇద్దరూ ప్రజల భాషలో రాసి, ప్రజలకు దగ్గరివారయ్యారు.

కుల విద్వేషానికి తావులేని వైష్ణవతత్వాన్ని ప్రబోధించడం ద్వారా అన్నమయ్య ఏ విధంగా తన కాలంలో ప్రసిద్ధికెక్కాడో, అదే విధంగా వీరబ్రహ్మంగారు వేదసమ్మతమైన విషయాలను, ఉపనిషత్తులను వివరించడం ద్వారా తన కాలంలో సుప్రసిద్ధుడయ్యాడు. పద కర్తగా అన్నమయ్య విశిష్టమైన స్థానాన్ని సంపాదిస్తే సంస్కర్తగా వీరబ్రహ్మం పేరొందినాడు.

***"శ్రీ వేంకటగిరి చెలగిన నీవే ...***
***తావున మదిలో తగిలితివి "*** - తాళ్లపాక పదసాహిత్యము సం.-3 ఆధ్యాత్మ సంకీర్తనలు, కీ. 2) అని అన్నమయ్య అంటే -
***'నే జూచినానమ్మ నెలతరో తారకరాజ***
***యోగమునందు రాజిల్లు నా గురుని "*** - (కాలజ్ఞాన తత్త్వములు పు.4) అని వీరబ్రహ్మం అంటాడు.

అవతారవాద వైశిష్ట్యం తెలిసిన అన్నమయ్య
***"నరుడా యీతడు ఆదినారాయణుడు గాక***
***ధరణి కీరితి కెక్కె దశరథసుతుడు "*** అని ప్రస్తుతించగా





వీరబ్రహ్మం ***"నే జూచినానే బ్రహ్మము నాలోనే జూచినానే సద్గురు నాలో నే జూచినానే "*** అని నిరాకార పరబ్రహ్మకు కైమోడ్పులర్పిస్తాడు.

ఐతే - అన్నమయ్యకు నిర్గుణ పరతత్వం గురించి తెలియనిది కాదు. "నీవు దేవుడవు నేనొక జీవుడ" నన్న ఒక్క వాక్యం చాలు, దేవుడు జీవుని కంటే వేరైన వాడని చెప్పటానికి. ఇట్లే ఆయన ఒక చోట ఇలా అంటాడు.

***"తనువే గుడియట తలయే శిఖరమట***
***పెను హృదయమే హరిపీఠమట***
***కనుగొన్న చూపులే ఘనదీపములట***
***తనలోపలి అంతర్యామికిని పలుకే మంత్రమట"*** - నిరాకార పరబ్రహ్మనే అంతర్యామిగా చెప్పుకొంటాం.

పుట్టుకతో అద్వైతి అయిన అన్నమయ్య ***"అన్నియు నాలో నుండగ అవ్వలనేమి చూచేము?"*** అని 'అహం బ్రహ్మాస్మి' తత్వాన్ని ఆవిష్కరించాడు. ***"దేవుడొక్కడే గురి తెలిసిన వారికి! యీవలావల చూచినానిక లేదు తెఱుగు"*** అన్నప్పుడు సర్వం బ్రహ్మమయమేనన్న సిద్ధాంతం స్ఫురిస్తుంది. ***"బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే...."*** అన్నప్పుడు అన్నమయ్య హృదయాన్ని మనం అర్థం చేసుకోవచ్చు.

***"మనసు మనసున బెనగి మనసు యేకము జేసి మనసు మర్మముగన్న దెఱుక"*** అంటూ మనసు యొక్క మర్మాన్ని తెలుసుకోవడమే జ్ఞానమని తెలియజేశాడు వీరబ్రహ్మం. వీరబ్రహ్మం విగ్రహారాధనకు విముఖుడు. ఈ విషయంలో ఆయన స్పందన కఠినంగా ఉంటుంది.

"చిల్లర రాళ్లకు మ్రొక్కుచునుంటే చిత్తము చెడిపోనొరే యొరే! చిత్తమునందున చిన్మయ జ్యోతిని చూచుచునుండుట సరేసరే " అని జ్ఞాన స్వరూపుడైన పరమాత్మను కనుగొనుమని చెప్పడమే గాక, అదే సమయంలో ఉపవాసాలు చేయడాన్ని గర్హిస్తాడు.

***"ఒక్క పొద్దులని యెన్నుచునుంటే యొనరగ జెడుదువు ఒరే యొరే"***
***యేకమైన ఆ వైభవ మూర్తిని చూచుచునుండుట సరేసరే"*** అని .



www.etelangana.org

వైష్ణవదీక్ష తీసుకొన్నవారికి ముద్రాధారణం (రెండు భుజాలపై శంఖ చక్రాలను కాల్చి ముద్రించుకోవడం) పుండ్రం (పొడుగుబొట్టు), నామం (శ్రీనివాస దాసః, రామానుజ దాసః), మంత్రం 'ఓం నమోనారాయణాయ', యాగం (భగవదారాధన పద్ధతి) అనే పంచ సంస్కారాలు ప్రధానమైనవి. వైష్ణవులకు 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరి ఉపాసనా మంత్రం. ఐతే అన్నమయ్య ప్రజామోదాన్ని బహుళంగా పొందడానికి చెప్పిన మంత్రం 'వేంకటేశు మంత్రం'. నారదుడు – నారాయణ మంత్రాన్ని, ప్రహ్లాదుడు నారసింహ మంత్రాన్ని, విభీషణుడు రామ మంత్రాన్ని, ధ్రువుడు వాసుదేవ మంత్రాన్ని, శుకుడు విష్ణు మంత్రాన్ని పఠించగా తాను వేంకటేశు మంత్రాన్ని పఠిస్తున్నట్లు – అది వెన్నెల వంటిదని (4 సం. అధ్యాత్మ సంకీర్తనలు, కీ. 438) ప్రత్యేకించి చెప్పాడు.

సామాన్యులకు ఈ మంత్రాన్ని జపిస్తే ఈ లాభం కల్గుతుందని చెబితే వెంటనే నమ్మేస్తారు. వీరబ్రహ్మం కూడా ***"పంచాక్షరీ మంత్ర పఠన చేయరన్నా! పఠన చేసిన యముడు పారిపోవునన్నా"*** అని పంచాక్షరీ మంత్రాన్ని ప్రబోధించినప్పటికీ ప్రత్యేకించి ***"ఓం, హ్రీం, క్లీం, శ్రీం, శివాయ బ్రహ్మణేనమః"*** అనే ద్వాదశాక్షరీ మంత్రాన్ని కల్పించి, దాన్ని పన్నెండువేల సార్లు జపం చేస్తే మోక్షం లభిస్తుందని కాలజ్ఞానంలో రాశాడు.

అన్నమయ్య ముక్తికి ఆద్యంతాలు లేవంటాడు.

***"కోటి జన్మములు యెత్తిన ముక్తికి***
***కొన మొదలేమియు గనరాదు"*** – (సం. 3 కీ. – 446)

వీరబ్రహ్మంగారు –

***"చూపుల లోపల పాపల నడుమను***
***వెలిగేటి ఆ పరంజ్యోతిని చూచినానమ్మా"*** (కాల. త.పు. 4)

అని ముక్తి మార్గాన్ని సూచిస్తాడు. అంతే కాదు ***"కంటిమయ్యా కైవల్యము కన్నులయందు! వింటిమయ్యా ప్రణవనాదము వీనుల యందు"*** – అని తానవలంబించిన యోగ సాధన పరమార్థాన్ని వివరిస్తాడు.

అన్నమయ్యకు శ్రీవేంకటేశుడే గురువూ, దైవమూ. కాని వీరబ్రహ్మం





మానవులకు ముక్తి మార్గాన్ని చూపించాలంటే గురువు తప్పనిసరి అవసరమని తెలిపినాడు.

***" ఈ జన్మమిక దుర్లభమురా –***
***ఓరి!సాజన్మ సాకార సద్గురుని గనరా"***
***"గురువుని చేరి మ్రొక్కితే బ్రతుక నేర్చేరు"*** – అని కూడా జీవితంలో మానవునికి గురువుతో గల అవసరాన్ని నిర్దేశించాడు.

వైష్ణవ సంప్రదాయంలో దాసభక్తి, శరణాగతి భక్తి ముఖ్యమైనవి. ***"మారు దైవములు లేరు మరి నన్ను గావ । నిన్ను పేరుకొని శరణంటి । ఎడబాపుమాయ"*** అని అన్నమయ్య తన శరణాగతి భక్తిని ప్రకటించాడు. వీరబ్రహ్మంగారు మాత్రం పతంజలి అష్టాంగ యోగాన్ని దృష్టిలో పెట్టుకొని ఆత్మతత్వాన్ని తెలుసుకొనే మార్గాన్ని ఉపదేశించాడు.

***"చందమామ చందమామ చందమామ***
***ఈ సంధి తెలిపె జ్ఞానులెవరె చందమామ***
***కాయమను పుట్టలోన చందమామ***
***పాము మాయగానె మెలగుచుండు చందమామ***
***రామయను కట్టు కట్టె చందమామ***
***పామును ముక్తిచేసి పట్టవలెను చందమామ***
***పామును పట్టే యోగి యెవరు చందమామ***
***ఓహో! అతని పేరు సిద్ధగురుడు చందమామ"*** (కాల జ్ఞాన తత్వములు పు.31)

అన్నమయ్య వైష్ణవం – కుల బేధాలకు తావిచ్చింది కాదు.

***"ఏకులజుడేమి యెవ్వడైన నేమి***
***ఆకడ నాతడె హరినెరిగినవాడు "*** (అధ్యాత్మ సంకీర్తనలు సం.1. కీ. 292)

వీరబ్రహ్మంగారు కేవలం ప్రబోధించిన వాడే కాక ఆచరణలో చూపించిన కర్మయోగి. మహ్మదీయుడైన సిద్ధప్పను, అట్టడుగు కులంలో జన్మించాడని చెప్పబడే కక్కయ్యను శిష్యులుగా చేసుకొని కులమత వైషమ్యాలకు తావులేని సమ సమాజాన్ని నిర్మించటానికి పూనుకొన్నాడు.



www.etelangana.org

అన్నమయ్యగారి ***"బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే"*** అనే కీర్తనలో ***"నిండారరాజు నిద్రించు నిద్రయునొకటే, అండనే బంటు నిద్రదియునొకటే! మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే! చండాలుడుండేటి సరిభూమి యొకటే"*** అనే పంక్తులు గమనించినప్పుడు ఇంచుమించుగా అతడు వీరబ్రహ్మంగారి లాగానే తన తత్త్వాలను సామాన్య జనంలోకి తీసుకొని వెళ్లి, వారిలో మార్పు తేవటానికి యత్నించినట్లు కనిపిస్తుంది.

వీరబ్రహ్మం వైదిక పద్ధతిలో ఓంకార నాదాన్నే కాదు, సామాజిక సమరసతా నినాదాన్ని కూడా వినిపించాడు. ఎంతోమంది గృహస్థులను శిష్యులుగా, ప్రశిష్యులుగా చేసుకొన్నాడు. వేద విద్యను, ఉపనిషత్ సారాన్ని సామాన్య జనానికి, ముఖ్యంగా స్త్రీలకు చేరువుగా తెచ్చాడు.

భక్తి జ్ఞాన వైరాగ్యాలలో అన్నమయ్య, వీరబ్రహ్మం గార్లకు ఎన్నో పోలికలున్నాయి. ***"ఇది కల్లయనరాదు యిది నిశ్చయింపరాదు । పదిలాన గొలువగా ప్రత్యక్షయమ్యేవు"*** అని ప్రపంచ స్థితిని వచిస్తూ వేంకటేశ్వరుణ్ణే శరణువేడిన అన్నమయ్యను ప్రజలు ఎంతగా ఆదరించారో, ***"వచ్చినాడు వీరబ్రహ్మము ఓహో జనులారా! మీరు చింతలు మాని గురుని కోరుకొనరయ్యా"*** అని గురువుకున్న ప్రాశస్త్యాన్ని చాటిన వీరబ్రహ్మసద్గురువును కూడా అంతే ఆదరించారు. వీరిద్దరికీ సంబంధించిన మహిమలు కూడా ప్రచారంలో ఉన్నాయి.

సాళువగుండ నరసింహరాయుని చేత చెరసాలలో ఉంచబడిన అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుణ్ణి స్తుతించి బంధ విముక్తుడైనట్లు ప్రచారంలో ఉన్నట్లే - వీరబ్రహ్మంగారు పోలేరమ్మతో నిప్పు తెప్పించడం, కక్కయ్య భార్యను రక్షించడం మొదలైన సంఘటనలు మహిమలుగా ప్రచారంలో ఉన్నాయి.

ఈ మహిమలను ప్రక్కనబెడితే, ఇద్దరి సంకీర్తనలు సామాన్యుల గుండెల్లో ఈనాటికీ వినిపిస్తూనే ఉన్నాయి. తెలుగు సాహిత్య చరిత్రలో ప్రజామోదం పొందిన తత్త్వ కవులుగా ఇద్దరూ వెలుగుతూనే ఉంటారు.



# 9. క్షేత్రయ్యపదాలలో శృంగారనాయికలు

అన్నమయ్య తన పదాలలో శృంగారాన్ని వర్ణించినప్పటికీ భక్తిదే ప్రథమ తాంబూలం. కాని క్షేత్రయ్య పదాలలో అడుగడుగునా శృంగారమే అనుభవానికి వస్తుంది. ఆయనది మధురభక్తి.

ఆనందానుభూతిని కల్గించే పదాలను పండితులు ఆధ్యాత్మ పదాలని, శృంగార పదాలని రెండు విధాలుగా వింగడించారు. అన్నమయ్య మొదటి విభాగానికి చెందితే, క్షేత్రయ్య రెండవదానికి చెందుతాడు.

క్షేత్రయ్య పదాలలో గేయాంశతోపాటు అభినయాంశ ఎక్కువ. కేవలం చదువుతుంటేనే ఆడుతున్నట్లుంటాయి ఆయన పదాలు. మరి పాడుతూ అభినయిస్తే ఆనందాబ్ధిలో ఓలలాడవలసిందే. రసానందమే ప్రధానమైందని చెప్పవలసి వచ్చినప్పుడు అన్నమయ్య తర్వాత క్షేత్రయ్య పదాలకే ఆ గౌరవం లభిస్తుంది.

ఆధ్యాత్మ కీర్తనలు సామాన్యులకంతగా పట్టవు. అవే శృంగార పదాలైతే వారి హృదయాలను వెంటనే ఆకర్షిస్తాయి. బహుశా ఈ దృష్టితోనే క్షేత్రయ్య శృంగార పదాలవైపు మొగ్గాడు.

ఈ పదాలలో క్షేత్రయ్య పరమాత్మ గుణగణాలను కేవలం ప్రస్తుతించే ఒక భక్తునిగా కాక, ఆ పరమాత్మను నాయకునిగా చేసుకొని తాను స్వయంగా నాయికగా మారిపోవడం విశేషం.

నాయకుడు మువ్వగోపాలుడు. నాయిక క్షేత్రయ్య. నాయకునితో నాయిక అయోగ, విప్రయోగావస్థలను అనుభవిస్తూ, అతని సాన్నిధ్యసాహచర్యాలను ఆకాంక్షిస్తూ, ఏకాంతంలో సాయుజ్యాన్ని కోరుకోవడం, ఇంకా దర్శనస్పర్శ నాలింగనాది సౌఖ్యాలతోపాటు, ఎడబాటు చేత దుఃఖాన్ని అనుభవించడం క్షేత్రయ్య పదాలలో కనిపిస్తుంది.

అలంకార శాస్త్రాన్ని బట్టి శృంగార నాయికలు ఎనిమిది మంది.

1. స్వాధీనపతిక 2. వాసక సజ్జిక 3. విరహోత్కంఠిత 4. విప్రలబ్ధ
5. ఖండిత 6. కలహాంతరిత 7. ప్రోషితభర్తృక 8. అభిసారిక



www.etelangana.org

క్షేత్రయ్య పదాలలో విప్రలంభ శృంగారమే వర్ణింపబడింది. నాయికా నాయకులు వివిధ భావపరంపరలను వశం చేసుకోవడానికి మంచి అవకాశం ఇస్తుంది విప్రలంభ శృంగారం. దీన్ని ఎంత వర్ణించినా అశ్లీలం దొర్లదు. కనుకనే క్షేత్రయ్య పదాలు నిసర్గ రమణీయ శృంగార పదాలుగా సాహిత్యచరిత్రలో వన్నెకెక్కాయి.

అష్టవిధ శృంగార నాయికలకు క్షేత్రయ్య పదాలు పరమ లక్ష్యాలు.

**1. స్వాధీనపతిక:**

తనయందే అనురక్తుడైన పతి గలది స్వాధీనపతిక. క్షేత్రయ్య దృష్టిలో మువ్వగోపాలుడు పరమాత్మకు, నాయిక జీవాత్మకు సంకేతాలు. పరమాత్మను వశంలో ఉంచుకొన్న తనకు అడ్డుగా ప్రకృతి స్త్రీ మూర్తియై వచ్చిందట. ఈ ప్రకృతినే మాయ అని పిలుస్తాము. జీవాత్మ పరమాత్మలను వేరు చేసేది ప్రకృతే. నిజానికి జీవాత్మ, పరమాత్ములు అనాదిగా కలిసే ఉంటారు. "ద్వాసుపర్ణాసయుజాసఖాయా" అని వేదం చెబుతుంది.

"ఇద్దరి సందున పవ్వళించియున్న యింతి పేరేమిరా?" అనే పదం నాయికా నాయకుల పూర్వానుబంధాన్ని అపూర్వంగా చిత్రిస్తుంది.

ఇట్లే మరొక పదం,

*"మొక్కదగిన వాని, ముద్దు మాటలవాని*
*మువ్వగోపాల స్వామిని ఎవ్వరైనా గాని"* అని కొనసాగుతుంది.

ఓర్వనివారు నా నాయకుణ్ణి సరసుడు గాడని అనుకుంటే అనుకునేరు. నేను మాత్రం పట్టించుకోను. నాకు నాయకుడు మాత్రం స్వాధీనుడేనని నాయిక చెలికత్తెతో పలికిన పలుకులు ఉదాత్తమైనవి.

**2. వాసక సజ్జిక:**

భర్త వచ్చే సమయానికి తననూ, తన గృహాన్ని అలంకరించుకునేది వాసక సజ్జిక.

ప. *ఇంత ప్రొద్దాయెనిక వాడేమి వచ్చునే*
*ఏ యింతిని గూడియున్నాడో*





అ.ప. *చింతింప పని లేదు - చెలియా! మువ్వగోపాలుడు*

చ. *చేరి నాతో నేస్తము - చేసిన పాపమా*
*కీరవాణిరో! ఏలవేగించేవే నీవు!*
*నూరిన గంధకస్తూరి - పారవేసి పవ్వళించు*
*ఏ రమణియింటనున్నాడో - యూరెల్ల మాటు మణిగె.*

చ. *భాసురాంగిరో! వినవో - పక్షులు మొదలుగాను*
*వాసములు జేరి తమ - వనితల గూడెనె*
*ఆశించిన ఫలించే - దరుదుగాదటవే - నే*
*జేసిన పాపమెవ్వరు - జేసినారే చెలియ*

చ. *పమ్మిన వేడుకలతోను - పడకటిల్లు శృంగారించి*
*యెమ్మెకాడు వచ్చునని - యెదురుచూచితి*
*సొమ్ములేలే! విరులేలె? సొగసెవ్వరు చూచెదరే*
*కొమ్మా! నన్నేలిన మువ్వగోపాలుని నమ్మరాదే"*

*ఇదెంతో మనోజ్ఞమైన పదం.*

మువ్వగోపాలుని కోసం సిద్ధం చేసిన గంధాన్ని, కస్తూరిని పారెయ్యమంటుంది నాయిక. పక్షులు కూడా సుఖించే సమయంలో పతి రాకపోతే సతికెంత బాధ? ఆశించిన ఫలం అందరికి దక్కదు. పడకటింటిని ఎంత సుందరంగా అలంకరించు కున్నా లాభం లేదని, మేనధరించిన సొమ్ములను, పూలను తీసిపారేయడానికి సిద్ధపడిన నాయిక నిజంగా వాసక సజ్జికే.

**3. విరహోత్కంఠిత :**

భర్త చెప్పిన సమయానికి రానప్పుడు విరహంలో మునిగిపోయేది విరహోత్కంఠిత.

*"మరచెనేమో చెలియ - మాయలో తగిలి*
*పరమాత్మ మువ్వగో - పాలుడిందు రాడాయె"*

ఏదో మాయలో పడిపోవడం వల్లనే మువ్వగోపాలుడు రాలేదని బాధపడ్డ నాయిక, నాయకుడంతకు ముందు తనకిచ్చిన చిలుక తాళిని మాత్రం మరిచిపోలేదు.



www.etelangana.org

*"మొలకప్రాయమున - మోహమునను గూడి*

*చిలుక తాళిచ్చినది - చిత్రాన లేద?"*

నాయిక నాయకుణ్ణి స్మరించి విరహాన్ని అనుభవించింది. ఆమె అతనితో కలిసి అనుభవించిన సుఖాన్ని కూడా నెమరేసుకుంది.

*"అలిగిన నేనొక వేళ - ఆవలిమోమైనప్పుడే*

*చెలియరో కౌగిటను - చేర్చుకొనె చాల!"*

పూర్వస్మృతులు గుర్తుకు వస్తే దుఃఖం రాకుండా ఉంటుందా?

మరొక పదంలో "చందమామ యీరేయి - చల్లనుండడే దైవమా?" అని వాపోతుంది. ఇంకొక పదంలో "దయ గోరంతైనా లేదాయే" "బతిమాలినా రాడాయె" అని విరహంలో మునిగిపోతుంది.

**4. విప్రలబ్ధ :**

సంకేత స్థలంలో ప్రియుడు కనిపించకపోగా దుఃఖించేది విప్రలబ్ధ.

ఏకాంతంలో పతికౌగిట్లో సుఖించాలనుకున్న నాయిక ఆశ అత్యాశే అయింది. నాయకుని కరస్పర్శచే పునీతమవుదామనుకుంటే అతడు కనిపించకుండాపోయాడు. నాయిక అంటుంది -

*"భామా! మా మువ్వగోపాలు కౌగిటలేని*

*ఈ మేను జీవునకు ఎంత ప్రియమాయెన్"* అని

ఈ శరీరం ద్వారా జరిగే కర్మలు జీవునికి సుఖమో, దుఃఖమో కల్గిస్తాయి. కాని ఈ శరీరం భగవదర్పితమైతే ఇంక కావలసిందేముంది. ఈ శరీరంలో ఉండగానే కైవల్యాన్ని పొందే అర్హతను సంపాదించుకోవాలి. కాని అందుకు విరుద్ధంగా స్వామి సేవకు అర్పింపబడని దేహం మీద కోరిక ఉన్నా ప్రయోజనం లేదనే విషయాన్ని ప్రబోధిస్తున్నది ఈ పదం.

*"ఇంతిరో విభుసేమమీ వరకు విననైతి*

*ఎంత వ్రాత వ్రాసి యున్నదో"*

అని పలికిన పలుకుల్లో కర్మఫలం అనుభవించక తప్పదనే విషయం తేటతెల్లమవుతుంది.





విరహంతో బాధపడుతున్న తన దగ్గరికి నాయకుడు వస్తే చెలులేమైనా అతనికి చెప్పి పొమ్మంటారేమోనని నాయిక అనుమానం. కనుకనే ఆమె "వన్నెకాడిందురాగానే - వద్దనేరమ్మా" అని చెలికత్తెల్ని ప్రాధేయపడుతుంది.

**5. ఖండిత :**

భర్త రాత్రి పరస్త్రీతో గడిపి ఉదయాన ఇంటికి రాగానే బాధపడేది ఖండిత.

నాయిక నాయకుని తప్పులను చెలికత్తెలకుచెప్పి, అతడిలా ఎందుకు చేశాడో అడిగండని వారిని పురికొల్పే సన్నివేశం గల పదాన్ని గమనించండి.

ప. *'అడగరమ్మా!, అతనిపై ఊరక - అలిగినానటరే'*

అ.ప. *'పడుచుతనము మాని మువ్వగోపాలరాయని ఆనబెట్టి మీరు'*

చ. *'పూనిదానింటికి పోగానే మా - పొలతిజూచి బెదిరించితే దానికి లంచమిచ్చెదనన్నది తానో? నేనో?'*

ఈ పంక్తులను చదువుతుంటే ముక్కు తిమ్మనగారి పారిజాతాపహరణం గుర్తుకు వస్తుంది.

ఇంత బాధలో ఉన్నప్పటికీ మువ్వగోపాలుడంటే తనకెంత ప్రేమో నాయిక ప్రకటించుకోవడం విశేషం. "వానిపై లేనివి కల్పింపరాదు" అంటుంది. పారిజాతాపహరణంలో సత్యభామ కృష్ణున్ని నిందిస్తుంది. కాని ఇందులో నాయిక మువ్వగోపాలుణ్ణి వెనకేసుకొస్తుంది.

ఇంకా "నిలిచి వీధిలో నన్ను జూచి - తలుపు మూలదాగియున్నది" అని నాయిక పర స్త్రీని తప్పు బట్టిందేగాని గోపాలునిపై తన భక్తినేమాత్రం చెక్కుచెదరనీయలేదు.

దీనికి మరొక పదాన్ని కూడా లక్ష్యంగా చూపవచ్చు.

చ. *'నిన్నెవ్వతోగల్గి - యున్న యురముజూచి*
*నన్ను వేదన చేయుచున్నది గదరా*
*నిన్న రాతిరి నీకు నిదురలేకున్న నా*
*కన్ను లెర్రగా - గలిగెను గదరా!'*

రాత్రి ప్రియుడు పరస్త్రీతో గడపడం వల్ల అతనికి నిదురలేదు సరికదా -



www.etelangana.org

అతని కోసం ఎదురుచూడడం వల్ల కళ్లు కాయలుగాచి తనకు నిదుర లేకుండా పోయింది. ఇక కళ్లెర్రగా మారడానికి కారణం ఒకటి నిద్రలేమి కావచ్చు. మరొకటి కోపం కూడా కావచ్చు. ఏమైనా తన పతి వక్షస్థలం మీది గోటిగాటుకు తల్లడిల్లిపోయిన నాయిక నిజంగా ఖండితే.

నాయికానాయకుల అభేదాన్ని చెప్పడానికి పదకర్త ప్రయత్నించాడీ పదంలో.

**6. కలహాంతరిత :**

భర్తను కోపంతో వెళ్లగొట్టి అతడు వెళ్లిపోయిన తర్వాత బాధపడేది కలహాంతరిత.

***“ఆశతో నే కౌగిలించుకోబోతే – అక్కడుండుమనెను***
***ఈసులేక మోవితేనె లీరా! అంటే – ఎంగిలయ్యేననెను”***

అక్కడుండమంటే ఎక్కడో అనికాదు తనకు దూరంగా ఉండమని అర్థం. అనురాగం ఉన్నప్పుడు ఎంగిలికాని మోవి, కోపం రాగానే ఎంగిలైపోతుందనడంలో వక్రోక్తి అనే అలంకారం ఉంది.

భర్తను వెళ్ల గొట్టింది తానే కనుక,

***“నా కోపమే నన్నింత చేసెనమ్మా”***

అని పశ్చాత్తాపాన్ని పొందిన నాయిక “ఈ నేరములు గాచి యిప్పుడింటికి రమ్మనవే” అని చెలికత్తెను వేడుకుంటుంది.

***“ఏ డాయెనొక్క నిముషం”***

అని అనడంలో విరహం భరింప శక్యం కానిదన్న విషయం స్పష్టమౌతుంది.

***“నిలుపరాని మోహ మాయె నీ వైన తోడితేవె”***

అన్న మాటల్లో నూటికి నూరు శాతం ప్రేమ,అనురాగం నిక్షిప్తమై ఉన్నాయి.

ఈ పదాన్ని విన్నప్పుడు ***“తన కోపమె తన శత్రువు”*** అన్న సుమతీ శతకకారుని పద్యం గుర్తుకు వస్తుంది.

**7. ప్రోషిత భర్తృక :**

భర్త పరదేశానికి వెళ్లినప్పుడు కృశించిపోయేది ప్రోషితభర్తృక.





ప. ***తాళరాదమ్మా! ఓ యమ్మా!***

అ.ప. ***తాళరాదుగదమ్మ తరుణి నా సామిని బాసి***

చ. ***వన్నె చిగురు పగడమువంటి – వాని పాదము***
***లెన్నడు కన్నుల కత్తు కొందునో!***

చ. ***మురుపైన వాని ముద్దు మోము కన్నుల జూడగ***
***పరితాపమెల్ల తీరు మరుబారిచేతను!***

వట్టి పగడం కాదు, చిగురు పగడం! ఎంత చక్కని దేశీయ పదప్రయోగం. చిగురుపగడం లాంటి మువ్వగోపాలుని పాదాల మీద నాయికకు ఎంత భక్తి! ఆ పాదాలను ఒక్క నిముషం చూడకపోతే తాళలేదు కనుకనే నాయకుడు ఎప్పుడు వస్తాడా? అతని పాదాలను ఎప్పుడు ముద్దు పెట్టు కుంటానా అని ఎదురుచూసింది.

కాని వెంటనే వస్తానని కాంతుడు చెప్పిన మాటలను ఆమె మళ్లీ మళ్లీ స్మరించుకుంటుంది.

**“ఏమని తెలుపుదు – నెలాగు తాళుదు – నేమి చేతునే”**

అన్న పదం ఒక మంచి సన్ని వేశాన్ని మనముందుంచుతుంది. నాయకుడు దేశాంతరం పోతాననగానే నాయిక బిక్క మొగం వేసింది. నాయకుడామెను “కన్నీరు నింపకు” అని ధైర్యం చెప్పాడు. కాని ఆమెకు కన్నీరాగలేదు. అతడు చేతితో కన్నీటిని తుడిచాడు.

ఈ సంఘటన మళ్లీ మళ్లీ గుర్తుకు వచ్చి నాయికను ఎంతో కృశింపజేసింది.

**8. అభిసారిక:**

భర్త దగ్గరికి స్వయంగా వెళ్లేది, లేదా అతణ్ణే తన దగ్గరికి రప్పించుకునేది అభిసారిక.

ప. ***రేపు వత్తువుగానివోర నేటికి తాళి – రేపు వత్తువు గాని***

అ.ప. ***రాపు చేయుట మేలా?***

చ. ***రాతిరి పగలొక్క తీరు నిన్ను రమ్మంటే మా యింటి వారు***
***మూతులు త్రిప్పేరు మొన్న వచ్చితివని***



www.etelangana.org

***వాదేల తడవాయె - వద్దు నేటికి తాళి***

చ. ***మరునాడె నను గూడితివి నన్ను - మరుకేళి గెలిచి మెప్పించితివి***
***మరియాద గలిగిన దొర బిడ్డవైతె***
***తెరచి చూడర తలుపు - తెల్లవారె తూరుపు***
***కోపగించి పోయేవు కొన్ని నాళ్లయ్యె నీవు***
***తాపమణచలేరా? దయతో కలిసిపోరా***

ఇందులో నాయిక నాయకుణ్ణి స్వయంగా తన దగ్గరికి రప్పించుకున్న విధానాన్ని గమనించవచ్చు. ఐతే ఒకసారి రప్పించుకుంటే ఎవరూ ఏమనరు. రాత్రింబవళ్లు ఒకే తీరుగా రమ్మంటే ఎవరికైన ఇబ్బందే. మూతులు తిప్పేరు అనే ప్రయోగంలో ఎంతో అర్థముంది. ఇది చక్కని జాతీయం.

మువ్వగోపాలున్ని తన దగ్గరికి రప్పించుకున్న నాయిక - తెల్లవారు తుందనగా ఇతరులెవరూ చూడకుండా వెళ్లిపొమ్మంటుంది. అలా చేస్తే మర్యాదగా ఉంటుందని ఆమె ఆలోచన.

అలంకార శాస్త్రంలో చెప్పబడిన అష్టవిధ శృంగార నాయికలకు లక్ష్యభూతమైన పదాలను క్షేత్రయ్యలో గుర్తించవచ్చు. ఆయన ఎంత శృంగారియో అంత వేదాంతి. పైకి శృంగారాత్మకాలుగా గోచరించే ఆయన పదాలు,తరచి చూస్తే అంతర్గతంగా ఎన్నో ఆధ్యాత్మిక భావనలకు ఆలవాలమైనట్లు కనిపిస్తాయి. ఐతే ఇప్పటికి మాత్రం ఆయన పదాల్లో కొలువు దీరిన శృంగారనాయికలను మాత్రమే మీ ముందుంచాను.

- తెలుగు వాగ్గేయకారులు, 2006, పుటలు 144-151.



# 10. తెలుగులో చాటుకవిత్వం

అందం, ఆహ్లాదం కవిత్వానికి అవసరమైన లక్షణాలనుకున్నప్పుడు, ఆ రెండు లక్షణాలను ప్రత్యేకంగా కల్గింది చాటువే. చాటుకవిత్వం ఆశు, కావ్య, గాథా కవితా ప్రక్రియల త్రివేణీ సంగమం.

మహాకావ్య రచనకు ప్రయత్నించినప్పుడు కొన్ని ఔచిత్యాలకు, కొన్ని పరిమితులకు లోబడక తప్పదు. కాని కథ, వర్ణన, పాత్రచిత్రణ మొదలైన సంకెళ్ళు లేనిది చాటువే. జన్మాంతర సంస్కారం వల్ల లభించిన ప్రతిభచే ఆవిర్భవించిందే చాటువు. చాటువు మెఱుపులాంటిదే కావచ్చుగాని, ఆ మెఱుపు మరుపుకురాదు.

'చాటు' శబ్దం సంస్కృతం. తెలుగులో అది 'చాటువు' అయింది. చాటువంటే ప్రియమైన మాట అని అర్థం. చాటువులు ముక్తకాలు. చమత్కారపూరితాలు. అంతేకాదు చరిత్రకూ, సంస్కృతికీ, మంచికీ, చెడ్డకూ దర్పణాలు. చాటూక్తి, కవితోక్తి రెండూ ఇంచుమించు ఒక్కటే. మోనియర్ విలియమ్స్ తన సంస్కృతాంగ్ల నిఘంటువులో 'చాటువు' అనే పదానికి Pleasing or grace ful words, Discourse, Flattory, speaking distinctly, speaking agreeably అనే అర్థాలు ఇచ్చాడు.

వినోదానికే కాక, విజ్ఞానానికి ఉపయోగపడే ఈ చాటువులను వేటూరి ప్రభాకర శాస్త్రి గారు 'చాటు పద్య మణిమంజరి' పేరుతో మొదటి భాగాన్ని 1914లో, రెండవ భాగాన్ని 1922లో ప్రచురించారు. వేటూరిని ఆదర్శంగా తీసికొని దీపాల పిచ్చయ్యశాస్త్రి గారు 1917లో 'చాటు పద్య రత్నాకరం' వెలువరించారు. ఆ తర్వాత శ్రీరంగాచార్యులు 1978 లో 'చాటు పద్యరత్నావళి' ని, రవ్వాశ్రీహరి గారు 1983లో 'అలబ్ధ కావ్య ముక్తావళి' ని ప్రకటించారు.

సామాజిక, సాహిత్య, రాజకీయ చరిత్ర రచనలకు దోహదం చేసే తెలుగు చాటువుల అందచందాలను గూర్చి దిఙ్మాత్రంగా తెలియజేయడమే నా ఉద్దేశం.

సంస్కృతంలో రామాయణం ఆదికావ్యంగా అవతరించటానికి కారణ భూతమైన 'మానిషాద ప్రతిష్ఠాం' అనే శ్లోకం చాటువే. అట్లే తెలుగులో పోతన పలికిన 'పలికెడిది భాగవతమట' అన్న పద్యం కూడా చాటువే.



www.etelangana.org

అక్షరమే లోకాన్ని రక్షిస్తుందని చెప్పబడిన చాటువొకటి నేటికీ అక్షరంగానే ఉంది. కర్త ఎవరో తెలియదు.

*"అక్షరంబు వలయు కుక్షిజీవనలకు*
*నక్షరంబు జిహ్వాకిక్షురసము*
*అక్షరంబు తన్ను రక్షించుగావున*
*నక్షరంబు లోక రక్షితంబు"*

పద్యాలెన్ని ఉన్నా వాటిలో చాటుపద్యానికున్న విలువ ఎంతో గొప్పది. వేమన పద్యం ఈ విషయాన్ని స్పష్టపరుస్తుంది.

*"నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు*
*తళుకు బెళుకు రాళ్ళు తట్టెదేల*
*చాటు పద్యమొకటి చాలదా యిలలోన*
*విశ్వదాభిరామ వినురవేమ!"*

చాటు పద్యాలలో ఛందోభంగాలు, యతి నియమాల అతిక్రమణ, వ్యాకరణ దోషాలున్నప్పటికీ ముఖ్యంగా కావలసింది సందర్భశుద్ధి అని ఆరుద్రగారు చెప్పిన మాటలు గమనింపదగ్గవి.

*"పదినీతులు పదిబూతులు*
*పదిశృంగారములుగల్గు పద్యములు సభన్*
*చదివినవాడే అధికుడు*
*గదరప్పా కుందవరపు కవి చౌడప్పా!"*

ఇది నిజానికి కవి చౌడప్ప చెప్పిన పద్యం. అది ఇచ్చే సందేశానికంటే చెప్పిన సందర్భానికే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని చెప్పవచ్చు. రాజులు భోగలాలసులు అయినట్లైతే సభలు కూడా సభ్యతకు దూరమౌతాయి. బహుశా అలాంటి సభల నుద్దేశించి చెప్పిన పద్యంగా దీన్ని భావించవచ్చు. నా దృష్టిలో ఈ పద్యం చాటువే. బాగా ఆలోచిస్తే శతక కవులు చెప్పిన పద్యాలు ఇలాంటి సందర్భాలకు చక్కగా సరిపోవడం విశేషం.

కవి అనుభవంలోంచి పుట్టుకొచ్చిన చాటువు చిరకాలం ఉంటుంది. మన అనుభవానికి కూడా దగ్గరగా ఉంటుంది. ఉదాహరణకు ఒక మిత్రునికి వందల





పర్యాయాలు సహాయం చేసి ఒక్కసారి మిన్నకుంటే ఆ మిత్రుడు మనం చేసిన సహాయాన్ని మరిచి మనల్నే తూలనాడడం కద్దు. చూడండి, ఇట్టి లోకానుభవాన్ని ఈ క్రింది చాటువెంత గొప్పగా చాటుతుందో!

*"పదివేల మందికిచ్చియు*
*తుదకొక్కని కీయకున్న దొరకవు కీర్తుల్*
*పదివేలు నోమునోచిన*
*వదలదె యొక అంకు వంక వన్నియ సుంకా"*

ఎవరో ఒక రాజు ఆడిన మాట తప్పి ఎంతో బాధ కల్గించగా, ఆవేదనకు గురైన కవినోట వచ్చిన ఈ చాటువు తీక్షణంగా ఉన్నప్పటికీ, దానికెంతో సందర్భ శుద్ధి ఉంది. ఈ క్రింది చాటువిప్పుడు లోకంలో ఎంతో ప్రచారంలో ఉంది. చాటువులు ప్రచారంలో ఉండటం వాటి విశిష్టతకు నిదర్శనం.

*"ఆడిన మాటలు దప్పిన*
*గాడిద కొడుకంచు తిట్టగా విని యయ్యో!*
*వీడా నా కొక కొడుకని*
*గాడిద యేడ్చెంగదన్న ఘనసంపన్నా!"*

'ఘనసంపన్నా'! అన్న సంబోధనలో వ్యంగ్యముంది. ఆరాజు సంపన్నుడేకాని మాట తప్పినాడు. మాట తప్పినావని సూటిగా అనక, గాడిద మీద పెట్టి చాటువు చెప్పడం కవికే చెల్లింది.

చాటువులు ఒక కాలంలో చెప్పబడినా,అవి అన్ని కాలాలకు వర్తించడం విశేషం.

'గువ్వల చెన్నా' మకుటంతో ఉన్న ఈ క్రింది చాటువును గమనించండి.

*"వెలివిద్యలెన్ని యైనను*
*కులవిద్యకు సాటిరావు కుంభిని లోనన్*
*వెలకాంత లెందఱున్నను*
*కులకాంతకు సాటిరారు గువ్వలచెన్నా"*

పరంపరాగతమైన వృత్తి విద్యకు, దాంపత్య జీవనానికి ప్రాధాన్యం ఇస్తున్న చాటువిది.



www.etelangana.org

డబ్బున్న లోభికన్న వితరణ శీలియైన పేద మేలట. సముద్రంకంటే చలిచెలమ మేలుకదా అంటాడు చాటుకవి.

*"కలిమిగల లోభికన్నను*
*విలసితముగ పేద మేలు వితరణియైనన్*
*చలిచెలమ మేలుకాదా*
*కులనిధి యంబోధికన్న గువ్వల చెన్నా!"*

కవులు అన్ని దేశాలు తిరిగేవారు. కాని, వేరే ప్రాంతంలో వారి కన్నింటికీ కటకటే. తంజావూరు కవులకు ప్రసిద్ధి. అక్కడే చాలామంది కవులున్నారని తెలియక తెలుగు ప్రాంతం నుండి వెళ్ళిన కవులున్నారు. వారిని చూసి ఒక తెలుగు కవి చెప్పిన చాటువు.

*"పురముననుండే కవులే*
*చొరఁబడి తినఁ గూడులేక చుంబించంగా*
*పరకవు లేటికి వచ్చిరి*
*తలమెఱుగక యరికివిరికి తంజాపురికిన్"*

చాటువులు ఎంత శృంగారాత్మకాలో అంత భక్తి ప్రాధాన్యం గలవి. ఇప్పటికీ వయసు మళ్ళిన వారి నాల్కల మీద నాట్యం చేసే ఈ కింది పద్యం ఏ కవి నోట వచ్చిందో చెప్పలేము.

*"చేత వెన్న ముద్ద చెంగల్వపూదండ*
*బంగరు మొలత్రాడు పట్టుదట్టి*
*సందె తాయెతులును సరిమువ్వగజ్జెలు*
*చిన్ని కృష్ణ! నిన్ను చేరి కొలుతు"*

సంస్కృతంలో బిల్హణుడు, పెద్దిభట్టు, బాణుడు, జగన్నాథుడు మొదలైన వారి చాటువులు కనిపిస్తున్నాయి. అట్లే, తెలుగులో వేములవాడ భీమకవి, శ్రీనాథుడు, అల్లసాని పెద్దన, తెనాలి రామకృష్ణుడు, కందుకూరి రుద్రకవి, ఆడిదం సూరకవి మొదలైన వారి చాటువులు ప్రసిద్ధంగా వినిపిస్తున్నాయి.

వేటూరి ప్రభాకర శాస్త్రి గారి చాటుపద్య మణిమంజరి మొదటి భాగాన్ని పరిశీలస్తే 50 మంది కవుల దాకా చాటువులు చెప్పినట్లు తెలుస్తుంది.





వేములవాడ భీమకవి చాటుకవిత్వంలోనేకాక తిట్టుకవిత్వంలోనూ దిట్ట. భీమకవి ఒకరోజు గుడిమెట్ట అనే గ్రామానికి వెళ్ళగా సాగిపోతురాజు అనే అక్కడి ప్రభువు అతని గుఱ్ఱాన్ని బంధించాడట. అప్పుడాతని నోట వచ్చిన చాటువిది.

*"హయ మది సీత, పోతవసుధాధిపుఁ దారయ రావణుండు, ని*
*శ్చయముగ నేను రాఘవుఁడ, సహ్యజ వారధి, మారుఁడంజనా*
*ప్రియతనయుండు, లచ్చన విభీషణుఁ, డాగుడిమెట్ట లంక, నా*
*జయమును బోతరక్కసునిచావును నేడవనాఁడు చూడుఁడీ"*

భీమకవి శాపానుగ్రహాలకు ఆలవాలమైన చాటువులెన్నో ఉన్నాయి. చాటుకవిత్వంలో భీమకవికి, శ్రీనాథునికి కొన్ని పోలికలున్నాయి. ఇద్దరూ ఉద్దండులైన కవులే. బహుదేశ సంచారులే, ఇష్టానిష్టాలను, శాపానుగ్రహాలను తమ చాటువుల్లో ప్రదర్శించినవారే.

భీమన మైలమ భీముని మీద పద్యాలు చెప్పగా, శ్రీనాథుడు కర్ణాటాంధ్ర ప్రభువైన సంబురాయని మీద పద్యాలు చెప్పాడు. సంబురాయనితో కస్తూరినడిగిన చాటువు సుప్రసిద్ధమైంది.

*"అక్షయ్యంబుగ సాంపరాయని తెలుంగాధీశ! కస్తూరికా*
*భిక్షాదానము సేయరా సుకవిరాడ్బృందారక శ్రేణికిన్*
*దాక్షారామచళుక్య భీమవరగంధర్వాప్సరోభామినీ*
*వక్షోజద్వయకుంభికుంభములపో వాసించుఁదద్వాసనల్"*

ఇట్లే సర్వజ్ఞసింగ భూపాలుని ప్రశంసిస్తూ శ్రీనాథుడు చెప్పిన చాటువూ ప్రసిద్ధమైందే.

*"సర్వజ్ఞ నామధేయము*
*శర్వునకే, రావుసింగజనపాలునకే*
*యుర్విం జెల్లును దక్కొరు*
*సర్వజ్ఞుండనుట కుక్క సామజమనుటే".*

శ్రీనాథుడు మొదట కొండవీటిరెడ్ల ఆస్థానకవి. ఆ తరువాత రాజమహేంద్ర వరం రెడ్ల ఆస్థానకవి. ప్రభుద్వయం మీద కవిసార్వభౌముడు చెప్పిన చాటువులకంటే కాలం అనుకూలించక కర్ణాటరాజ్యలక్ష్మిని ప్రార్థిస్తూ చెప్పిన చాటువెంతో



www.etelangana.org

ప్రసిద్ధమైంది.

*"కుల్లాయుంచితిఁ గోఁకసుట్టితి మహాకూర్పాసముం దొడ్గితిన్*
*వెల్లుల్లిం దిలపిష్టమున్, మెసవితిన్, విశ్వస్త వడ్డింపఁగా*
*సల్లా నంబలి ద్రావితిన్ రుచులు దోసంబంచుఁ బోనాడితిం*
*దల్లీ! కన్నడ రాజ్యలక్ష్మి! దయలేదా నేను శ్రీనాథుడన్".*

సింహాచలం జాతరకు శ్రీనాథుడెన్నో సార్లు వెళ్ళి ఉంటాడు. అక్కడి స్త్రీల అందచందాలే అతని చేత ఎన్నో చాటువులు చెప్పించాయి. ఉదాహరణకు ఒక చాటువు.

*"రంభా స్తంభము లూరువు*
*లంభోరుహనిభము లక్షు లతనుశరంబుల్*
*జంభాసురారి మదగజ*
*కుంభము లీనంబివారికోడలికుచముల్".*

ఇలాంటి పద్యాలు శ్రీనాథుడు శృంగారి అన్న అభిప్రాయాన్ని కల్గిస్తున్నాయి. పల్నాడు తెలుగు ప్రాంతంలోనిదే అయినా శ్రీనాథునికి అచ్చిరాలేదు. అతడు దానిపై తనకు గల అనాదరాన్ని ఈ విధంగా చాటుకున్నాడు.

*"రసికుడు పోవఁడు పల్నా*
*డెసఁగంగా రంభయైన నేకులె వడుకున్*
*వసుధేశుఁడైన దున్నును*
*గుసుమాస్త్రుండైన జొన్నకూడే గుడుచున్".*

పల్నాటిసీమ వ్యవసాయానికి ఎంత భారంగా ఉందో, ప్రజల జీవనం ఎంత దుర్భరంగా మారిందో వర్ణిస్తే శ్రీనాథుడే వర్ణించాలి.

*"చిన్న చిన్న రాళ్ళు చిల్లరదేవుళ్ళు*
*నాగులేటి నీళ్ళు నాఁపరాళ్ళు*
*సజ్జజొన్న కూళ్ళు సర్పంబులును దేళ్ళు*
*పల్లెనాటి సీమ పల్లెటూళ్ళు".*

దాహం ఎవరికైనా దాహమే. శ్రీనాథుడు దేశసంచారం చేస్తున్నప్పుడు దారిలో





నీళ్ళు దొరకలేదు. ఇంకేం! ఆయన నోటి వెంట ఒక చాటువే వచ్చింది.

*"సిరిగలవానికిఁ జెల్లును*
*దరుణులు పదియారువేలఁ దగఁ బెండ్లాడన్*
*దిరిపెమున కిద్దరాండ్రా*
*పరమేశా! గంగ విడుము పార్వతి చాలున్"*

ఆశువు అంటేనే వేగం. వేగం చాటువుకు ప్రాణం. ఈశ్వరార్చనకళాశీలుడైన శ్రీనాథుడు శివుణ్ణి గేలిచేయడానికి కూడా సాహసించాడు. ఔను! దాహం వేసినప్పుడు దైవం ఒక లెక్కా? ఆకలివేసినప్పుడు వ్యాసునిచేత కాశినే శపింపజేశాడు మరి! దాహం చాటువును సృజిస్తే, ఆకలి కాశీఖండకావ్య రచనకు దోహదం చేసి ఉండవచ్చు!

శ్రీనాథుడు ఎంతోమంది రాజులను చూశాడు. ఎన్నో ప్రాంతాలు తిరిగాడు. ఎంతో అనుభవం సాధించాడు. ఎన్నో సుఖాలు, ఎన్నో బాధలు అనుభవించాడు. ఎన్నో గ్రంథాలు రచించాడు. ఆయన ఎంత సాహిత్య ప్రియుడో అంత భోజన ప్రియుడుకూడా. అతనికి తెలిసినన్ని రుచులు తెలుగు సాహిత్యంలో మరేకవికీ తెలియవని చెప్పవచ్చు. భోజనం రుచికరంగా లేకపోతే ఆయనకెంత కోపం వస్తుందో ఆయన చాటువులే చెబుతాయి. శ్రీకృష్ణునికి, శివునికి ఆయన చింత చిగురు కూర, బచ్చలికూర వేసుకొని జొన్నకూడు ఒక్కముద్ద తినమని సవాలు విసరడం ఆశ్చర్యమేస్తుంది.

శ్రీనాథుడు వివిధ సందర్భాలలో చెప్పిన చాటువులను క్రమపద్ధతిలో ఒకచోట చేరిస్తే ఆయన జీవిత చరిత్ర తయారవుతుంది. ఐతే, ఆయన అవసానకాలంలో చెప్పిన "కాశికావిశ్వేశు కలిసె వీరారెడ్డి, రత్నాంబరంబులేరాయడిచ్చు" అనే చాటువు మనల్ని కంట తడి పెట్టిస్తుంది. ఈ సీస పద్యంలోని చివరి రెండు పాదాలు ఆయన ఆత్మవిశ్వాసాన్ని, భీషణాహంకారాన్ని తెలుపుతున్నాయి.

*"దివిజ కవివరుగుండియల్ దిగ్గురనగ*
*నరుగుచున్నాడు శ్రీనాథుడమరపురికి"*

చాటుపద్యమణిమంజరి (మొ.భా), 370.

శ్రీనాథుడు అపారమైన కవితా సంపదను తెలుగు ప్రజలకిచ్చాడు. అయినా



www.etelangana.org

అతనిలో ప్రతిభ చావలేదు. ఇప్పుడు స్వర్గానికి పోతే అక్కడ దేవతల గురువైన బృహస్పతి స్థానం ఆక్రమిస్తాడట. అందుకే బృహస్పతి గుండెలు గుబగుబ లాడుతున్నాయట! తెలుగులో చాటువులు చెప్పిన కవుల్లో శ్రీనాథుడే తలమానికం. తెలుగు పరిస్థితి ఇప్పుడు అధ్వాన్నంగా ఉంది. తెలుగు భారతి ఏ పద్యకవికైనా కనిపిస్తే ఆ కవి పోతనగా మారి అతనిలాగానే ఈ చాటువు చెబుతాడు.

*"కాటుక కంటినీరు చనుకట్టుపయింబడ నేల యేడ్చెదో*
*కైటభదైత్యమర్దనునిగాదిలి కోడల! యోమదంబ! యో*
*హాటకగర్భురాణి! నిను నాఁకటికై కొనిపోయి యల్లక*
*ర్ణాటకిరాటకీచకుల కమ్మఁ ద్రిశుద్ధిగ నమ్ము భారతీ!"*

అల్లసాని పెద్దన కృష్ణరాయలచే నిండోలగంలో కవిగండపెండేరాన్ని కాలికి ధరించడానికి ముందు ఆశువుగా చెప్పిన "పూతమెఱుంగులుం బసరు పూప బెడంగులు" అనే ఉత్పల మాలిక చాటు పద్య ప్రపంచంలోనే నిడివి గలది. పెద్దన రాయలతో అలవోకగా ఒక సందర్భంలో చెప్పిన "నిరుపహతి స్థలంబు" అన్న చాటుపద్యం సాధారణంగా కవులకుండే అభిరుచుల్ని చాటుతుంది. చాటు పద్యాలనగానే మనకు గుర్తుకు వచ్చే కవి తెనాలి రామకృష్ణుడు. చాటువులో ఆయన పెద్దనను కూడ విడవలేదు. మనుచరిత్రలోని "అమవసనిసికిన్" అనే పద ప్రయోగాన్ని విన్న రామకృష్ణుడు,

*"ఏమి తిని సెపితివి కపితము*
*బ్రమపడి వెఱిపుచ్చకాయ వడిఁదిని సెపితో*
*యుమెతకయ తిని సెపితివో*
*యమవసనిసి యనెడి మాట యలసని పెదనా!"*

అని ఆక్షేపించినప్పటికీ, పెద్దన అంటే అతనికున్న గౌరవం ఇంతంత కాదు. అందుకు అతడు చెప్పిన మరో చాటువే నిదర్శనం.

*"కవి యల్లసాని పెద్దన*
*కవి తిక్కనసోమయాజి గణుతింపంగాఁ*
*గవి నేను రామకృష్ణుం*
*గవి యను నామంబు నీరుకాకికి లెదే?"*

కవులెందరో ఉన్నా తిక్కన, పెద్దనల తర్వాత తానే కవినని చెప్పి, కవి అనే





పేరు నీరుకాకికి కూడా కలదని ఇతర కవులను వెక్కిరించడం రామకృష్ణుని ఆత్మ ప్రత్యయంతో పాటు, తిక్కన పెద్దనల మీద గల అపారమైన గౌరవాన్ని తెలుపుతుంది. ఈచాటువులోని విచిత్రం ఏమిటంటే రామకృష్ణుడు కవిబ్రహ్మ తిక్కనకంటే ముందు పెద్దనను పేర్కొని, సాహిత్య చరిత్రలో పెద్దనప్రతిభకే పెద్దపీట వేయడం.

తెలుగుకవుల్లో ఒకరంటే ఇంకొకరికి పడదు. ముఖ్యంగా తెనాలి రామకృష్ణునికి మరోకవి పొడ అంటేనే గిట్టదు. కాని, పెద్దనను మాత్రం ఆంధ్రకవితా పితామహునిగా ఎంతో గౌరవించాడు. అట్లే, కవి చౌడప్ప ముందు ఏకవీ నిలవడు, ఒక్క పెద్దన్న తప్ప.

*"పెద్దన వలె కృతి చెప్పిన*
*పెద్దన వలె నల్ప కవిని పెద్దన వలెనా?*
*ఎద్దన వలె, మొద్దన వలె*
*గ్రద్దన వలె కుందవరపు కవి చౌడప్పా!"*

ఇదీ చాటువంటే. ఇలాంటి చాటువులే ప్రజల నాల్కల మీద ఉండి ఎల్లకాలం కవులను గుర్తుండేలా చేస్తాయి.

రాయల కాలం వాడైన కందుకూరి రుద్రకవి చాటువులు విశిష్టమైనవి. విశ్వబ్రాహ్మణుడైన ఆ కవివర్యునికి రాయల ఆస్థాన ప్రవేశం సులభంగా లభించలేదు. చివరికి మంగల కొండోజి అనే రాయలవారి సేవకుని ద్వారా తన కోరిక నెరవేర్చుకొన్నాడు.

*"ఎంగిలి ముచ్చు గులాములు*
*సంగతిగా గులము చెఱుపఁ జనుదెంచి రయా*
*యింగిత మెఱిఁగిన ఘనుఁడీ*
*మంగల కొండోజి మేలు మంత్రులకన్నన్"*

ఈ చాటువు రాజాస్థానాలు ఎలాంటి వారికి ఆశ్రయమిస్తాయో, ముఖ్యంగా మంత్రుల ఆలోచనా సరళి ఎలావుంటుందో తెలుసుకోవడానికి ఉపయోగ పడుతుంది. రుద్రకవి చాటువులు అతని పాండిత్యానికి, కవితా సామర్థ్యానికి చక్కని ఉదాహరణలు.

ఆంధ్రచంద్రాలోక కర్త ఆడిదం సూరకవి 1750 ప్రాంతం వాడు. కవులెక్కువై



www.etelangana.org

అకవిత్వం అధికమౌతున్న సందర్భాన్ని ఏ సుకవీ మెచ్చుకోడు. నకిలీ కవులను చూసి హేళన చేయాలన్న భావనతో చెప్పిన సూరకవి చాటువు గమనింపదగింది.

*"దేవునాన మున్ను దేశాని కొకకవి*
*యిప్పు డూరనూర నింటనింట*
*నేగు రార్గు డేడ్గు రెనమండ్రు తొమ్మండ్రు*
*పదుగురేసి కవులు పద్మనాభ!"*

పద్మనాభుడంటే [illegible]దేవుడని అర్థం. సృష్టికర్తనే సంబోధించి చెప్పడం వల్ల కవుల విషయంలో అతని సృష్టి అస్తవ్యస్తంగా ఉందని చెప్పినట్లైంది.

స్వాతంత్రోద్యమం జరుగుతున్న రోజులను గుర్తుకు తెస్తున్న చాటువొకటి లభిస్తుంది.

*"అసమాన దాన విద్యా*
*రసికత లేనట్టి నరుని బ్రతుకేటికిసీ*
*కసు వేఱుక తిని బ్రతుకదె*
*పసరము తన కడుపునిండ పర్వతకొండా"*

ఈ పర్వతకొండడెవరో తెలియదు కాని, ఈ మకుటంతో చాటువు మాత్రం లభిస్తుంది.

ఇంగ్లీషు చదువు చదివి బాగా సంపాదిస్తూ, ఇతరులకు సాయపడని బ్రతుకు పశువు బ్రతుకు లాంటిదే అని దీని భావం. దేశం కోసం ఉపయోగపడాలన్న సందేశం ఇందులో ఉంది.

కేవలం చమత్కారానికి, హాస్యానికి, ద్వేషించడానికి, భూషించడానికి మాత్రమే పరిమితం కాక, చాటువులు నూటికి నూరుపాళ్ళు కవిత్వాంశతో సహృదయుల్ని అలరిస్తాయి.

చాటువు శబ్దాల గారడీగా కనిపించవచ్చు కాని, తోడుకుంటే ఎంతో కవిత్వం లభిస్తుంది. ఉదాహరణకు తెనాలి రామకృష్ణుని పేరుతో ఉన్న ఈ క్రింది చాటువులోని అందాన్ని వీక్షిద్దాం.

*"నరసింహ కృష్ణరాయని*
*కరమరుదగు కీర్తి యొప్పె కరిభిద్గిరిభి*





త్కరి కరిభిద్గిరి గిరిభి

*త్కరి భిద్గిరిభిత్తురంగ కమనీయంబై".*

కృష్ణదేవరాయల కీర్తి ఎంతో అరుదైందని దీని భావం.

అర్థం కరిభిత్ = గజాసురుణ్ణి సంహరించినవాడు (శివుడు), గిరిభిత్ కరి = కొండలకు శత్రువైన ఇంద్రుని ఏనుగు (ఐరావతం), కరిభిత్ గిరి = శివుని కొండ (కైలాసం), గిరిభిత్ = వజ్రాయుధం, కరిభిత్, గిరిభిత్తురంగములు = శివుని, ఇంద్రుని వాహనాలైన నందీశ్వరుడు, ఉచ్చైశ్రృవం.

శివుడు, ఐరావతం, కైలాసం, వజ్రాయుధం, నంది, ఉచ్చైశ్రృవం... ఇవన్నీ తెల్లనివే. కృష్ణరాయల కీర్తి తెల్లనిదే. కాని వాటికంటే మనోజ్ఞమైంది.

చాటువు సమయానుస్ఫూరికి మాత్రమేకాక, సాహిత్య సంపదకూ ఆలవాలమైందంటానికి ఇంత కంటే ఏం కావాలి?



www.etelangana.org

# 11. చిన్మయ సూరి

నేను బాల వ్యాకరణాన్ని పరీక్షల కోసం పన్నెండేళ్లు చదివాను. ముప్పై ఏళ్లుగా బోధిస్తున్నాను. చిన్నయసూరి బాల వ్యాకరణాన్ని కావ్య భాషకు రాశాడు. సూత్ర రచనలో ఆయన పాణినిని తలపిస్తాడు. బాలవ్యాకరణంలో ఆయా పరిచ్ఛేదాలలో ఆయా సూత్రాలకు చూపబడ్డ ఉదాహరణలను గమనిస్తే, చిన్నయసూరి ఎంతటి కావ్యజ్ఞుడో, అంతటి ఆధ్యాత్మిక వేత్తగా గోచరిస్తాడు.

నేనీ వాస్యంలో ఒక్క సంధి పరిచ్ఛేదాన్ని మాత్రమే గ్రహించి దానిలోని కొన్ని సూత్రాల ఆధారంగా సూరి తాత్త్వికతను ఎరుకపరుస్తాను. వేదాల్లో యజుర్వేదం రెండవది. అందలి చివరి అధ్యాయమే ఈశావాస్యోపనిషత్తు. అలాగే సంధి పరిచ్ఛేదంలోని చివరి పదకొండు సూత్రాలు నాకు ఒక ఉపనిషత్తును గుర్తుకు తెస్తున్నాయి. గురు శిష్యుల అనుబంధానికి ఈ సూత్రాలు అద్దం పట్టాయి. వరుసగా వాటికిచ్చిన ఉదాహరణలను గమనిస్తే మన జీవితాన్ని చక్కదిద్దుకొనే మార్గం బోధపడుతుంది.

శిష్యుడు తనకున్న ఆస్తిని ఇతరులకు చూపిస్తూ 'నాది' అని గర్వపడుతున్నాడు. ఇల్లు, పొలం, నగలు, పశు సంపద మొదలైన వాటిని చూపిస్తూ 'నావి,నాయవి' అని విర్రవీగుతున్నాడు.

ఇంతలో గురువుగారు కనిపించారు. శిష్యుడు గురువుగారిని చూడగానే భయపడ్డాడు. ఇది గమనించిన గురువు శిష్యునికి జ్ఞానోపదేశం చేయాలని, సూత్రం పట్టాడు. అనగా యజ్ఞోపవీతాన్ని చేతబట్టి, అందలి మూడు పోగులను చూపిస్తూ పితృఋణాన్ని, గురు ఋణాన్ని, సమాజ ఋణాన్ని గుర్తుకు తెచ్చాడు.

కాని, శిష్యుడు ఏదో పరధ్యానంలో ఉన్నట్లు గమనించాడు గురువు. అందుకే, ఆయన 'చూడునన్ను' అన్నాడు. కాని శిష్యుడు ఇంకా తనను పట్టించుకోవడం లేదు. గురువు గారు 'ఇటు చూడు' మని గద్దించాడు. ఆ తర్వాత నెమ్మదిగా శిష్యునికి అహంకారం పనికిరాదని హితవు పలికి, ఈ సంపదలు విశ్వసింప దగ్గవి కావని, 'నమ్మకు మాట' అని తెలియజేశాడు. చెప్పదగ్గ మాటలు చెప్పాడు కనుక గురువు గారు అక్కడి నుండి వెళ్లి పోవడానికి సిద్ధమయ్యాడు. అప్పుడు





శిష్యుడు గురువు గారి ప్రబోధం చేత ప్రభావితుడై "ఉండుండు" మని బ్రతిమిలాడినాడు. అంతే కాదు తాను గర్వించినందుకు శిక్ష పడవలసిందేనని భావించిన ఆ శిష్యుడు గురువుగారిని "కొట్టుకొట్టు" దని కూడా తలవంచాడు.

కరుణాళువైన గురువు శిష్యుణ్ణి దండించటానికి బదులు "వర్ధతాంశ్రీ" అని ఆశీర్వదించాడు. అందుకు గౌరవ భావంతో శిష్యుడు "తుభ్యం నమః" నీకు నమస్కారం అని చేతులు జోడించాడు. ఇంత మాత్రాన నమస్కారం చెప్పాలా 'కింతత్' అదేమిటని గురువు శిష్యుణ్ణి దగ్గరికి తీసుకున్నాడు. ప్రేమతో శీర్షాన్ని నిమురుతూ 'కస్త్వమ్' ఇంతకు నీవెవడవో చెప్పు – అని తెలిసి కూడా ప్రశ్నించాడు. కాని శిష్యుడు అప్పటికే ఆత్మప్రత్యయం కల్గిన వాడైనందున మళ్లీ 'నేను' అని, 'నాది' అని అనక వినమ్రంగా "దాసోహ" మన్నాడు.

నిగర్విగా మారిన శిష్యుని ముఖాన్ని అవలోకిస్తూ గురువు, శిష్యుని కర్తవ్యకర్మ ఏమిటో తెలుసుకోవాలనుకున్నాడు. అందుకే "తత్కర్తవ్యమ్" అని చేయదగ్గ పనిని గుర్తుకు తెచ్చాడు. భాగ్యవశాన అక్కడే గోమాత నిలుచుంది. గురువు తన సమీపంలో ఉన్న ధేనువును చూపిస్తూ "ఇయంధేనుః" అని శిష్యునితో పలికాడు. శిష్యుని కర్తవ్యకర్మ మరేమిటో గాదు గోసేవే.

గోవు పరోపకారానికి గుర్తు. పరమేశ్వరుడు మనుష్య సృష్టితో పాటు గోసృష్టి చేసినట్లు బృహదారణ్యకాది ఉపనిషత్తులు చెబుతున్నాయి. గోవును ఆదర్శంగా తీసుకొని నడవడమే మానవజాతి కర్తవ్యం.

ధేను పాలన కర్తవ్య దీక్షా బద్ధుడైన శిష్యునితో గురువు మరొక్క విషయాన్ని గుర్తు చేశాడు. అదే "సత్యము సర్వశ్రేయము – అది లేనిచో సర్వధర్మములు వ్యర్థములు" అని. ఎన్ని ధర్మాలు పాటింపబడ్డా సత్యాన్ని పలకక పోతే అవన్నీ వ్యర్థమని గురువు గారి మాటల సారాంశం. సత్యాన్ని వ్రతంగా చేసుకొని ఏ పనైనా నిర్వహిస్తే అది తప్పక నెరవేరుతుంది కదా!

చిన్నయసూరి కేవలం వ్యాకరణ పండితుడే కాదు, గొప్ప ఆధ్యాత్మికవేత్త. సృష్టికర్త పరమేశ్వరుని ముందు మానవుడు చిన్నవాడే కనుక అహంకారం పనికి రాదన్నాడు. పరమేశ్వరునికి దాసోహ మనడం కంటే శ్రేష్ఠమైంది ఏమీ లేదన్నాడు. వైష్ణవ సంప్రదాయంలో దాసభక్తికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ఇక్కడ గమనార్హం.



www.etelangana.org

ఈ సందర్భంలో గమనింపదగ్గ మరో అంశం గోసేవ. గోరక్షణను కర్తవ్యంగా చేపట్టాలి. గోవును రక్షించుకుంటే సమస్త దేవతలూ రక్షింపబడుతారు. ఇక సత్యం గురించి ఒక్క మాట. యమనియమాల్లో సత్యం ఒకటి. అహింస తర్వాత దానికే ప్రాధాన్యం. అన్ని శుభాలు కల్గించేది అదే కనుక సూరి "సత్యమే సర్వశ్రేయము" అన్నాడు.

అహంకారాన్ని విడిచిపెట్టి, సృష్టికర్త ఐన పరమేశ్వరునికి దాసుడై, గోరక్షణ గావిస్తూ సత్యాన్ని వ్రతంగా పాటించాలని మనకు బాల వ్యాకరణం ద్వారా సందేశాన్ని అందజేసిన చిన్నయసూరి నిజంగా చిన్మయసూరే.



## 12. తెలుగు - మరాఠీ అనుబంధాలు

కన్నడ రాజులు మహారాష్ట్రను పాలిస్తే, మహారాష్ట్రులు తంజావూరును పాలించారు. ఎవరు పాలించినా, ఒకరి ఏలుబడిలో మరొకరు సుఖంగా ఉన్నారే తప్ప కష్టాలపాలు కాలేదు. ఒకరిని మరొకరు పరిపాలిస్తున్నారన్న భావన గాక, మనమంతా భారతీయులమే అన్న భావన ఆనాటిది.

తెలుగు-మరాఠీ సంబంధాలను తెలుసుకోవాలంటే కొన్ని శాసనాలను గూర్చి చెప్పుకోవలసి ఉంది. గోంకరాజు వేసిన భట్టిప్రోలు శాసనం శకసంవత్సరం 1064 నాటిది. ఇది పండరిపుర శాసనం కంటె 47 సంవత్సరాల ముందటిది. తూర్పు చాళుక్యుల నాటి ఈ శాసనం తెలుగు పద్యాల్లో ఉంది. దీని ప్రత్యేకత ఏమంటే ఇందులో "విఠల" శబ్దం కనిపిస్తుంది. "విఠలేశ్వర దేవమ్రోల హవళిందనకున" అని. ఈ శాసనం వల్ల తెలుగు ప్రాంతం మహారాష్ట్ర ప్రాంతం లాగా విఠలేశ్వరుని పూజలో పునీతమైందని చెప్పవచ్చు. ప్రబంధకవి తెనాలి రామకృష్ణుడు శ్రీ పాండురంగ మాహాత్మ్యం రచించడం అందుకు చక్కని ఉదాహరణ.

మహారాష్ట్రుడైన శహాజీరాజు తంజావూరు సంస్థానాన్ని 1684 నుండి 1712 వరకు పరిపాలించాడు. మహారాష్ట్రుడైనప్పటికీ తెలుగులో రచనలు చేసి తెలుగును రాజభాషగా గౌరవించిన మహాప్రభువాయన. నన్నెచోడుని కుమారసంభవానికి, ద్విపదరామాయణానికి శుద్ధప్రతులను రాయించింది ఆయనే. 'శహాజీరాజపురం' అనే అగ్రహారాన్ని కవి పండితులకు దానంగా ఇచ్చిన మహాదాత కూడా ఆయనే.

శహాజీరాజు ఆస్థానంలో గిరిరాజకవి, సోమకవి, శేషాచలపతి, వాసుదేవకవి, రామకవి, బాలకవి సుబ్బన్నకవి మొదలైనవారు ప్రముఖులు. సంస్కృత కవులలో రామభద్రదీక్షితుడు, వేదకవి, అప్పయ్యదీక్షితుడు, శ్రీధరవేంకటార్యుడు ముఖ్యులు. శహాజీరాజు మొత్తం 26 రచనలు చేయగా వాటిలో 22 దాకా తెలుగు రచనలే. ఇవన్నీ సామాన్యులను సైతం అలరించగల్గినవే.

శహాజీ రచించిన నాటకాల్లో నాంది ప్రత్యేకమైంది. అది కథావస్తువును బట్టి శివస్తుతి లేదా కృష్ణస్తుతితో మొదలౌతుంది. సూత్రధారుడు కవిపేరు, నాటకం పేరు చెప్పి కథాక్రమం వినిపిస్తాడు. ఆ తర్వాత ప్రస్తావన, విఘ్నేశ్వరస్తుతి ఉంటాయి.



www.etelangana.org

దరువులు, వచనాలు, ద్విపదలు, వివిధభాషలలో ప్రసంగాలు ఉంటాయి. ఉదాహరణకు శహాజీ రాజు రచించిన "పంచభాషావిలాసం" తెలుగు, తమిళం, మరాఠీ, హిందీ, సంస్కృత భాషల్లో కొనసాగింది. ఐదుగురు కన్యలు ఐదు భాషల్లో కృష్ణునితో మాట్లాడటం ఇందలి ప్రత్యేకత. రాజుకు భాషాద్వేషం ఉండకూడదంటానికి ఈ నాటకం ఒక నిదర్శనం.

శహాజీరాజు మరాఠీలో రచించిన 'గంగా కావేరీ సంవాద్' లో తెలుగు సంభాషణలున్నాయి. ఈనాటకంలో సూత్రధారుడు తెలుగులో మాట్లాడుతాడు. ఇది తెలుగు-మరాఠీ అనుబంధాన్ని తెలియజేస్తుంది. ఉదాహరణకు నటి పలికిన పలుకులు గమనింపదగ్గవి. "ఏమయ్యా! స్వామిలు మీకు సన్యాసం ప్రాప్తమయ్యింది యెట్లాగు"? అని 'స్వామి' శబ్దం సంస్కృతం. ఇది మరాఠీలోను, తెలుగులోను వాడుకలో ఉన్నదే. తెలుగులో బహువచన ప్రత్యయం 'లు' పరంగా ఉన్నప్పుడు ఇత్వానికి ఉత్వం వస్తుంది. స్వామి లు స్వాములు అవుతుంది. కాని మరాఠీలో ఏక్‌స్వామి, దోస్వామి, దస్‌స్వామి అనే వ్యవహారం ఉంది. అందుకే బహువచనంలో 'స్వామిలు' అని మరాఠీలు పిలవడం విశేషం. ఇది తెలుగు-మరాఠీ భాషానుబంధాన్ని సూచిస్తుంది. నటి ప్రశ్నకు సూత్రధారుడు తెలుగులోనే జవాబిస్తాడు. "వినరోయి భాగవతులారా ఆయన మహారాష్ట్ర ఆయన గనుక ఉద్యోగం చేసి నష్టతుష్టి కోసరం సన్యాసం పుచ్చుకుంటిని"అని, కోసం, కోసరం సమానార్థక శబ్దాలు.

మరాఠీ నాటకాల్లో సూత్రధారులు తెలుగువాళ్లు కనుక వారి సంభాషణలు తెలుగులోనే ఉండి ప్రేక్షకులను ఆకట్టుకోవడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

***"హరిదాసులు వచ్చి హాస్యం చేసిరి"*** -హరిహరవిలాస్.

***"లక్ష్మీదేవి వచ్చి సముద్రరాజుకు నమస్కారం చేసేది"***

- లక్ష్మీనారాయణ కళ్యాణం.

శహాజీ రచించిన 'లక్ష్మీనారాయణ కళ్యాణం'లో "వచ్చి దేవాంగనలు దండం పెట్టి కూరుదేది" అనే వాక్యం ఉంది. కూర్చుండేదే కూరుదేది అయ్యింది.

మరాఠీలో తెలుగు ప్రబంధాలకు అనుకరణలున్నాయి. తెలుగు ద్విపదరామాయణానికి 'సంతాజీ సాళున్కే' రచించిన "సంతాజీ రామాయణం" లోని సుందర, యుద్ధకాండాల్లో అనుకరణలు కనిపిస్తాయి. తంజావూరు సంస్థానంలో





పండితుడు, మరాఠీ రాజప్రతినిధి శ్రీనిరంజన్ మాధవ్ (కాంచీవర వాస్తవ్యుడు) సుభద్రా చంపూ కావ్యం రచించాడు. చేమకూర వేంకటకవి విజయవిలాసంలోని కల్పనలు అతణ్ణి ఆకర్షించి ఉంటాయి. కనుకనే వాటినతడు కొన్ని చోట్ల అనుకరించాడు.

విజయ విలాసం:-

***"అంగము జాళువా పసిడియంగము, క్రొన్నెలవంక నెన్నొసల్,***
***ముంగురు లింద్ర నీలముల ముంగురు, లంగజు డాలు వాలు. చూ***
***పుంగవ, యేమిచెప్పు? నృపపుంగవ ముజ్జగ మేలజేయు న***
***య్యంగన బోలు నొక్క సకియంగన నెన్నగ మించునన్నిటన్"***(1-40)

సుభద్రాచంపూ:-

***"స్వవర్ణే హే జింతీసుతను***
***నవజాంబూనదకళా***
***కపాళీ అర్ధేందు సదృశ***
***ఉపమా సుందరవరీ"*** (1-14 15)

'సుభద్రాచంపూ' లోను విజయవిలాసంలో లాగానే సుభద్రశరీరం మేలిమి బంగారపు తునక గాను, అందమైన ఫాలభాగం విదియనాటి చంద్రవంకగాను వర్ణింపబడడం గమనార్హం.

విజయ విలాసంలో ఉలూచి పరంగా ఉన్న "నువ్వు పువ్వు నవ్వు జవ్వని నాసిక" (1-84) వర్ణన "సుభద్రాచంపూ"లో సుభద్ర పరంగా ఉండడం విశేషం.

***"తిళాచ్యా పుష్పాచే యశజణుని నాసామిరవిలీ"*** - (1-16)

ఇట్లే విజయవిలాసంలో "చెప్పెడి దేమి కన్నుగవ చేరలకెక్కెడు చంద్రబింబమే తప్పదు మోము" అనే దానికి 'సుభద్రాచంపూ'లో "పశామధ్యే దోన్హినయన నసమాతీ వపుకళా" అనే అనుకరణ కనిపిస్తుంది.

17వశతాబ్ది వాడైన మరాఠీ కవి వెంకునందన్ 'బాలజీ చరిత్ర' ఆధారంగా "శ్రీ వెంకటేశ స్వయంవర్" అనే హరికథను రచించాడు. ఇందలి ఇతివృత్తం పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణం. వేంకటేశ్వరుడు ఎఱుకలసాని వేషంలో వకుళాదేవి దగ్గరికి రావడం, పద్మావతిని శ్రీ వేంకటేశ్వరునికిచ్చి పెళ్లి చేయమని చెప్పడం మొదలైన ఘట్టాలు "శ్రీ వేంకటేశ్వర స్వయంవర్"లో చక్కగా వర్ణింపబడ్డాయి.



www.etelangana.org

మరాఠీలో ఎఱుకలసానిని 'కురత్తి' అంటారు. 'కురత్తి' నుండి వచ్చిందే 'కురవంజి' శబ్దం.

శహాజీ రచనల్లో యక్షగానాలు సుప్రసిద్ధమైనవి. ఇవి పద్యాలకు, దరువులకు, వచనాలకు ఆలవాలమైనవి. శహాజీ రచించిన 'శ్రీ త్యాగరాజవిలాసం' అనే యక్ష గాన ప్రబంధం మరాఠీలో తెలుగు ఛందస్సులేవిధంగా అవతరించాయో నిరూపిస్తుంది. మరాఠీలో యతి ప్రాసలు లేవు. కాని తెలుగు ఛందస్సుల ప్రభావంతో అవి మరాఠీలో ప్రవేశించాయి. పద్యంలో ఏపాదానికి ఆ పాదం తెగాలి కాని, ఒకధ్ధానిలోకి మరోటి రావడం మరాఠీలో తప్పుగా భావిస్తారు. సంస్కృతంలోను ఇదే పద్ధతి ఉంది. ఐతే దీనికి విరుద్ధంగా తెలుగు ప్రభావంతో మరాఠీలో యతి ప్రాసలు కనిపిస్తాయి.

ఉత్పలమాల: –

*"తారకనాథ ధారి వరత్యాగమహేశ్వర ఐసకేల ఆ*
*హారకశాల, వస్త్రమణిహారకశాల, లిలాసహాసశృం*
*గారకశాల, భూషణద కాపుర వేదెకశాల సాధ సం*
*చారకశాల దేహ ఉపచార కసాల కశాల యౌవనా"*

– (త్యాగరాజలిలాసం)

తారకనాథుడు చంద్రుడు. చంద్రుణ్ణి తలమీద ధరించినవాడు శివుడు. త్యాగరాజంటే శివుడని అర్థం. శివస్తుతి ఈ పద్యంలో కనిపిస్తుంది. ఇట్లే ద్విపదలు కూడా మరాఠీలో యతిప్రాసలతో కనిపిస్తాయి.

*"కమనీయశ్రీపురి కవి సందరాఖ్య*
*రమణీయ పర్వ కళావంతిని వరి"* – (త్యాగరాజలిలాసం)

తెలుగు ఛందస్సులకే అలంకారమైన తేటగీతి మరాఠీలో ఎంతో చక్కగా ఒదిగింది. పార్వతి విరహ వర్ణనకు సంబంధించిన పద్యాన్ని చూడండి.

*"నీలనిభవేణి గౌరి యేణేప్రకారె(ర)*
*కాలసన్నిభ కాయజె(జ) కంజబాణ*
*జ్వాలపీడిత పాహూన సహత జలధి*
*మధ్య సత్వర సూర్యాస్తమాన ఝూల"* – (త్యాగరాజలిలాసం)

ఇట్లే మరాఠీలో మన కందం ఎంత అందంగా కనిపిస్తుందో చూడొచ్చు.





*"పురుహూతపుర తిరస్కరి*
*ధరణీ నారీ సకబరి – ధనధర్మకరీ*
*వరకుసుమ గంధలహరీ*
*పరమముని స్వాంతహారి పద్మానగరీ"*

తెలుగు యక్షగానాల ప్రభావం మరాఠీ సాహిత్యం మీద ఉన్నట్లే మరాఠీ సాహిత్య ప్రభావం తెలుగు సాహిత్యం మీద ఉంది. మరాఠీలో మహిపతి(1715–1790) రచించిన మహాభక్త విజయం పాండురంగ విఠలుని మహిమను వర్ణిస్తున్న పద్యకావ్యం. దీన్ని తెలుగులో 1948లో జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి గారు, 1953లో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు, 1988లో శతావధాని ధూళిపాల రామమూర్తి గారు తెనిగించారు. దీనిలో పుండరీకుడు, నామదేవుడు, కూర్మదాసుడు, తుకారాం, జ్ఞానదేవుడు, రాకాకుంభారుడు, గోరాకుంభారుడు, జనాబాయి, ఏకనాథ్, సక్కుబాయి, పరమానంద్ మొదలైన మహాభక్తుల చరిత్రలున్నాయి. వీరిలో సతీసక్కుబాయి, తుకారాంలపై సినిమాలు వచ్చి తెలుగు ప్రజలను అలరించిన సంగతి మరవరానిది. ఊరూర గ్రామఫోను రికార్డులు పెట్టి వినిపించడం కూడా జరిగింది. త్యాడి వెంకటేశ్వరశాస్త్రి గారు 1925లో భక్తతుకారాం నాటకం రాయగా, చెర్విరాల భాగయ్యగారు "పుండరీక చరిత్ర" పేరుతో యక్షగానాన్ని రచించారు. 1976లో ప్రచురితమైన 'సరస్వతీ పుత్ర' పుట్టపర్తి నారాయణాచార్యులవారి 622 పుటల "పండరీ భాగవతం" తెలుగు మరాఠీ సాహిత్యానుబంధాలకు నిలువెత్తు సాక్ష్యమనక తప్పదు.

పుండరీకుడు(బ్రాహ్మణుడు) చోఖామేళుడు (దళితుడు), నామదేవుడు(దర్జీ), గోరాకుంభారుడు (కుంభకారుడు), నరహరి సోనార్ (స్వర్ణకారుడు) మొదలైన వారి చరిత్రలు పండరీ భాగవతంలో ఉన్నాయి. మహారాష్ట్రులు చారిత్రక వ్యక్తుల నుంచి గొప్ప స్ఫూర్తిని పొందినారంటానికి వారి సాహిత్యమే ఒక ఉదాహరణ. సమకాలీన భక్తుల చరిత్రలను కూడా గ్రంథస్థం చేసిన గౌరవం మహారాష్ట్రులకే విశేషంగా దక్కుతుంది. కులాల మధ్య గల అంతరాలను తొలగించడంలో పాండురంగడు విజయాన్ని సాధించాడు. తెలుగులో పండరినాథుని ప్రాచుర్యం తక్కువే అయినా, ఆ దైవం పేర బొమ్మిశెట్టి సత్యనారాయణదాసు "పాండురంగ భజన కీర్తనలు" రాసి, వరంగల్, విజయవాడ, మచిలీపట్నం, మైలవరం



www.etelangana.org

(గుంటూరు), బాపట్ల (ప్రకాశం) మొదలైన ప్రాంతాల్లో ప్రచారం చేశాడు. తెలుగు, మరాఠీ ప్రజలను కలపడానికి పాండురంగ విఠలుడు వారధిగా నిలచాడని చెప్పొచ్చు.

*"రండయ్యో రండయ్యో! పండారి పురమునకు*
*సేవించివత్తాము! శ్రీ పాండురంగనిని*
*రేపటికో మాపటికో! మన తనువు శాశ్వతమా?*
*ఊపిరి వుండగానే! ఒకసారి పోయివత్తాము"*

తెలుగు కవులు పాండురంగణ్ణి తెలుగువారికి సన్నిహితం చేస్తే, మరాఠీ కవులు బాలాజీని మహారాష్ట్రులకు సన్నిహితం చేశారు. మహారాష్ట్రుల దృష్టిలో పాండురంగడు కేవలం బుక్కా (అబీర్)తో సంతృప్తి చెందితే, వెంకటేశ్వరుడు మాత్రం కోట్లకు పడగలెత్తి శ్రీమంతుడుగా భాసిస్తున్నాడు. మహారాష్ట్రలో జానపదులు ఈ ఇద్దరిని కలిపి ఈ క్రింది విధంగా పాడుకొంటారు.

*"బాయీ! గిరీసా బాలాజి / హాయ్ పైచాసా లాలచి*
*మాళ్ బుక్యాతా సంతోషీ / పండరీస పాండురంగ"*

మరాఠీలో 'మాళ్' అంటే పుష్పహారం. 'బుక్యాత్' అంటే బుక్కాగులాలు.

దక్షిణ భారతంలో తిరుపతి, పూరీ, పండరిపురీ మహాపుణ్యక్షేత్రాలు. ద్రవ్యదానానికి తిరుపతి, అన్నదానానికి పూరి, భక్తి దానానికి పండరి క్షేత్రాలను ముఖ్యమైన ఆటపట్టులుగా లెక్కిస్తారు. బాలాజీని ద్రవ్యబ్రహ్మగాను, జగన్నాథుని అన్న బ్రహ్మగాను, పాండురంగణ్ణి నాదబ్రహ్మగాను ఉపాసించడంలో వారి ప్రత్యేకత గోచరిస్తుంది. మొదటి ఇద్దరు దేవతలు లోకాభ్యుదయానికి కారణమైతే, పాండురంగడు మాత్రం మోక్షానికి కారణమని వారి నిశ్చితాభిప్రాయం.

తెలుగు ప్రాంతంలో నివసించే మహారాష్ట్రులకు పాండురంగడంటే ఎంత భక్తో, బాలాజీ అంటే అంతే భక్తి. ఒక దేవతలో మరొక దేవతను చూసే సంస్కృతి వారిది. ఇదేకదా ఏకాత్మత అంటే.

ఆచార్య మాణిక్‌రావ్ ధనపలవార్ స్వయంగా వినిపించిన ఈ గేయం ఇదే విషయాన్ని ధ్రువపరుస్తున్నది.

*"అక్కడ ఉండే పాండురంగడు/ ఇక్కడ ఉన్నాడే*
*ఇక్కడ నుండి హృదయములోపల/ వెలుగుచు న్నున్నాడే"*

భక్తితో భారత దేశాన్ని అఖండంగా ఉంచగల్గిన శక్తి భక్తకవులదే. లేకపోతే





ఇక్కడి బాలాజిలో అక్కడి పాండురంగవిఠలుణ్ణి ఎలా చూడగలుగుతారు? మహారాష్ట్రులు విఠలనామం స్మరిస్తే, తెలుగువారు పాండురంగ విఠలనామాన్ని స్మరిస్తారు. ఇక కర్ణాటకులు విజయ విఠలుని పేరుతో స్తుతిస్తారు.

మహారాష్ట్రలో వారం వారం విఠలుణ్ణి దర్శించే సంప్రదాయం ఉంది. దీనికే వారకరీ సంప్రదాయం అని పేరు. దీన్ని సంత్ జ్ఞానేశ్వర్ ప్రవేశపెట్టాడు. ఇదే సగుణ భక్తి సంప్రదాయం. వారకరీ, భక్తి, విఠల సంప్రదాయాలు మూడూ ఇంచుమించుగా ఒకటే. మన తెలుగు వారు కూడా వారం వారం వేంకటేశ్వరుణ్ణి దర్శించుకునే సంప్రదాయం ఉంది. ఇది రెండు రాష్ట్రాల ప్రజల అనుబంధాన్ని తెలియజేస్తుంది.

'సార్థ జీవన ముక్త భజన మాల' పేరుతో మరాఠీలో ఒక కీర్తనల పుస్తకం లభిస్తుంది. దీనిలో భక్త తుకారాం 'అభంగ్' ఒకటి తెలుగు అనువాదంతో కనిపిస్తుంది.

*"హేచి దాన దేగా దేవా! / తుజా విసర నవ్హావా*
*గుణ గాయీ న ఆవడీ/ హేచీ మాఝీ సర్వజోడీ*
*నలగే ధన ముక్తీ సంపదా/ సంత్‌సంగ్ దేయీ సదా*
*తకామణే గర్భవాసీ / సుఖే ఘాలావే ఆమాసీ"*

తెలుగు అనువాదం: "ఓ దేవా! నీపై విస్మృతి గల్గకుండునటుల నాకిదియె దానంబొసగుము. నాకు నీ గుణముల నతిప్రేమతో వర్ణించుటయె యాచిత ధనము. నాకు ధన సంపద ముక్తులతో నక్కరలేదు. ఎల్లప్పుడు సత్పురుష సాంగత్యమే యొసగనెంచినచో నన్ను సుఖమగు గర్భమందే వేయవలెనని..."

తుకారాం భగవంతుణ్ణి ఏమి కావాలని కోరాడో ఈ పంక్తులు స్పష్టం చేస్తాయి. పెళ్లి ఆచారవ్యవహారాలను పరిశీలిస్తే, మనలాగే సప్తపది మహారాష్ట్రుల కుంది. కాని నాగవల్లి అనే ఆచారం మాత్రం మహారాష్ట్రులకు తెలుగు వారినుండి సంక్రమించిందే.

బ్రతకడానికి ఒక ప్రాంతం నుండి మరోప్రాంతానికి వలస పోవడం జరుగుతుంది. తెలుగు వారెందరో సోలాపూర్ ప్రాంతంలో నివాసం ఏర్పర్చుకున్నారు. ఇప్పటికీ వారికి తెలుగు వారితో వైవాహిక, వ్యాపార సంబంధాలు ఉన్నాయి. తెలుగు వారు సోలాపూర్ చద్దర్లను ఎక్కువగా ఉపయోగిస్తారు. ముంబై, బివండీ,



www.etelangana.org

అహ్మద్‌నగర్ ప్రాంతాల్లోకూడా తెలుగు వారు చాలమంది ఉన్నారు. భోజనం విషయానికి వస్తే తెలుగు వారికి వరిఅన్నం ఇష్టం. మరాఠీలకు రొట్టెలంటే ఇష్టం. మహారాష్ట్రలో పూర్వం భోజనం పద్ధతి చావల్-రోటి-చావల్. ఇది వివాహ సందర్భాల్లో కనిపిస్తుంది. కాని వ్యవహారంలో రోటీ, ఆ తర్వాత చావల్. ఈ అలవాటు మహారాష్ట్రులనుండి తెలుగువారికబ్బింది. భోజనంలో ఏదో ఒక స్వీటు ఉండాలని మరాఠీలు కోరుకుంటారు. ఉదాహరణకు గులాబ్‌జాం కావచ్చు, జిలేబి కావచ్చు. శుభసందర్భాల్లో బూంది లడ్డుకు ప్రత్యేకత ఉంది. పెళ్లి భోజనం తర్వాత బూందిలడ్లను ఐదింటిని చుదువాతో కలిపి పెళ్లికి వచ్చిన అతిథులకివ్వటం మహారాష్ట్రలో ఇప్పటికీ ఉన్న ఆచారమే. సన్మాన కార్యక్రమాల్లో కొబ్బరికాయలను గాని, సోలాపూర్ చద్దర్లను కాని బహుకరించడం కూడా అక్కడి ఆచారమే.

పెళ్లిళ్లలో మరాఠీలు అక్షంతలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. వేదమంత్రాలు చదువుతూ, ఒకేసారి అక్షంతలు చల్లి వధూవరుల్ని ఆశీర్వదించడం అక్కడి ఆచారం. ఐతే జిల్కరబెల్లం పెట్టడం, కాల్దొక్కించడం మొదలైన ఆచారాలు అక్కడి వారికి లేవు. పెళ్లిళ్లు జరుగుతున్నప్పుడు రాహుకాలాన్ని పట్టించుకోరు. తొంబై తొమ్మిది శాతం పెళ్లిళ్లు ఉదయమే జరుగుతాయి. మహారాష్ట్రులకు కట్నాలు నచ్చవు. అక్కడ లక్ష ఇస్తే సంతోషమే. తెలుగు ప్రాంతంలో మాత్రం ఎన్ని లక్షలిచ్చినా తక్కువే. ఐతే తెలుగు ప్రాంతంలోని ఈ ఆచారం క్రమంగా మహారాష్ట్రకు కూడా ప్రాకింది.

తెలుగు, మరాఠీ ప్రాంతాలు దగ్గర దగ్గరగా ఉండడం వల్ల ఇద్దరి మధ్య సంబంధాలు ఏర్పడ్డాయి. వ్యాపార, వైవాహిక సంబంధాలతో పాటు, సాహిత్య ఉద్యమాలు కూడా ఇరువురి మధ్య సత్సంబంధాలకు పునాదులు వేశాయి. తెలుగు సాహిత్య చరిత్రలో దళిత ఉద్యమం మరాఠీ ప్రభావంతో వచ్చిందే. తెలుగు వారికి అల్లూరి సీతారామరాజంటే ఎంత ఇష్టమో, శివాజీ అంటే అంతే ఇష్టం. జాతీయోద్యమ రథసారథులైన లోకమాన్య బాలగంగాధర తిలక్, అంబేద్కర్, జ్యోతి రావు పూలె, సావర్కర్ లాంటి మహాపురుషులు మహారాష్ట్రలో జన్మించినప్పటికీ తెలుగు వారికి అత్యంత సన్నిహితులయ్యారు.

తెలుగు వారికి మహారాష్ట్ర అంటే ఉత్తేజం కలుగుతుంది. తెలుగు, మరాఠీల అనుబంధం ఎన్నటికీ చెరిపివేయడానికి వీలులేనిది.



www.etelangana.org